PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 155 | విజయవాడ, సోమవారం 6 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 6 January 2025 | Rs

ఆక్రమణలో వక్ఫ్ ఆస్తులు

- ప్రభుత్వ సమాచారంపై మీడియా వక్రభాష్యం
- హక్కుదారులనే ఆక్రమణదారులుగా చిత్రించే ప్రయత్నం

7

సిరీస్ చేజారె..!

- బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసీస్ సొంతం

8

యుటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్.లక్ష్మణరావు

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరు

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు పిలుపు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి, పిఠాపురం

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయాలని, ప్రభుత్వ విద్యా రంగంలో సామాజిక న్యాయాన్ని కాపాడేందుకు కృషి చేయాలని శాసన మండలిలో పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. యుటిఎఫ్ ఏర్పడి 50 ఏళ్ళు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ కాకినాడలోని పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు జరగనున్న ఈ మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 20 వేల మంది తరలివచ్చారు. తొలుత యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.సత్తిరాజు జాతీయ పతాకాన్ని, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, యుటిఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు జి.చిట్టిబాబు ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో కెఎస్.లక్ష్మణరావు మాట్లాడారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవడానికి యుటిఎఫ్ చేసిన పోరాటాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం విద్యారంగంలో సగం కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు, విద్యారంగంలో సామాజిక న్యాయాన్ని కాపాడుకునేందుకు ఈ మహాసభలో దిశా నిర్దేశం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. దేశంలోని వేయి యూనివర్శిటీల్లో 500 యూనివర్శిటీలు ప్రయివేటు పరమయ్యాయని తెలిపారు. ప్రయివేటీకరణ, ఆర్థిక సంస్కరణలను కొనసాగించడానికి ఎన్ఇపి-2020ని కేంద్రం తీసుకొచ్చిందన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, యుటిఎఫ్ దీన్ని వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. వైసిపి మిగతా 7లో

ప్రియాంక గాంధీపై బిధూరి నోటి దురుసు

- కాంగ్రెస్ నేతల ఖండన

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీపై అనుచితమైన, అసభ్య వ్యాఖ్యలు చేసి సీనియర్ బిజెపి నేత, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థి రమేష్ బిధూరి మరో వివాదానికి తెర తీశారు. కల్కాజి నుండి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న రమేష్ తాను గెలుపొందితే ప్రియాంక గాంధీ బుగ్గల్లా కల్కాజీ నియోజకవర్గంలోని రహదారులను సాఫీగా వుండేలా అభివృద్ధిపరుస్తానంటూ నోరు పారేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కాగా దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. రమేష్ బిధూరిపై మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, కల్కాజీ నుండి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అల్కా లాంబా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకెప్పుడూ అలవాటైన అసభ్యకరమైన భాషలో మరోసారి మహిళలను అవమానించారంటూ బిధూరిని తీవ్రంగా విమర్శించారు.మహిళలను గౌరవించని, సభా మర్యాద పాటించని అటువంటి వ్యక్తిని కల్కాజీ ప్రజలు ఎన్నుకుంటారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇలాంటి వ్యాఖ్యలు చేసిన రమేష్ బిధూరి తక్షణమే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై తమ వైఖరి ఏమిటో సీనియర్ బిజెపి నేతలు చెప్పాలన్నారు. లాంబా నేతృత్వంలో మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు బిధూరి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. శనివారం కల్కాజి నియోజకవర్గంలో ప్రచారం చేస్తూ బిధూరి ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణ ఢిల్లీ నుండి రెండుసార్లు లోక్‌సభ ఎంపిగా, తుగ్లక్‌బాద్ నియోజకవర్గం నుండి మూడు సార్లు ఎంఎల్‌గా గెలిచిన బిధూరి ఇటువంటి వ్యాఖ్యలతో వివాదాలు సృష్టించడం కొత్తేమీ కాదు. గతేడాది ప్రారంభంలో లోక్‌సభలో మాట్లాడుతూ బిఎస్‌పి ఎంపి డానిష్ అలీని లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకరమైన రీతిలో మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలకు సర్వత్రా ఖండనలు వెల్లువెత్తాయి. ఆయన మిగతా 7లో

అన్నదాతపై రూపాయి పిడుగు

భారీ పతనంతో ఎరువుల ధరలకు రెక్కలు?

న్యూఢిల్లీ : 'ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డట్టు... రోజురోజుకి పతనమవుతున్న రూపాయి అన్నదాతకు కొత్త కష్టాలను తెచ్చిపెడుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఇటీవల కాలంలో రికార్డు స్థాయిలో పతనమైన సంగతి తెలిసిందే. ఫలితంగా తమకు భారీ నష్టాలు వస్తున్నాయని వివిధ ఎరువుల కంపెనీలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి నివేదించాయి. రూపాయి పతనం కారణంగా టన్నుకు 7,589 రూపాయలు నష్టం వస్తున్నట్లు కంపెనీలు నివేదించాయని 'డౌన్ టు ఎర్త్' తాజాగా ఒక కథనాన్ని ప్రచురించింది. ఈ పరిణామం ఇలాగే కొనసాగితే ఆ నష్టాన్ని వినియోగదారుల (రైతులు)పై ఆ కంపెనీలు మోపి తీరుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంటే ఎరువుల ధరలు మరింతగా పెరుగుతాయని అర్థం. అదే జరిగితే ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న వ్యవసాయరంగం మరిన్ని క్లిష్ట పరిస్థితులు ఎదుర్కోక తప్పని స్థితి ఏర్పడుతుంది. సంక్షోభం మరింత తీవ్రతరమవుతుంది.

సబ్సిడీ ఇచ్చినా....

జనవరి ఒకటవ తేదిన జరిగిన కేంద్ర మంత్రిమండలి సమావేశం డి-అమోమనియం ఫాస్పేట్ (డిఎపి)పై మెట్రిక్ టన్నుకు 3,500 రూపాయల ప్రత్యేక సబ్సిడీని పొడిగిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. యూరియా తరువాత దేశ వ్యాప్తంగా డిఎపిని అత్యధికంగా వినియోగిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాస్తవానికి 2024 డిసెంబర్ 31 నాటికి డిఎపిపై సబ్సిడీ గడువు ముగిసింది. రైతులకు సరసమైన ధరలకు డిఎపిని అందుబాటులో ఉంచడానికి ఈ సబ్సిడీని పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం జనవరి ఒకటవ తేదిన ప్రకటించింది. అయితే, రూపాయి విలువ పతనం కారణంగా తాము నష్టపోతున్న మొత్తంతో పోలిస్తే కేంద్రం ప్రకటించిన సబ్సిడీ చాలా తక్కువగా ఉందని ఎరువుల కంపెనీలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ చాలనందున తాము నష్టాల్లో కూరుకుపోతున్నామని ఆ కంపెనీలు అంటున్నాయి. ఈ మేరకు తమ నష్టాల వివరాలతో ఒక నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించాయి.

పతనం..ప్రభావం

డిసెంబర్ 19,2024న ఒక డాలర్‌కు 85రూపాయలుగా రూపాయి విలువ పతనమైన సంగతి తెలిసందే. ఆ తరువాత కూడా ఈ పతనం కొనసాగింది. డిసెంబర్ 27న 85.80 జీవిత కాల కనిష్టానికి రూపాయి చేరింది. జనవరి 3వ తేది నాటికి 85.75 వద్ద ఉండగా, ఆదివారం నాటికి మళ్లీ 85.79కి చేరింది. మరోవైపు దేశం గత ఏడాది 70.42 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను, 106.53 లక్షల మెట్రిక్ టన్నుల భాస్వరం, పొటాషియం ఎరువులను దిగుమతిచేసుకుంది. దేశంలో వినియోగిస్తున్న డిఎపి ఎరువుల్లో 60శాతం దిగుమతులమీద ఆధారపడినవే కావడం గమనార్హం. రూపాయి పతనం కారణంగా టన్ను ఎరువు దిగుమతికి 1,400 రూపాయలు అదనంగా చెల్లించాల్సివస్తోందని కంపెనీలు చెబుతున్నాయి. రూపాయి విలువ స్థిరత్వం చోటుచేసుకునే పరిస్థితి కనపసడకపోవడంతో ఇంత భారీ మొత్తంలో ఖర్చు చేసి దిగుమతులు చేసుకోవడానికి ఆ కంపెనీలు తటపటాయిస్తున్నాయి. ప్రస్తుతమున్న రూపాయి రేటు ప్రకారం టన్నుకు 54,213 రూపాయల ధర పడుతోందని, సుంకాలు, డీలర్ మార్జిన్‌లు అన్ని కలుపుకుంటే ఆ మొత్తం 60 వేల రూపాయల వరకు చేరుతోందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం సబ్సిడీతో కలుపుకుని టన్నుకు 52,411 రూపాయలు మాత్రమే లభిస్తున్నాయని ఆ వర్గాలు అంటున్నాయి. ఇంత భారీ మొత్తాన్ని ఎక్కువ కాలం భరించలేమని ఆ వర్గాలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాయి. ప్రభుత్వం సబ్సిడీని మరింతగా పెంచాల్సిఉందని, లేని పక్షంలో వినియోగదారులపై ఆ భారాన్ని మోపాల్సివస్తుందని, అదీ కుదరకపోతే ఎరువుల దిగుమతిని నిలిపివేయక తప్పని స్థితి ఏర్పడుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సిఉంది.

నేడు, రేపు చిత్తూరు జిల్లాలో సిఎం పర్యటన

- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

3

విశాఖ కేంద్ర కారాగారం ప్రక్షాళన

- రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

- జవాను, నలుగురు మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ : దండకారణ్యం మరోమారు నెత్తురోడింది. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు, ఒక జవాన్ మృతి చెందారు. చనిపోయిన మావోయిస్టుల వద్ద నుంచి ఎకె-47 వంటి ఆటోమెటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మావోయిస్టులున్నారన్న సమాచారంతో నారాయణ్‌పూర్, దంతెవాడ, జగదల్‌పూర్, కొండగావ్ నుంచి డిఆర్‌జి బృందాలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు జాయింట్ ఆపరేషన్‌ను చేపట్టాయని బస్తర్ రేంజ్ ఐజి పి. సుందర్‌రాజ్ తెలిపారు. శనివారం సాయంత్రం చోటుచేసుకున్న ఎదురుకాల్పులు కొన్ని గంటల పాటు కొనసాగాయని తెలిపారు. కాల్పులు జరిగిన పరిసర ప్రాంతాల్లో మావోయిస్టుల కోసం ముమ్మరంగా సెర్చ్ ఆపరేషన్‌ను భద్రతా బలగాలు కొనసాగిస్తున్నాయని చెప్పారు.. చనిపోయిన నలుగురు మావోయిస్టులు పీపుల్స్ లిబరేషన్ గోరిల్లా ఆర్మీ (పిజిఎల్ఎ) యూనిఫాం ధరించినట్లు సుందర్‌రాజ్ వెల్లడించారు. మృతదేహాలను, అక్కడున్న ఆయుధాలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎదురుకాల్పుల్లో డిఆర్‌జి కానిస్టేబుల్ సన్ను కరం ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ ఎన్‌కౌంటర్ ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది మొదటిది కావటం గమనార్హం. అబూజ్‌మడ్ ప్రాంతాన్ని మావోయిస్టులకు కంచుకోటగా చెబుతారు. బస్తర్ ప్రాంతంలోని నారాయణ్‌పూర్‌లో ఈ ప్రాంతమున్న సంగతి తెలిసిందే. గతేడాది కూడా ఇక్కడ ఎదురుకాల్పులు చోటుచేసుకున్న సంగతి విదితమే.

నేడు ఎసిబి ముందుకు కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో సంచలనం రేపిన ఫార్ములా ఇ-కార్ రేసింగ్ వ్యవహారంలో చోటు చేసుకున్న అవకతవకలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కెటిఆర్)ను విచారించటానికి అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అస్త్రాలు సిద్ధం చేసింది. ఈ కేసుకు సంబంధించి సోమవారం తమ ఎదుట విచారణకు హాజరు కావాలని కెటిఆర్‌కు ఎసిబి నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లో కెటిఆర్ మొదటి ప్రధాన నిందితుడిగా ఉన్నారు. సీనియర్ ఐఎఎస్ అరవింద్ కుమార్ రెండో నిందితుడిగా, హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజినీర్ బిఎల్ఎన్ రెడ్డి మూడో ముద్దాయిగా ఉన్నారు. కాగా, ఫార్ములా ఇ-కార్ రేసుకు సంబంధించి ఫిర్యాదు చేసిన హెచ్ఎండిఎ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఆయనను ఏడు గంటల పాటు ఎసిబి అధికారులు విచారించారు. కిషోర్ వాంగ్మూలం ఆధారంగా కెటిఆర్‌ను ఎసిబి అధికారులు విచారించే అవకాశముంది.

'బెనిఫిట్' షోలు వద్దు

- జిఓ రద్దు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్
- సినిమా టిక్కెట్ ధరలు తగ్గించాలని వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్తగా విడుదలవుతున్న రెండు సినిమాలకు టిక్కెట్ల ధర పెంచడంతో పాటు బెనిఫిట్ షోల ప్రదర్శనలకు విడుదల చేసిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జిఓ ద్వారా బెనిఫిట్ షో అనే దాని అర్థమే మారిపోతుందని పేర్కొన్నారు. షో ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఏదో ఒక సామాజిక కార్యక్రమానికి వినియోగించాలని కోరారు. కానీ తద్విరుద్ధంగా ప్రేక్షకుల అభిమానాన్ని లాభంగా మలుచుకోవటానికి మొదటి వారం రోజుల్లో టిక్కెట్లు ధర పెంచడం దారుణమని తెలిపారు. అదీ కొన్ని ప్రత్యేక సినిమాలకే ప్రభుత్వ విచక్షణపై అనుమతించడం సరైంది కాదని పేర్కొన్నారు. సినిమా నటుల అభిమానులకు ప్రత్యేకంగా చూపించదల్చుకుంటే ఉచితంగా చూపించాలని లేదా టిక్కెట్ల ధరపై రాయితీ ఇవ్వాలి తప్ప ధరలు పెంచడం అభిమానాన్ని దుర్వినియోగం చేయటమేనని వివరించారు. టిక్కెట్ల ధర విషయంలో ఒకే విధానం ఉండాలని, అది అన్ని సినిమాలకు అందరికీ అన్ని రోజులకూ ఒకేలా ఉండాలని తెలిపారు. వినోదాన్ని వ్యాపారంగా మార్చి డిమాండ్ సప్లైని బట్టి టిక్కెట్ ధరలు పెంచుతామనడం అభిమానాన్ని దారుణంగా దోపిడీ చేయటమేనని పేర్కొన్నారు. చిన్న సినిమాలను, చిన్న నిర్మాతలను దెబ్బకొట్టే ఈ విధానాలు మంచివి కావని సూచించారు. లాభాపేక్షతో అభిమాన ప్రేక్షకులపై ధరలు పెంచి భారం మోపడం జరిమానా విధించటం వంటిదేనని వివరించారు. అభిమాన ప్రేక్షకులపై భారాన్ని తగ్గించాలని, బెనిఫిట్ షోలు ద్వారా గానీ టిక్కెట్లు పెంపుదల ద్వారా వచ్చే అదనపు ఆదాయాన్ని సామాజిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించే విధంగా చట్టం చేయాలని, తక్షణం ఈ జిఓను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అమెరికాకు మంచు తుపాను ముప్పు

- అప్రమత్తమైన రాష్ట్రాలు

7

ఢిల్లీలో సంక్షేమం ఆగదు

నమో భారత్ ప్రారంభించిన అనంతరం సభలో ప్రధాని మోడీ

రైలులో చిన్నారులు గీసిన చిత్రాలను పరిశీలిస్తున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : నమో భారత్ రైళ్లుగా పేర్కొనే రాపిడ్ రైల్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్ఆర్‌టిఎస్)లో ఢిల్లీ సెక్షన్ కారిడార్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. 13 కిలోమీటర్లు పొడవైన ఈ సెక్షన్ న్యూఢిల్లీలోని న్యూ అశోక్ నగర్ నుంచి ఉత్తరప్రదేశ్ లోని సాహిబాబాద్ వరకూ నిర్మించారు. నమో భారత్‌ను ప్రారంభించిన తరువాత సాహిబాబాద్‌లోని ఆర్ఆర్‌టిఎస్ స్టేషన్ నుంచి న్యూ అశోక్ నగర్ ఆర్ఆర్‌టిఎస్ స్టేషన్ వరకూ రైళ్లలో ప్రయాణీకులు, విద్యార్థులతో కలిసి మోడీ ప్రయాణించారు. ఢిల్లీ మెట్రో ఫేజ్ 4లో తొలి సెక్షన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రారంభించారు. జనక్‌పురి వెస్ట్ నుంచి కృష్ణ పార్క్ వరకూ ఈ సెక్షన్ నిర్మించారు. తాజా సెక్షన్‌తో ఢిల్లీ మెట్రో మొత్తం పొడవు 394.448 కి.మీలకు చేరుకుంది.

ఢిల్లీలో బిజెపి అధికారంలోకి వస్తే ఇక్కడ జరుగుతున్న సంక్షేమ పథకాలు ఆగవని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం రోహిణి ప్రాంతంలో జరిగిన ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగించారు. ఇక్కడ బిజెపి అధికారంలోకి వస్తే ప్రజా సంక్షేమ పథకాలు ఏవీ నిలిపివేయమని ప్రధాని తెలిపారు. అంటే ఆప్ పాలనలో సంక్షేమ చర్యలు బాగున్నాయని ప్రధాని పరోక్షంగా అంగీకరించినట్లేనని పరిశీలకులు అనుకుంటున్నారు.

రాయలసీమ డిక్లరేషన్‌పై స్పందనేదీ?

- 'సీమ' సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వండి
- రాయలసీమ సమస్యలు పట్టించుకోకపోతే ప్రజలు క్షమించరు : ఎంఎ గఫూర్

3

విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలి

- ప్రజా చైతన్య సదస్సులో డి రమాదేవి

గుడులు, భూములు అప్పగించండి

'హైందవ శంఖారావం' సభలో వక్తల డిమాండ్

'హైందవ శంఖారావం' సభా వేదికపై చిన జీయర్, గణపతి సచ్చిదానంద, గోకరాజు గంగరాజు తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

నిన్నటి వరకు దేవాలయాలను తమకు అప్పగించాలని కోరుతూవచ్చిన విహెచ్‌పి తాజాగా ఆలయాలతో పాటు భూములను కూడా తమకు అప్పగించాలని డిమాండ్ చేసింది. ఆ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని కేసరపల్లిలో ఆదివారం జరిగిన 'హైందవ శంఖారావ'సభలో ప్రసంగించిన పలువురు వక్తలు ఈ అంశాన్ని ప్రస్తావించారు. బిజెపి మాజీ ఎంపి, విహెచ్‌పి జాతీయ ఉపాధ్యక్షుడు గోకరాజు గంగరాజు అధ్యక్షత జరిగిన ఈ సభలో దేవాలయాల ఆస్తుల కేంద్రంగానే పలువురి ప్రసంగాలు సాగాయి. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో కోట్లాది ఎకరాల భూములు ఆలయాలకు ఉన్నాయని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 27 వేల దేవాలయాలకు లక్షల ఎకరాల భూములున్నాయని, వాటిని హిందువులకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షులు అలోక్ కుమార్ మాట్లాడుతూ హిందూ దేవాలయలను ప్రభుత్వం చేతుల నుండి విముక్తిచేయాలని అన్నారు. టిటిడికి వచ్చే ఆదాయంలో ప్రభుత్వం 7శాతం తీసుకుంటోందని, మరో 5 శాతం కామన్ గుడ్ ఫండ్ కింద తీసుకుంటోందన్నారు. ఆలయాల్లో వచ్చే ఆదాయాన్ని హిందూ ధర్మపరిరక్షణకు, ఆలయాల అభివృద్ధికే ఉపయోగించాలన్నారు.. ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, ఆలయ ట్రస్ట్‌బోర్డు పదవులు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయన్నారు. దేవాలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని, దేవాలయాల ఆదాయాన్ని ధార్మిక కార్యక్రమాలకే వాడాలన్నారు. హిందూ ధర్మం పాటించేవారినే ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించాలని అన్నారు.. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఆలయాల నిర్వహణలో రాజకీయ జోక్యం ఉండరాదన్నారు. అయోధ్యతీర్థ ట్రస్ట్ కోశాధికారి గోవింద దేవగిరి స్వామీజి మాట్లాడుతూ ప్రభుత్వ నేతృత్వంలోనుంచి దేవాలయాలకు వాటి భూములకు స్వేచ్ఛ కల్పించాలన్నారు. విహెచ్‌పి జాతీయ నాయకులు కోటేశ్వరశర్మ మాట్లాడుతూ 1987లో జస్టిస్ మిగతా 7లో

ప్రజా ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం

- 'సీమ' హృదయాల్ని గాయపరిస్తే తిరుగుబాటు తథ్యం : ఎంఎ గఫూర్
- ముగిసిన సిపిఎం కడప జిల్లా 12వ మహాసభ

మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రజా ఉద్యమాల ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కడప నగరంలోని సీతారాం ఏచూరి ప్రాంగణం (అజ్మత్ ఫంక్షన్ హాలు)లో రెండు రోజులుగా జరిగిన సిపిఎం కడప జిల్లా 12వ మహాసభ ఆదివారంతో ముగిసింది. గడిచిన మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. రైతాంగ, సాగునీటి, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలని మహాసభలో నిర్ణయించారు. బిజెపి పాలనలో ప్రజలను కులమతాల పేరుతో విభజించి రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని గఫూర్ హెచ్చరించారు. రాష్ట్రంలోనూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విద్వేష బీజాలు నాటే ప్రయత్నం సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మతాల పేరుతో సాగుతున్న విభజన రాజకీయాలను తిప్పికొట్టి, కులమతాలకు అతీతంగా దేశాన్ని ఏకం చేయాలన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. ట్రూ అప్, ఇతర పేర్లతో విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచిందన్నారు. రాయలసీమ డిక్లరేషన్, రాజధాని అమరావతి, పోలవరం జపాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయలసీమను విస్మరిస్తున్నాయని, సీమ హృదయాలను గాయపరిస్తే సహించబోరని, తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. గోదావరి-బనకచర్ల అనుసంధానం పేరుతో ఆకాశంలో మేడలు కట్టే పద్ధతులు సాగబోవని హెచ్చరించారు. ముందు సీమ పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజకీయ ప్రత్యర్థుల మీద విచారణలు చేపట్టడం కాదని, పేదల అనుభవంలోని భూములకు, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత మూడేళ్లలో సిపిఎం అనేక ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిందని, రాబోయే మూడేళ్లలో మరిన్ని పోరాటాలను, ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని దిశానిర్దేశం చేశారు. మహాసభలో సిపిఎం సీనియర్ నాయకులు ఐఎన్ సుబ్బమ్మను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. 39 ఏళ్లపాటు ఆమె పార్టీకి చేసిన సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలి

- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా మహాసభలో వి శ్రీనివాసరావు పిలుపు

మహాసభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు.

ప్రజాశక్తి- తిరువూరు (ఎన్‌టిఆర్ జిల్లా)

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సానుకూల పరిస్థితులను అందిపుచ్చుకొని ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలని, క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తిరువూరులో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా 25వ మహాసభలో చివరి రోజు ఆదివారం ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలతో ఉన్న సంబంధాలను రాజకీయ సంబంధాలుగా మలుచుకుని ప్రజా పునాదిని పటిష్టం చేసుకోవాలని సూచించారు. 1990వ దశకంలో పెట్టుబడిదారీ వ్యవస్థ పైచేయి సాధించి సోషలిస్టు వ్యవస్థను ఆత్మరక్షణలోకి నెట్టి వేసిందన్నారు. అయినా, పార్టీ ఆ ఒడిదుడుకులను తట్టుకొని నిలబడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ బలహీన పడుతోందన్నారు. ఉత్పత్తి రంగం పూర్తిగా దెబ్బతింటోందని, పరిశ్రమలు మూతపడుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోకి పెట్టుబడులు రావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమాలు ఉధృతం అవుతున్నాయని వివరించారు. కనీస వేతనాల కోసం ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు సాగుతున్నాయన్నారు. రాష్ట్రంలోనూ కనీస వేతనాల కోసం ఉద్యమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ జిల్లాలో కిడ్నీ వ్యాధి మరణాలు, విజయవాడలో కృష్ణా నది కరకట్ట రిటైనింగ్ వాల్ నిర్మాణం, చెత్త పన్నుకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాలు మంచి ఫలితాలను ఇచ్చాయన్నారు. బుడమేరు, కృష్ణా నది వరద బాధితుల కోసం పార్టీ శ్రేణులు చేపట్టిన సహాయక చర్యలను ప్రశంసించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ముగింపు ఉపన్యాసం చేస్తూ ఎన్నికల్లో కమ్యూనిస్టులకు ఓట్లు రాలేదు, ఒక్క సీటు కూడా రాలేదు, ఇక వీళ్ల పని అయిపోయిందని ప్రచారం చేస్తున్న వారికి జిల్లా మహాసభ సందర్భంగా శుక్రవారం తిరువూరులో నిర్వహించిన భారీ ప్రదర్శనకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు గట్టి బుద్ధి చెప్పి నోరు మూయించారన్నారు. దోపిడీకి గురయ్యే ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కమ్యూనిస్టులు పని చేస్తారని వివరించారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతులు నిరవధికంగా ఢిల్లీలో చేసిన ఆందోళన ఫలితంగా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన మోడీ ప్రభుత్వం... నేడు ఆ చట్టాలకు పేర్లు మార్చి దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు.

దీంతో, రైతులు మరోసారి ఉద్యమ బాట పట్టారని తెలిపారు. కార్మికులు, కర్షకులు, నిరుద్యోగులు, మహిళలు ప్రతిఒక్కరూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మహాసభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నాయకులు బిఆర్.తులసీరావు, పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ వై.అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా డివి కృష్ణ

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా నూతన కమిటీకి 25 మందిని ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా డివి కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులుగా దోనేపూడి కాశీనాథ్, ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, పగడాల వీరాంజనేయులు, కోట కల్యాణ్, మేకల నాగేంద్రప్రసాద్, బి.సత్యబాబు, కె.శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పలు జిల్లాల్లో పోలీస్ ఫిజికల్ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో జరగాల్సిన పోలీస్ కానిస్టేబుల్ ఫిజికల్ పరీక్షలును పోలీస్ నియామక బోర్డు వాయిదా వేసింది. ఈ మేరకు బోర్డు ఛైర్మన్ ఎం రవిప్రకాష్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరగాల్సిన కార్యక్రమాలను వైకుంఠ ఏకాదశి, శాంతిభద్రతల నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఈ నెల 8న జరగాల్సిన ఫిజికల్ మేజర్‌మెంట్ టెస్ట్ (పిఎంటి), ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ (పిఇటి) కార్యక్రమాలను ఈ నెల 11వ తేదీన నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతపురం జిల్లాలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరగాల్సిన పరీక్షలను, చిత్తూరు జిల్లాలో 8, 9 తేదీల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను ఈ నెల 17, 18 తేదీల్లో జరుపుతామని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో యథాతథంగా ఉంటాయని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హెచ్‌ఎంపివిపై ఆందోళన వద్దు

- రాష్ట్రంలో నమోదుకాని కేసులు
- ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ పద్మావతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కొత్త వైరస్ హెచ్‌ఎంపివి (హ్యూమన్ మెటా న్యూమో వైరస్)కు సంబంధించిన కేసులు రాష్ట్రంలో నమోదు కాలేదని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ పద్మావతి తెలిపారు ఈ వైరస్ కారణంగా ప్రజలెవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. న్యూమో కుటుంబానికి చెందిన ఈ వైరస్ కరోనా వైరస్ తరహాలోనే ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుందని చెప్పారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. వైరస్ సోకిన వారి దగ్గు, తుమ్ముల వల్ల వెలువడే తుంపర్ల నుంచి వారితో సన్నిహితంగా మెలగడం, కరచాలనం, స్పర్శ వంటి చర్యలతో ఈ వైరస్ వ్యాపిస్తుందని తెలిపారు. వస్తువులపై వైరస్ ఉన్నట్లయితే, తాకిన తరువాత అదే చేతితో నోరు, ముక్కును తాకడంతో వారి శరీరంలోకి వైరస్ వ్యాపిస్తుందని నిపుణులు నిర్ధారించినట్లు వెల్లడించారు. వైరస్ సోకిన అనంతరం వ్యాధి లక్షణాలు 3 నుంచి 10 రోజుల్లోగా బయటపడే అకాశం ఉందన్నారు. హెచ్‌ఎంపివి సోకిన వారికి సాధారణ జలుబు (ఫ్లూ) వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు.

దగ్గు, ముక్కు దిబ్బడ, ముక్కు కారడం, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత సమస్యలు కూడా కనిపిస్తాయని తెలిపారు. కొన్నిసార్లు న్యూమోనియా, బ్రాంకైటీస్ (ఆస్తమా) వంటి శ్వాసకోశ సమస్యలకు ఇది దారి తీస్తుందని చెప్పారు. చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ వైరస్ తీవ్ర అనారోగ్యాన్ని కలిగిస్తుందన్నారు. వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి కోవిడ్ సమయంలో పాటించిన తరహాలోనే జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. 20 సెకన్లపాటు సబ్బు నీటితో తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటిని, ముక్కుకు చేతి రుమాలును అడ్డుపెట్టుకోవడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలకు దూరంగా ఉండటం, వాడిన వస్తువులను ఇతరులతో పంచుకోకుండా నిరోధించడంతోపాటు తగినంత పౌష్టికాహారం, మంచినీరు తీసుకోవాలని, తగినంత నిద్ర ఉండాలని సూచించారు. వైరస్ లక్షణాలు కనిపించిన వ్యక్తులు క్వారంటైన్‌లో ఉండటం మంచిదని తెలిపారు. వైరస్ సోకిన వ్యక్తులు లేక లక్షణాలు కనిపిస్తున్న వ్యక్తులు ఇతరులతో కరచాలనం చేయరాదని, ఒకసారి ఉపయోగించిన టవల్స్, రుమాళ్లు వంటి వాటిని మళ్లీ వాడరాదని, చేతులతో తరచూ కళ్లు, ముక్కు, నోటిని తాకరాదని, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయకూడదని సూచించారు.

వైరస్ లక్షణాలున్న వ్యక్తులు సమీపంలో ఇతరులు ఉండకూడదని తెలిపారు. వైరస్ సోకినట్లు అనుమానం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు మందులు వాడాలని, ఎటువంటి సొంత వైద్యం చేసుకోకూడదని సూచించారు. ఇప్పటి వరకూ హెచ్‌ఎంపివికి నిర్దిష్టమైన యాంటి వైరల్ చికిత్స అనేది లేదన్నారు. వ్యాక్సిన్లు కూడా అభివృద్ధి చేయలేదన్నారు. ఆరోగ్య సంరక్షణ కోసం నొప్పి నివారణ మందులు, ఆక్సిజన్ థెరపీ వంటివి ఇస్తారన్నారు. వైరస్ తీవ్రతకు ఎక్కువగా చిన్న పిల్లలు, వృద్ధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన చికిత్స అందిస్తారని చెప్పారు. ప్రస్తుతం వైరస్ వ్యాప్తి తక్కువ స్థాయిలోనే ఉందని, ఇప్పటి వరకూ మన దేశంలో, రాష్ట్రంలో కేసులు నమోదు కాలేదని స్పష్టం చేశారు.

విద్యార్థులకు సృజనాత్మక బోధన

- పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థులకు నాణ్యమైన విద్యను సృజనాత్మకంగా బోధించాలని ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు, జీవితం, నడవడిక, సత్ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాలలో కెజిబివి ఉపాధ్యాయులకు జరుగుతున్న ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజానికి మంచి భావితరాన్ని అందించాలంటే ఉపాధ్యాయ లోకం చేతిలోనే ఉందన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికి వెళ్లేముందు బోధన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. నిత్య విద్యార్థిలా రోజూ కొత్త విషయాన్ని నేర్చుకోవాలని తెలిపారు. కెజిబివిల్లోనే ఎక్కువకాలం బాలికలు గడుపుతారని, కాబట్టి వారిని టీచర్లే తల్లిదండ్రుల్లా కాపాడుకోవాలని కోరారు. ఆరోగ్యం, భద్రత గురించి విద్యార్థులు మనసు విప్పి మాట్లాడేలా స్నేహభావంతో మెలగాలన్నారు. సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అమ్మలాంటి లాలన అందించాలని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనవిధంగా కెజిబివి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని అన్నారు. కెజిబివి విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకెళ్లాలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు బోధనాపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా టీచర్లను భర్తీ చేశామన్నారు. ఎఐ, సాఫ్ట్ స్కిల్ ట్రైనింగ్ వంటి అంశాల్లో శిక్షణకు ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో డైట్ ఛార్జీలు ప్రతి విద్యార్థికీ నెలకు రూ.1600 పెంచామన్నారు. కౌమార దశలో బాలికల కష్టసుఖాలను తెలుసుకొని వాటిని పరిష్కార దిశగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెజిబివి కార్యదర్శి డి దేవానందరెడ్డి, ఇగ్నస్ పెహల్ ప్రతినిధులు సురేంద్ర, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సిపిఎం నేతలతో మాట్లాడుతున్న బివి రాఘవులు

బయ్యారెడ్డి మృతి తీరని లోటు

- నివాళులర్పించిన బివి రాఘవులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నాయకులు జి బయ్యారెడ్డి మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. రాఘవులు ఆదివారం కర్ణాటక రాష్ట్రం చిక్బళ్లాపూర్ జిల్లాలోని బయ్యారెడ్డి ఇంటి వద్ద ఉన్న ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ చిక్బళ్లాపూర్ జిల్లాలోని మారుమూల గ్రామంలో పుట్టిన బయ్యారెడ్డి విద్యార్థి, కార్మిక, రైతాంగ సమస్యలపై అనేక పోరాటాలు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. రైతు సమస్యలపై నిర్వహించిన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని, రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన 'చలో ఢిల్లీ' సందర్భంగా రైతులను ఏకం చేయడంలో బయ్యారెడ్డి కీలపాత్ర పోషించారని అన్నారు. అనుభవజ్ఞుడు, దూరదృష్టి కలిగిన రైతు నాయకుడ్ని కొల్పోవడం వామపక్ష పోరాటాలకు తీరని లోటు అని అన్నారు. ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజుకృష్ణన్, కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్, చిత్తూరు జిల్లా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తదితరులు నివాళి అర్పించి బయ్యారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విజయవంతంగా నాటిక పోటీలు

తంగిరాల వెంకట సుబ్బారావుకు ప్రతిభా మూర్తి జీవితకాల పురస్కారం

కథా నాటిక పోటీలలో అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' నాటిక ప్రదర్శన అనంతరం సత్కారం

ప్రజాశక్తి - విజయవాడ

అజో-విభో-కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కృతిక వేదిక విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విశిష్ట పురస్కారాలు, సాహితీ సాంస్కృతిక సదస్సులు, కథా నాటిక పోటీలు నాలుగో రోజు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ప్రతిభా మూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ప్రముఖ సాహితీవేత్త తంగిరాల వెంకటసుబ్బారావుకు ప్రదానం చేశారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలోని చుక్కపల్లి ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే జ్ఞానపీఠ అవార్డు మాదిరిగానే తెలుగువారికి అజో-విభో-కందాళం ఫౌండేషన్ పురస్కారాన్ని ఇస్తోందని అన్నారు. తంగిరాల వెంకట సుబ్బారావు తెలుగు, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో సుమారు వంద పరిశోధనా పత్రాలను సమర్పించారరని తెలిపారు. ఆయన పర్యవేక్షణలో 15 మందికి పిహెచ్‌డిలు, 25 మందికి ఎంఫిల్‌లు వచ్చాయన్నారు. అనేక కవితా సంపుటాలు, కథల పుస్తకాలు, సాహిత్య గ్రంథాలు ఆయన సంపాదకత్వంలో వెలువడ్డాయని తెలిపారు. బెజవాడ గోపాలరెడ్డి కవిత్రయ పురస్కారం, రెండుసార్లు రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రులు ఉగాది పురస్కారం అందించారని అన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు మాట్లాడుతూ సాహిత్య రంగానికి తంగిరాల సేవలు అభినందనీయమన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో విశేష అనుభవం గడించిన ప్రముఖులను సాహితీవేత్తలను సినీ సాహితీ సాంస్కృతిక రంగాల ప్రముఖులను సత్కరించడం అభినందనీయమన్నారు. సాహితీవేత్త అల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి మాట్లాడుతూ భాషలు అంతరించిపోతుండడం సంస్కృతి రంగాలకు ఆదరణ తగ్గిపోతున్న నేటి రోజుల్లో ఇలాంటి సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించడం గర్వకారణమన్నారు. సీనియర్ జర్నలిస్ట్ రెంటాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తంగిరాల వెంకట సుబ్బారావు లాంటి ఉన్నతమైన వ్యక్తులను సత్కరించుకోవడం తెలుగు సాహితి కళారంగానికి గర్వకారణమన్నారు. ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక రంగాల్లో సృజనాత్మకత ఎంతైనా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. వాటి వైభవం కోసం కళా సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీ కళా నాటక రంగ సినీ ప్రముఖులు పాల్గొన్నారు.

కిమ్స్ ఆస్పత్రికి రావొద్దు

- అల్లు అర్జున్‌కు పోలీసులు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంధ్య థియేటర్ ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారి శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రికి రావొద్దని నటుడు అల్లు అర్జున్‌కు పోలీసులు సూచించారు. హైదరాబాద్‌లోని అల్లు అర్జున్ నివాసానికి ఆదివారం రాంగోపాల్‌పేట్ పోలీసులు వెళ్లి ఆయనకు నోటీసులు అందజేశారు. శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు అనుమతి కావాలని అల్లు అర్జున్ దరఖాస్తు చేసుకోగా.. పోలీసులు నిరాకరించారు. ఒకవేళ పరామర్శించాల్సి వస్తే తమ సూచనలు పాటించాలని, అక్కడ ఏదైనా జరగరానిది జరిగితే మీదే బాధ్యత అని హెచ్చరించారు. ప్రతి ఆదివారం పోలీసుల ఎదుట హాజరుకావాలన్న బెయిల్ షరతులో భాగంగా అల్లు అర్జున్ ఆదివారం చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లారు.

సినిమా టిక్కెట్ల ధర పెంపును ఖండించిన సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సినిమా టిక్కెట్ల ధరలను పెంచుతూ, బెనిఫిట్ షోలకు అనుమతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి పండగ సమయంలో రాష్ట్రంలో గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్ సినిమాలకు టిక్కెట్ల ధరలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, రాత్రి ఒంటిగంట బెనిఫిట్ షో టిక్కెట్ ధర రూ.600, మల్టీప్లెక్స్ టిక్కెట్‌కు అదనంగా రూ.175, సింగిల్ స్క్రీన్స్‌లో టిక్కెట్‌కు అదనంగా రూ.135 పెంచిందన్నారు. సినిమా టిక్కెట్ ధరల పెంపుపై గేమ్ ఛేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను తప్పుపడుతున్నట్లు తెలిపారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు మద్దతు ధరలు కల్పించడంలో మెతక వైఖరి అవలంభించే పాలకులు కోటీశ్వరులైన నిర్మాతలకు మేలు చేకూర్చడాన్ని తప్పుబట్టారు. తెలంగాణ తరహాలో రాష్ట్రంలోనూ సినిమా టిక్కెట్ల ధరలు పెంపు, బెనిఫిట్ షోల యోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

సమృద్ధిగా ఎరువుల కేటాయింపు

- మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రబీ సీజన్ పంట కాలానికి అవసరం మేర అన్ని రకాల ఎరువులనూ లక్ష్యానికి మించి కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దేశీయంగా తయారయ్యే సరఫరాకు అందుబాటులో ఉండే స్వదేశీ యూరియాను లక్ష టన్నుల మేర కేటాయింపు చేయడంలో పూర్తిస్థాయి సహకారం, చొరవ చూపి కేంద్ర ప్రభుత్వం అధికారులతో సమన్వయం చేశారని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుత పంట పరిస్థితులకు వినియోగం ఎక్కువగా ఉన్న యూరియాను రాష్ట్రానికి సమృద్ధిగా కేటాయించిన దృష్ట్యా, రైతులకు యూరియా ఎరువును సకాలంలో అందించేందుకు పంపిణీ ఏర్పాట్లు చేయాలని వ్యవసాయశాఖ సంచాలకులు ఎస్ ఢిల్లీరావుకు సూచించారు. ఎరువులు అందుబాటులో ఉన్న దృష్ట్యా వ్యాపారులు ఎక్కువ ధరలకు అమ్మటం కానీ, నల్ల బజారుకు తరలించడం వంటివి లేకుండా చేయాలన్నారు.

పురుషోత్తం నాయుడు సేవలు అభినందనీయం

- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

పురుషోత్తం నాయుడు దంపతులను సన్మానిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వోద్యోగిగా ఒక కుటుంబానికే పరిమితం కాకుండా ఉద్యోగ సంఘ నాయకత్వ బాధ్యతల్లో ఎన్నో కుటుంబాలకు అండగా నిలిచిన వ్యక్తి పురుషోత్తం నాయుడని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశంసిం చారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు ఆత్మీయ అభినందన సభ శ్రీకాకుళంలోని బృందావన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సభలో రామ్మోహన్ నాయుడు ముఖ్యఅతిగా పాల్గొని పురుసోత్తం నాయుడు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వామపక్ష రాజకీయ నేపథ్యమున్న కుటుంబంలో జన్మించిన ఆయన ప్రభుత్వోద్యోగిగా ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. ఉద్యోగుల హక్కులను ప్రభుత్వంతో పోరాడి సాధించుకున్నారని పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగిగా బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఉద్యోగ సంఘానికి నాయకత్వం వహించి ఉద్యోగులకు అండగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ మంత్రులు డాక్టర్ కిల్లి కృపారాణి, ధర్మాన ప్రసాదరావు, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, ఎపి ఎన్‌జిఒ నూతన ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్, ఎంఎస్‌ఎంఇ కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకరరావు పాల్గొన్నారు.

పుస్తక మహోత్సవంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

తెలుగు సాహిత్యానికీ గర్వకారణం ఆరుద్ర

- ప్రముఖ పాత్రికేయులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

తెలుగు సాహిత్యానికి.. తెలుగువారికి గర్వకారణమైన, చిరస్మరణీయమైన కవి ఆరుద్ర అని ప్రముఖ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. 35వ విజయవాడ పుస్తక మహోత్సవంలో నాలుగో రోజు ఆదివారం రామోజీరావు సాహిత్యవేదికపై రెండో కార్యక్రమంగా ఆరుద్ర శతజయంతి సభ నిర్వహించారు. పాత్రికేయులు సత్యాజీ అధ్యక్షతన జరిగిన సభలో ప్రధాన వక్తగా తెలకపల్లి రవి మాట్లాడారు. పరిశోధనలోనూ, కృషిలోనూ, సృజనలోనూ సమగ్రతకూ, సాధికారితకూ చిరునామా ఆరుద్ర అని తెలిపారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా, సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర సృష్టికర్తగా ఆరుద్ర కృషిని ఆయన వివరించారు. తెలుగు సాహిత్యానికి, సినీ సాహిత్యానికి విజ్ఞాన సర్వస్వంగా ఆరుద్ర ఉండేవారని తెలిపారు. వేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాల ప్రవాహంలో మరుగుపడకుండా నిలబడే స్థాయి తెలుగు భాషకూ, సాహిత్యానికీ సేవ చేసిన కవి, రచయిత ఆరుద్ర అని అన్నారు. భాగవతుల సదాశివ శంకరశాస్త్రి అసలు పేరుగా గల ఆరుద్ర మొదట్లో 11 కలం పేర్లతో రచనలు చేశారన్నారు. విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలను నమ్మి ఆచరించారని తెలిపారు.

తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరం
- విశ్రాంత ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు

తెలుగు భాషను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని, అది మన జాతి ఉనికినే ప్రశ్నార్థకం చేస్తుందని విశ్రాంత ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు అన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో రామోజీరావు సాహిత్యవేదికపై మొదటి కార్యక్రమంగా పుస్తక మహోత్సవ సంఘం సంస్థాపక కోశాధికారి పిడికిడి రామకోటేశ్వరరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'పిడికిటి రామకోటేశ్వరరావు జ్ఞాపకాలు' పేరుతో ముద్రించిన పుస్తకాన్ని వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. పుస్తకం మొదటి ప్రతిని తానా పత్రిక సంపాదకులు కెసి.చేకూరి స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక ప్రచురణను ఒక సామాజిక బాధ్యతగా భావించి, చివరి వరకూ అలాగే నిర్వహించిన ఆదర్శవంతుడు రామకోటేశ్వరరావు అని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన బెల్లపు బాబ్జీ మాట్లాడుతూ పుస్తకమహోత్సవానికీ కోటేశ్వరరావుకు ఉన్న అనుబంధాన్ని వివరించారు. పుస్తక మహోత్సవ సంఘం పూర్వ అధ్యక్షులు డి.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. నిరాడంబరంగా, మృదుభాషిగా, వినయశీలిగా ఉండటం అనే లక్షణాలు కోటేశ్వరరావును చూసి నేర్చుకున్నానన్నారు. కోటేశ్వరరావు అల్లుడు తానా పూర్వ అధ్యక్షులు కోమటి జయరాం, సతీష్ వేమన మాట్లాడుతూ పుస్తక మహోత్సవానికి తానా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. రామచంద్ర మిషన్ ప్రతినిధి ఝాన్సీ రామకోటేశ్వరరావు ఆధ్యాత్మిక పార్శ్వాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు.

17న మంత్రివర్గ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 17న జరగనుంది. ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదివారం విడుదల చేశారు. సచివాలయంలో మొదటి భవనంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి సంబంధించిన ప్రతిపాదనలను ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటల్లోపు పంపించాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు.

'జమిలి'కి వ్యతిరేకంగా ఉద్యమం

● సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా మహాసభలో మంతెన సీతారాం

ప్రజాశక్తి- భీమవరం

జమిలి ఎన్నికలకు వ్యతిరేకంగా అన్ని తరగతులనూ సంఘటితం చేసి భవిష్యత్తులో ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా 26వ మహాసభ భీమవరంలోని ఆర్ఎస్ నగర్ (ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనం)లో మూడో రోజు ఆదివారం ముగిసింది. మహాసభలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అనేక మార్పులు వస్తున్నాయని, ఇవి ప్రజల జీవితాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ ఆయకట్టు పరిధిలో సుమారు ఆరు లక్షల ఎకరాలు సాగవుతున్నాయన్నారు. దీనిలో మూడు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు ఉందని తెలిపారు. ఆక్వా రంగ సమస్యలపై పోరాడాలన్నారు. ఈ రంగంలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారు అనేక కష్టాలు, నష్టాలు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆక్వా రంగంలో పని చేసేవారిని సంఘటితపర్చి పోరాటాలు సాగించడంతోపాటు రైతులు, కౌలురైతుల సమస్యలపైనా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో చరిత్ర సృష్టించిన ఏజెన్సీ భూపోరాటం మాదిరిగా ఆక్వా రంగ పోరాటం నిర్వహించాలన్నారు. ఉపాధి కోసం వేలాది మంది ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో కార్మికవర్గ పోరాటాలు సాగిస్తూనే ప్రజా, సామాజిక ఉద్యమాలు విస్తృతం చేయాలని నిశానిర్దేశం చేశారు. జిల్లాలో పరిశ్రమలు లేకపోవడం బాధాకరమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పారిశ్రామిక విధానంలో జిల్లాలో ప్రత్యేకంగా కొత్త పరిశ్రమలు కానరావడం లేదని తెలిపారు. పరిశ్రమల సాధనకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజా ఉద్యమాలు విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు.

మహాసభలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయండి : వి ఉమామహేశ్వరరావు

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే మోపిన రూ.17 వేల కోట్ల విద్యుత్ భారాలను వెనక్కి తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలను నిరసిస్తూ ఈ నెల 13న భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభ ప్రాంగణంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మతోన్మాదం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హైందవ సభ పేరుతో మత విద్వేషాలు, చీలికలు రెచ్చగొడితే చూస్తూ ఊరుకోమని, ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. దేవాలయాలను ఆర్ఎస్ఎస్‌కు అప్పగించాలనడం సరికాదన్నారు. బిజెపి అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో దేవాలయాల నిర్వహణ ప్రభుత్వ అధీనంలో ఉందని గుర్తు చేశారు. మతోన్మాద పోకడలకు వ్యతిరేకంగా లౌకికవాద పరిరక్షణ, మతసామరస్యం కోసం కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యదర్శిగా జెఎన్‌వి గోపాలన్

సిపిఎం పశ్చిమ గోదావరి జిల్లా నూతన కమిటీ 25 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. కార్యదర్శిగా జెఎన్‌వి.గోపాలన్, కార్యదర్శివర్గ సభ్యులుగా బి.బలరాం, చింతకాయల బాబూరావు, కేతా గోపాలన్, కవురు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు, రేపు చిత్తూరు జిల్లాలో సిఎం పర్యటన

● పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండ్రోజులు చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా 6వ తేదిన (సోమవారం) ద్రావిడ యూనివర్సిటీ ఆడిటోరియంలో స్వర్ణకుప్పం విజన్ 2029ను ఆవిష్కరిస్తారని, నడిమూరు గ్రామంలో సోలరైజేషన్‌ను ప్రారంభించి లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారని తెలిపారు. అనంతరం సీగలపల్లి గ్రామం చేరుకుని ప్రకృతి వ్యవసాయ రైతులతో సంభాషణ, ప్రకృతి వ్యవసాయం విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, ఎన్‌ఒసిఎల్‌తో ఎంఒయు కుదుర్చుకునే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. 7వ తేదీ (మంగళవారం) కుప్పం టిడిపి ఆఫీస్‌కు చేరుకుని జననాయకుడు సెంటర్ ప్రారం భించి, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తారని, కంగుంది గ్రామంలోని శ్యామన్న విగ్రహావిష్కరణ చేస్తారని, కుప్పంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ద్రవిడ యూనివర్సిటీలో అకాడమిక్ బిల్డింగ్‌లోని ఐఎంఐబి (కెరీర్ రెడీనెస్ సెంటర్)ను ప్రారంభిసారని, యూనివర్సిటీలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్రాంతి పండగ రద్దీని తట్టుకునేందుకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రత్యేక రైళ్లు ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు వివిధ రూట్లలో నడవనున్నాయి. చర్లపల్లి - తిరుపతి, వికారాబాద్ - కాకినాడ, కాచిగూడ - తిరుపతి, కాచిగూడ - శ్రీకాకుళం, చర్లపల్లి - శ్రీకాకుళం, నాందేడ్- కాకినాడ, చర్లపల్లి - నరసాపూర్ మధ్య 52 ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇందుకు సంబంధించిన టికెట్స్ బుకింగ్స్ ఈ నెల 6 నుంచి ప్రారంభం కానున్నాయి.

రాయలసీమ డిక్లరేషన్‌పై స్పందనేదీ?

● 'సీమ' సాగునీటి ప్రాజెక్టులకు నిధులివ్వండి
● రాయలసీమ సమస్యలు పట్టించుకోకపోతే ప్రజలు క్షమించరు : ఎంఎ గఫూర్

ప్రజాశక్తి-కడప అర్బన్

బిజెపి గతంలో చేసిన రాయలసీమ డిక్లరేషన్‌పై ఆ పార్టీ ప్రజాప్రతినిధులు స్పందించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ డిమాండ్ చేశారు. సిపిఎం కడప జిల్లా 12వ మహాసభ సందర్భంగా వచ్చిన ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమలో ఉన్న బిజెపి ఎమ్మెల్యేలు ఆదినారాయణ రెడ్డి, పార్థసారథి, మంత్రి సత్య కుమార్ రాయలసీమ డిక్లరేషన్ అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేసేలా ప్రయత్నించాలని, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం నిధులు తేవాలన్నారు. రాయలసీమ సమస్యలు పట్టించుకోకపోతే ప్రజలు క్షమించరని హెచ్చరించారు. కడప జిల్లాలో సజ్జల రామకృష్ణారెడ్డి భూముల ఆక్రమణ వ్యవహారంపై డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారని, అదే సమయంలో భూస్వాములు లక్షలాది ఎకరాలను పేదలకు దక్కకుండా ఆక్రమించుకున్నారని, వాటిపై విచారణకు ఎందుకు ఆదేశించరని నిలదీశారు.

ఎటువంటి వివాదంలేని పేదల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో రాయలసీమకు అన్యాయం కొనసాగుతోందన్నారు. బ్రహ్మసాగర్‌కు రూ.1500 కోట్లు కేటాయిస్తే ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. మైలవరం ఆయకట్టు 90 వేల ఎకరాలకుగాను కేవలం 15 వేల నుంచి 20 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, ఇరిగేషన్ మంత్రి పోలవరం జపమే తప్ప, రాయలసీమ సమస్యలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. పెన్నా, హంద్రీనీవా, తెలుగు గంగ, జిఎన్ఎస్ఎస్‌కు నిధులు ఇవ్వకుండా ఆకాశం నుంచి నీళ్లు తెస్తామనడం ప్రజలను మోసం చేసేందుకేనని విమర్శించారు. ఉమ్మడి కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని చెరువులను నీటితో నింపాలని కోరారు. అనంతపురం జిల్లాలోని పందికోన రిజర్వాయర్‌కు నీళ్లు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కొప్పర్తి ఎంఎస్ఎంఇ సెంటర్‌ను, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని, నార్కోటిక్ డ్రగ్ లీగల్ కోర్టును తరలించే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. హంద్రీనీవా విస్తరణ ప్రభుత్వానికి పట్టదా? అని నిలదీశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎన్నికల వరకు వాయిదా పడుతూనే ఉంటుందని ఎద్దేవా చేశారు. సినిమా టికెట్ల పెంపు ప్రజలను దోచుకోవడమేనని తెలిపారు. జగన్‌ది మాయాజాల పాలనని, బటన్‌లు నొక్కే పేరుతో గోల్‌మాల్ పాలన చేశారని ఎద్దేవా చేశారు.

విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలి

● ప్రజా చైతన్య సదస్సులో డి రమాదేవి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రతి విద్యార్థికీ ప్రశ్నించే తత్వాన్ని నేర్పాలని, ఆ బాధ్యత ఉపాధ్యాయులదేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి అన్నారు. కాకినాడ పిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభ ఆదివారం ప్రారంభమైంది. ఇందులో భాగంగా 'ప్రజా చైతన్య సదస్సు' నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రమాదేవి ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. యుటిఎఫ్‌గా చేసిన పోరాటాలు రాష్టంలో అంగన్‌వాడీ, మున్సిపల్, కార్మికవర్గ పోరాటానికి మార్గం చూపాయన్నారు. నేడు పాలకులు ప్రశ్నను, ప్రశ్నించేతత్వాన్ని చంపేస్తున్నారని తెలిపారు. చరిత్రను సబ్జెక్టుల నుంచి తొలగిస్తున్నారన్నారు. ప్రపంచీకరణ విధానాలకు అనుగుణంగా చదువుని మార్చేందుకు పాలకులు చూస్తున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. వామపక్షాలు విద్యకు పెద్ద పీట వేస్తున్నాయన్నారు. విద్యా విధానం విద్యార్థి కేంద్రంగానే ఉండాలని కోరారు. గత ప్రభుత్వం తరగతుల విలీనంతో తీసుకున్న నిర్ణయంతో అనేక వేల మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారని తెలిపారు. కొత్తగా వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ప్రాథమిక విద్య బాగు కోసం ఒక్క ప్రయత్నం కూడా చేయడంలేదని విమర్శించారు. ప్రత్యామ్నాయ విద్యా విధానం కోసం సిపిఎం నిలబడుతుందని తెలిపారు. దాని కోసం యుటిఎఫ్‌గా చేసే ఏ పోరాటానికైనా సిపిఎం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ నాయకులు విల్సన్ మాట్లాడుతూ విద్యారంగం బలోపేతం కావాలంటే ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి జి.నాగమణి మాట్లాడుతూ.. ప్రయివేటు పాఠశాలలు పెరిగిపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కాకినాడ డివైఇఒ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు సాధించిన శ్రీకాకుళం జిల్లాకు చెందిన హెచ్ఎం ఎం.నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ సదస్సుల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, పి.గోపీమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కేంద్ర కారాగారం ప్రక్షాళన

రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

విశాఖ కేంద్ర కారాగారాన్ని ప్రక్షాళన చేయనున్నట్టు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈ కారాగారాన్ని ఆమె ఆదివారం సందర్శించారు. రాష్ట్ర జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్, కారాగార పర్యవేక్షణాధికారి మహేష్‌బాబు, ఇతర జైలు అధికారులు ఆమెకు స్వాగతం పలికారు. ఇటీవల విశాఖ కేంద్ర కారాగారంలో గంజాయి, సెల్‌ఫోన్లు దొరకడం, జైలు వార్డర్లు, వారి కుటుంబ సభ్యుల నిరసనలు వంటి వరుస ఘటనల నేపథ్యంలో కేంద్ర కారాగారాన్ని హోమ్ మంత్రి సందర్శించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో ఆమె ముందుగా సెల్‌ఫోన్లు దొరికిన పెన్నా, నర్మదా బ్యారక్‌లను పరిశీలించారు. జైల్లో జరుగుతున్న పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్ర కారాగారంపై వస్తున్న ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తున్నట్టు తెలిపారు. సెల్‌ఫోన్ల లభ్యతపై కేసును ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కేసు పురోగతిలో ఉందని తెలిపారు. మరో పది రోజుల్లో ఫోన్లు ఎవరు వాడారు ? ఎవరితో మాట్లాడారు ? అన్న విషయాలు తెలుస్తాయన్నారు. జైల్లో నర్మదా బ్యారక్ వద్ద గంజాయి మొక్క తనకు కనిపించిందని చెప్పారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించకపోతే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి కృషి

● కేంద్ర రైల్వే, జలశక్తి సహాయ మంత్రి వి సోమన్న

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని కేంద్ర రైల్వే, జలశక్తి సహాయ మంత్రి వి సోమన్న అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో ఆదివారం రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వంతెన పెనుకొండ పట్టణం అనంతపురం ధర్మవరం, పుట్టపర్తి మధ్య రైల్వే ట్రాక్ మీదుగా రోడ్డు రాకపోకలు సులభంగా ఉంటుందన్నారు. 2021 మార్చి 15న రూ.33.50 కోట్లతో 63.4 మీటర్లు అనంతపురం వైపు 443 మీటర్లు, పెనుకొండ వైపు 130 మీటర్ల అప్రోచ్ పొడవుతో ఈ వంతెన నిర్మాణం ప్రారంభించామని నేడు ఇది ప్రజలకు ఉపయోగంగా ఉందని తెలిపారు.

హిందూపురం ఎంపి పార్థసారథి, మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెసింధూర రెడ్డి అభ్యర్థనలను మంత్రి స్పందించి ఆయా ప్రాంతాలలోనూ సత్వరమే రైల్వే అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అజయ్ శర్మ, అమితేష్ కుమార్, బెంగళూరు డివిజనల్ రైల్వే మేనేజర్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్, వివిధ రైల్వే విభాగాలకు చెందిన అధికారులు, టిడిపి కూటమి నాయకులు, రైల్వే ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర రైల్వే సహాయమంత్రి సోమన్న

పుట్టపర్తి రైల్వేస్టేషన్‌క ఆధునికరించలి : కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే వినతి

కార్యక్రమం అనంతరం పుట్టపర్తికి వెళ్లిన మంత్రి సోమన్నకు పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లో ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పుట్టపర్తి రైల్వే స్టేషన్ ఆధునికరణ, కొత్తచెరువు రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డును ఫ్లైఓవర్ బ్రిడ్జిగా మార్చాలని ఆయనకు ఎమ్మెల్యే సింధూర రెడ్డి వినతిపత్రం అందజేశారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయండి

● మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అందరూ కలిసికట్టుగా మిషన్ మోడ్‌తో పని చేసి ఈ నెల 8న విశాఖలో జరగనున్న ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లకు సంబంధించి విశాఖ కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులు, కూటమి ప్రజాప్రతినిధులతో లోకేష్ నేతృత్వంలోని మంత్రుల బృందం ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని పర్యటన రాష్ట్రానికి ఎంతో కీలకమని, రాష్ట్ర భవిష్యత్తు ఈ పర్యటనపై ఆధారపడి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని ఫాస్ట్ ట్రాక్‌లో పెట్టేందుకు కేంద్ర మద్దతు అవసరమని తెలిపారు. ఇది కేవలం ఉత్తరాంధ్రకు సంబంధించిన పర్యటన కాదని, మొత్తం రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించినదని పేర్కొన్నారు. ప్రధాని రోడ్ షో, బహిరంగ సభకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, ప్రభుత్వ విప్‌లు గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఎయు ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న ప్రధాని సభ ఏర్పాట్లను లోకేష్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

ఉక్కునగరంలో నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న డాక్టర్ బి.గంగారావు

స్టీల్‌ప్లాంట్‌పై ప్రధాని ప్రకటన చేయాలి

● ఉక్కు నిర్వాసిత కాలనీల్లో నిరసనలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఈ నెల 8న విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సహా ఉక్కు నిర్వాసిత కాలనీల్లో పాదయాత్రలు నిర్వహించారు. ఉక్కునగరం రైతు బజార్ వద్ద తలపెట్టిన కార్యక్రమంలో జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వంద శాతం వ్యూహాత్మక అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్టు తక్షణమే ప్రధాని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలతో స్థానిక ఉక్కు యాజమాన్యం కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు చర్యలు తీసుకుంటోందని, ప్రమాదాల నడుమ పనిచేస్తున్న కార్మికుల సంఖ్యను తగ్గిస్తే ఆ ప్రమాదాలు మరింత పెరిగి కర్మాగారంలో భద్రత కుంటుపడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ ప్రభుత్వ రంగ పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి జరిగితే ప్రజలకు అనుకూల ధరల్లో ఉక్కు ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. సామాన్యులు ఉక్కు ఉత్పత్తులను అధికంగా వినియోగిస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి ఉత్పత్తి చేయడానికి అవసరమైన ముడి ఖనిజాన్ని సరఫరా చేయాలని కోరారు. సొంత గనులు కేటాయించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవడం కోసం మూడేళ్లు ట్యాక్స్ హాలిడే ప్రకటించే విధంగా కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించాలని కోరారు. ప్రధాని తన పర్యటనలో పైఅంశాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు వైటి దాస్, డొక్కా నర్సింగరావు పాల్గొన్నారు. పోరాట కమిటీ ఆధ్వర్యాన పెదగంట్యాడ జంక్షన్ నుంచి నడుపూరు గాంధీ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించారు. పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ నాయకులు యు రామస్వామి, పులి రమణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వై శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ నెల ఎనిమిది వరకూ ఉక్కు రక్షణ కోసం జరిగే కార్యక్రమాలను ప్రజలు, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. వడ్లపూడిలో జరిగిన కార్యక్రమంలో పోరాట కమిటీ కో - కన్వీనర్ జె అయోధ్యరామ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్నాథం పాల్గొన్నారు. అగనంపూడి పరిసర ప్రాంతాల్లో బైకు ర్యాలీ నిర్వహించారు.

పేషీలపై నిఘానేత్రం

● ప్రభుత్వ ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంత్రుల పేషీలపై కన్నేసి ఉంచాలని ఇంటెలిజెన్స్ అధికారులకు ప్రభుత్వం నుండి ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో మంత్రుల కార్యాలయాల్లో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు పరిశీలించి, ఉన్నతస్థాయిలో నివేదించేందుకు నిఘా వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామం సచివాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రుల పేషీల్లో పనిచేసే సిబ్బందిపై భారీ స్థాయిలో అవినీతి ఆరోపణలు వస్తుండటంతో అత్యున్నత స్థాయిలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఈ తరహా కారణాలతోనే ఓ మహిళా మంత్రి దగ్గర పనిచేసే ప్రైవేట్ పిఎను ఆ బాధ్యతలనుంచి తప్పుకోవాల్సిందిగా ప్రభుత్వం తాజాగా ఆదేశించినట్లు తెలిసింది. కీలక వ్యక్తుల నుండి ఆదేశాలు రావడంతోనే ఆ మంత్రి తన పిఎను తొలగించినట్లు సమాచారం, ఉత్తరాంధ్రకు చెందిన ఓ మంత్రి పేషీలో కీలక అధికారి అవినీతికి పాల్పడుతున్నట్లు కూడా ప్రభుత్వ పెద్దల దృష్టికి వచ్చింది. పోస్టింగ్‌లు, బదిలీలకు పెద్ద మొత్తంలో ప్రైవేటు పర్సనల్ అసిస్టెంట్లు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయలసీమకు చెందిన ఓ మంత్రి పిఎ కూడా ఇదే పనిలో ఉన్నట్లు సమాచారం. పలువురు మంత్రులు నేటికీ వారి వారి శాఖల్లో పట్టు సాధించకపోవడాన్ని వారి శాఖల్లో పనిచేసే కీలక సిబ్బంది అవకాశంగా తీసుకుంటున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. త్వరలో జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ సోదరుడు నాగబాబును క్యాబినెట్‌లోకి తీసుకోనున్న నేపథ్యంలో ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్తవారికి అవకాశం ఉండొచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇదే సందర్భంలో మంత్రుల పేషీల్లో అవినీతిపై ఆరోపణలు గుప్పుమంటుండటంతో ఏ మంత్రిపై వేటు పడుతుందోఅనే చర్చ కూడా అధికారపార్టీ వర్గాల్లో సాగుతోంది.

వర్గీకరణతోనే న్యాయం

● ఏకసభ్య కమిషన్‌కు మాదిగల వినతి

ప్రజాశక్తి-మద్దిపాడు (ప్రకాశం జిల్లా)

షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ సోమవారం ప్రకాశం జిల్లాలో పర్యటించింది. ఏక సభ్య కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఎఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా మద్దిపాడులోని అరుంధతి నగర్ (మాదిగ పల్లె)లో పర్యటించారు. స్థానికుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. తమ పిల్లలు చదువుకున్నా.. ఉద్యోగాలు రావడంలేదని, వర్గీకరణ చేస్తే తమ ఉద్యోగాలు తమకు వస్తాయని, తమ పిల్లల భవిష్యత్తు బాగుంటుందని స్థానికులు కమిషన్‌కు విన్నవించారు. ఎస్‌సి బాలుర హాస్టల్‌ను సందర్శించి భోజనం మెనూ ఎలా ఉందని విద్యార్థులను రాజీవ్ మిశ్రా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒంగోలు భాగ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలను సందర్శించారు. వసతి సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలోనూ ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా షెడ్యూల్ కులాల ప్రతినిధులు, ప్రజలు, ఉద్యోగ సంఘాలు, కుల సంఘాల నాయకుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో ఆయా ఉప కులాల ప్రాతినిధ్యంపై చర్చించారు. అందరి అభిప్రాయాలను క్రోడీకరించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు. కమిషన్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మి ప్రసన్న ఉన్నారు.

ప్రకాశం జిల్లా మద్దిపాడులోని అరుంధతి నగర్‌లో పర్యటిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా

పిన్నెల్లి ప్రధాన అనుచరుడు అరెస్టు

ప్రజాశక్తి- విజయపురి సౌత్ (పల్నాడు జిల్లా)



మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిషోర్‌ను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పల్నాడు జిల్లా నాగార్జునసాగర్, విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా పలు ప్రాంతాల్లో తీవ్రంగా గాలించారు. ఆదివారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. వైసిపి ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక దౌర్జన్యాలు అక్రమాలు చేసినట్లు కిషోర్ పై ఆరోపణలు ఉన్నాయి. పిన్నెల్లి అండతో మాచర్ల నియోజకవర్గంలో పలు అరాచకాలతో పాటు 2020 లో స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలనకు వచ్చిన టిడిపి నేతలు బోండా ఉమా, బుద్దా వెంకన్నలపై తురకా కిషోర్ దాడి చేయడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ దాడి కేసులో తురకా కిషోర్ ప్రధాన నిందితుడు. జనరల్ ఎన్నికలరోజు మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ఘర్షణలు అనంతరం ఆయన అందుబాటులో లేకుండా పోయారు. ఏడు నెలల తరువాత హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం తెలుసుకొని పోలీసులు అరెస్టు చేసి, హైదరాబాదు నుండి నిందితుడు తురకా కిషోర్‌ను పోలీసులు తీసుకువస్తున్నట్లు విజయపురిసౌత్ పోలీసులు తెలిపారు.

ఆప్కాస్‌లోకి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు : బొప్పరాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆప్కాస్‌లోకి తీసుకోవాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎపి జెఎసి అమరావతి అనుబంధం) డిమాండ్ చేసింది. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఎపి జెఎసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇప్పటికే ఏజెన్సీల దోపిడీకి గురవుతున్న వేలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లోకి తీసుకోవాలన్నారు. మెప్మా, సెర్ప్ ఉద్యోగుల వలే, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్‌సి పాలసీ అమలు చేయాలన్నారు. జీతాలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 | విజయవాడ | సోమవారం 6 జనవరి 2025

అక్షరం

“తను చెప్పదలచుకున్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు, తన చాతగాని తనాన్ని, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనకా, అలంకారాల మధ్యా, కఠిన పదాల బురఖాల్లోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి. ముఖ్యంగా సహజ సౌందర్యం తక్కువైనప్పుడు!” - చలం

వాళ్లకు గోడ కుర్చీ వేయండి!

ఎవర్రా అది..
గురువుతో కాళ్లు మొక్కించుకున్న సన్నాసీ?
నువ్వు లక్షణంగా బతకాలని
అక్షర బోధ చేసి
అహర్నిశలూ నీ అభివృద్ధికై తపించే
తండ్రి లాంటి గురువును
అహంకారంతో కళ్ళు నెత్తికెక్కి
అవమానపరిచింది ఎవర్రా?

గురు బ్రహ్మ గురుర్విష్ణు
గురు దేవో మహేశ్వర్ణ
గురు సాక్షాత్ పరబ్రహ్మ.. అన్నారే!
గురువులో దైవాన్ని చూడమన్న శ్లోకం
నీకు అర్థం కాలేదా?
మానవత్వం లేని మతమౌఢ్యాన్ని వీడమని
ఏ గురువూ నీకు హితోపదేశం చేయలేదా?
మన మతం భారతీయత కాదా?
సాటి మనిషిని గౌరవించడం మన అభిమతం కాదా?
ఏ మూఢభక్తి నీ వివేచనకు ముసుగేసింది రా?
కుల మతాల మత్తులో జోగుతూ
మంచితనాన్ని మనిషి తత్వాన్ని మరిచిన ఉన్మాదుల్లారా!

చేతులెత్తి మొక్కాల్సిన గురువుపై
చేయి చేసుకున్న మిమ్మల్ని
నాగరిక సమాజం నుంచి బహిష్కరిస్తున్నాం!
మీ వికృత చేష్టల నీడ
భావితరాలపై పడకుండా
జీవితాంతం గోడ కుర్చీ వేయించాల్సిందిగా
సభ్య సమాజానికి విజ్ఞప్తి చేస్తున్నాం!

(రంగారెడ్డి జిల్లాలోని ఓ పాఠశాలలో అయ్యప్ప మాల వేసుకున్న 9వ తరగతి విద్యార్థికి కాలు తగిలిందనే నేరం మోపి హెడ్మాస్టర్ చేత విద్యార్థి కాళ్లు మొక్కించిన ఘటనకు నిరసనగా)

– సునీత గంగవరపు
94940 84576

కొత్త కదలిక

పాత వత్సరాన్ని అవనతం చేస్తూ
కొత్త సంవత్సరం తెరపైకొచ్చింది
రెపరెపలతో రంగురంగులతో
శుభాకాంక్షలను తెచ్చినంతనే
వచ్చినంతనే నూతనమెంతని
తేరిపార చూడొద్దంది కాలం
చెమటచుక్కలో కనబడని
ఇంద్రధనుస్సు వర్షపు చినుకులో
కానవస్తే ఆ పాపం తనది కాదంది
కదిలే కాలం కరిగే కాలం
రెండూ నీటిచుక్కలేగా అంది
నోరు లేని ఓ ప్రశ్న రాజం
రాజసమేదన్నది రాజ్యపు సమాధానం
కాలపు దిబ్బలో బూడిద ఒకవైపు
పసిడి ముద్దలు ఇంకోవైపు
కుప్పలుగా పడివుంటే
తగరపు మెరుపులు తప్పని తాళంతో
ఒక వైపు భజన చేస్తుంటే
వింటున్న చెవుల పక్కనే ఉన్న
నీటి చెలమలైన కన్నులు
వాటికిందే మెదపలేని ఓ నోరు
తరతరాల అనుభవాల్ని జోడించి
కండను కండరాన్నీ కష్టాన్నీ
కలబోసిన తన శ్రమ గురించి
జవాబేదో చెప్పబోయింది
సమర్ధనలింక చాలంది నూతనత్వం
కొత్తగా మళ్ళీ కదలమంది
విరామమెరుగని అడుగులు
వడివడిగా కదుల్తానే ఉన్నాయి!

– జంధ్యాల రఘుబాబు
98497 53298

డా.రాణీ పులోమజాదేవి స్మారక కథా పురస్కారం-2025

తెలుగు సాహితీ వనం ఆధ్వర్యంలో డాక్టర్ రాణీ పులోమజాదేవి స్మారక కథాపురస్కారానికి కథాసంపుటాలను ఆహ్వానిస్తున్నారు. 2021-2024 మధ్య వెలువడిన కథా సంపుటాలు 3 ప్రతులను కింది చిరునామాకు 31.01.2025 లోగా పంపాలి. విజేతగా నిలిచిన వారు తప్పనిసరిగా తెలుగు సాహితీవనం 8వ వార్షికోత్సవం రోజున హైదరాబాద్‌కు వచ్చి పురస్కారం స్వీకరించాలి. విజేతకు రూ.5116 నగదు, సత్కారం అందజేస్తారు. కథాసంపుటాలు పంపాల్సిన

చిరునామా : అరుణనాయుడు తోట, NCL LB గోదావరి, సి బ్లాక్ – 502, పైప్‌లైన్ రోడ్డు, జీడిమెట్ల, హైదరాబాద్–500067. మొబైల్ : 63019 30055. సంప్రదింపులకు : 95022 36670 (శాంతికృష్ణ).

11న ‘గుల్‌మొహర్’ పుస్తకావిష్కరణ

గుల్జార్ కవితలకు వెన్నెల సత్యం తెలుగు స్వేచ్ఛానువాదం ‘గుల్‌మొహర్’ పుస్తకావిష్కరణ జనవరి 11 శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాలులో జరుగుతుంది. కె.ఆనందచారి సభాధ్యక్షులు, డా.ఏనుగు నర్సింహారెడ్డి ఆవిష్కర్త, గౌరవ అతిథులు మౌనశ్రీ మల్లిక్, జెల్ది విద్యాధరరావు, రాపోలు సీతారామరాజు, డా.వి.జయప్రకాశ్, అనంతోజు మోహనకృష్ణ పాల్గొంటారు.

– తెలంగాణ సాహితి

8న ‘అంబ పలుకు’ ఆవిష్కరణ

ప్రముఖ కవి, రచయిత పి.శ్రీనివాస్ గౌడ్ తాజా కవితా సంపుటి ‘అంబపలుకు’ ఆవిష్కరణ సభ విజయవాడ పుస్తక మహోత్సవంలో 8.1.2025వ తేదీ రాత్రి 8 గంటలకు జరుగుతుంది. ఖాదర్ మోహియుద్దీన్ ఆవిష్కరిస్తారు. సుంకర గోపాల్ పరిచయం చేస్తారు. బండ్ల మాధవరావు, యాకూబ్, సత్యాజీ, శాంతిశ్రీ, పద్మకళ, కలిమిశ్రీ, పి.శ్రీనివాస్ గౌడ్ పాల్గొంటారు.

‘అన్నదాత’లో ఒక దృశ్యం

‘దేవరాగం’లో ఒక సన్నివేశం

‘విడాకులు కావాలి’లో ఒక ఘట్టం

అలరించిన అజో - విభొ కథానాటికలు

అజో – విభొ – కందాళం ఫౌండేషన్ (అప్పాజోస్యుల – విష్ణుభొట్ల) వారి 32వ వార్షిక సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు జనవరి 2 – 5 తేదీల్లో విజయవాడలో... జాషువా సాంస్కృతిక వేదికతో కలిసి మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా, విజయవంతంగా నిర్వహించారు. విశిష్ట పురస్కారాలు, సాహితీ సాంస్కృతిక సదస్సులు, వివిధ గ్రంథాల ఆవిష్కరణలు, తెలుగు రాష్ట్రాల స్థాయిలో కథా నాటికల పోటీలు ఆద్యంతం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కళాకారులు, సాహితీవేత్తలకు, కార్యకర్తలకు ఈ నాలుగు రోజులూ పండగే. అధిక సంఖ్యలో హాజరయ్యారు. ‘అప్పాజోస్యుల...’ పరిషత్‌కు తెలుగు రాష్ట్రాల్లో ఓ విశిష్ట స్థానం ఉంది. కథ ఆధారంగా రాసిన నాటికలను మాత్రమే ప్రదర్శింపజేసే ఏకైక పరిషత్ ఇది. ఈ ఫౌండేషన్ నాటిక ప్రదర్శనలతో పాటు సాహితీ రంగాన్నీ సమాంతరంగా ఆదరిస్తోంది. వివిధ సాహిత్య విభాగాల్లో విశేష కృషి చేస్తున్న నిష్ణాతుల్ని ఘనంగా సత్కరిస్తోంది. వారి సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలతో అపురూపమైన జ్ఞాపికలను ప్రచురిస్తోంది. సమీకరించిన నిధులతో కాక పూర్తిగా సొంత నిధులతోనే మొత్తం కార్యక్రమాలు నిర్వహించటం ఈ ఫౌండేషన్ ప్రత్యేకత. కార్యక్రమాలను నిర్దేశిత సమయానికి కచ్చితంగా ప్రారంభించడం వీరి ఆనవాయితీ.

ఈ పరిషత్ నిర్వహించే నాటికల పోటీకి ముందుగా నిష్ణాతుల టీమ్ స్క్రూటినీ నిర్వహిస్తుంది. ఈసారి మొత్తం 18 నాటికలను చూసి ఎనిమిదింటిని ఎంపిక చేశారు. వర్తమాన సమాజంలోని వివిధ సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని అల్లిన ఈ కథానాటికలు ప్రేక్షకులను అలరించాయి. రైతులపై దోపిడీ, స్త్రీ స్వేచ్ఛ, కుటుంబ సంబంధాల భూమిక, సైకాలజీ సబ్జెక్ట్, మానసిక రుగ్మతలు తదితర భిన్న ఇతివృత్తాల నాటికలను ప్రదర్శింపజేశారు.

ఫౌండేషన్ స్థాపకులు, నిర్వాహకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ

అన్నదాత : పాలకవర్గాల విధానాలతో కుదేలవుతున్న రైతు– వ్యాపారులు, దళారీల దోపిడీ తోడై పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతూ.. అజ్ఞానంతో ‘ప్రత్యామ్నాయ సాగు’ (?) ఎరకు చిక్కి ఏకంగా ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న ఉదంతాల్ని ‘అన్నదాత’ నాటికలో కళాంజలి, హైదరాబాద్ కళాకారులు హృద్యంగా ప్రేక్షకుల కళ్లకు కట్టారు. మూలకథ, నాటకీకరణ వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం కొల్లా రాధాకృష్ణ. రైతు బాధలు, కష్టాల రీత్యా– కోర్టులో ఆయన వాదన సానుభూతి కలిగించొచ్చు గానీ.. చట్ట ప్రకారం ఆ తీరు వాదన చెల్లదేమోననే సందేహానికి ఆస్కారం లేదనలేం. గంజాయి సాగు విషయంలోనూ సాధ్యాసాధ్యాల ప్రశ్న ఉదయించొచ్చు. నటనాపరంగా ప్రదర్శకుల స్థాయి ఇంకొంచెం పెరిగితే మరింతగా ఆకట్టుకునేది.

వేదాంతం : తన మూలంగా ‘ఆమెకు’ జరిగిన కష్టం, నష్టం నుంచి బయటపడేసి మళ్లీ ‘ఆమె’ జీవితాన్ని చిగురింపజేయాలనే ప్రయత్నంలో ఆ ఆకాశ ప్రేమికుడి తపనే ‘వేదాంతం’. శ్రీ షిర్డీ సాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్, అనకాపల్లి వారు ప్రదర్శించారు. మూలకథ గుడిపాటి వెంకటాచలం, నాటకీకరణ మార్గశీర్ష, దర్శకత్వం ముత్యాలరావు పొన్నాడ. కళాకారులు పాత్రోచితంగా నటించారు. ‘పాతివ్రత్యం వల్ల వచ్చే సుఖ వ్యాధుల గురించి బాగా చెబుతుంది ఈ పుస్తకం.. చదువుతున్నంత సేపూ మీరే గుర్తొస్తున్నారు....’ “లా’ కప్పులో ఇమడదని చెప్పండి’ వంటి డైలాగులు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేపినా... మొత్తంగా చూసినప్పుడు కంటెంట్‌లో క్లారిటీ పెరగాలి అనిపించింది.

(అ)సత్యం: ఈ నాటిక ఉత్తమ ప్రదర్శన నిలిచింది. కంటికి కనిపించేదంతా సత్యం కాకపోవొచ్చు.. అలానే– కనిపించనంత మాత్రాన అది అసత్యమైపోదు. సత్యమే అయినా దుష్ఫలితానికి దారితీసేదైతే అది అసత్యమేనని; అబద్ధమైనా శుభానికి దోహద పడితే అది సత్యమేనని సూత్రీకరించారు ‘(అ)సత్యం’ రచయిత పిన్నమనేని మృత్యుంజయరావు (మూలకథ : శ్రీసుధ మోదుగు). చైతన్య కళాస్రవంతి, ఉక్కునగరం (విశాఖపట్నం) కళాకారులు పి.బాలాజీ నాయక్ దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. లైట్స్ ఆఫ్ అండ్ ఆన్‌లతో ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించకుండా వెంటవెంటనే కర్టెన్స్ మార్పుతో ప్రదర్శనను జరిపారు.

దేవరాగం : రెండో ఉత్తమ ప్రదర్శనగా నిలిచిన నాటిక ఇది. తల్లిదండ్రుల్ని వృద్ధాప్యంలో కంటి రెప్పలా కాపాడుకుంటే.. ఆ వృద్ధాప్యమే తల్లిదండ్రులకు మధురమైన మలిదశ బాల్యమవు తుందంటారు ‘దేవరాగం’ రచయిత. పెద్ద జీతం, అమెరికా ఉద్యోగం కంటే వృద్ధ తల్లిదండ్రులను సేవించడమే మిన్న అని భావించారు. మూలకథ సలీమ్. రచయిత కేకేఎల్ స్వామి దర్శకత్వంలో శ్రీ సౌజన్య కళా స్రవంతి, ఉత్తరాంధ్ర బందం అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను చూరగొన్నారు.

అనశ్వరం : లోకంలో మనం చాలామందిని ఇష్టపడొచ్చు.. కానీ మనల్ని ఇష్టపడే వ్యక్తి ఒకరున్నా అదృష్టమే అన్నది ‘అనశ్వరం’ నాటిక సారాంశం. బర్రె సత్యనారాయణ రచన, డి.వి.చంద్రశేఖర్ దర్శకత్వంలో శ్రీ కృష్ణా ఆర్ట్ థియేటర్ ఆర్ట్స్, విజయవాడ వారు ఈడిగ్గా ప్రదర్శించారు. ప్రేక్షకులకు ఈ సైకాలజీ ఇతివృత్తం అంతగా పట్టలేదనిపించింది. బ్రహ్మ స్వరూపం : చాలా హాయిగా, ఉల్లాసంగా సాగిపోతున్న కుటుంబంలో అనుకోకుండా ఘోర విపత్తు జరిగితే..? సాక్షాత్తూ బ్రహ్మస్వరూపమే ఆవహించి– ధర్మాన్ని చెప్పడం నాటిక ఇతివృత్తం. ఆద్యంతం ప్రదర్శన ఆకట్టుకుంది. అయితే.. అత్యంత ఘోర విపత్తు జరిగిన విషయం తెలిసిన సందర్భంలో నటన ఇంకా పండాలి అనిపించింది.

వర్క్ ఫ్రం హోం : కాఫీ కూడా కలపడం రాని భార్యతో.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కష్టాల్ని ఆద్యంతం హాస్యభరితంగా రంజింపజేశారు పి.ముత్యాలరావు దర్శకత్వంలో సహృదయ, ద్రోణాదుల కళాకారులు. మూలకథ కేకే భాగ్యశ్రీ, నాటకీకరణ అద్దేపల్లి భరత్ కుమార్. విడాకులు కావాలి : భార్యాభర్తలు పరస్పర అంగీకారంతో పనులు చక్కబెట్టుకోవడం.. పంతాలూ పట్టింపులకూ పోకుండా సర్దుబాటు ధోరణితో సంసారాన్ని పండించుకోవాలనే సందేశాన్ని అరవింద ఆర్ట్స్, తాడేపల్లి కళాకారులు హాస్యంతో మిళితంజేసి అందించారు. మూలకథ : ఆలూరి విజయలక్ష్మి, రచన : వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం గంగోత్రి సాయి. తొలి సీన్లలో.. హాస్యం పండించే క్రమంలో (ప్రధాన జంట) సంభాషణల సౌండ్‌తో పాటు వేగంగా చెప్పడంతో క్లారిటీ తగ్గి, గందరగోళం అనిపించింది.

స్క్రూటినీ దశలో ఆకుల మల్లేశ్వరరావు, చిట్టి వెంకటరావు; తుది ప్రదర్శనలకు డా.ఎం.సి.దాస్, కె.శాంతారావు, ఎస్. నరసరాజు స్థాననిర్ణేతలుగా వ్యవహరించారు. విజయవాడ పుస్తక మహోత్సవం కూడా ఇదే రోజుల్లో జరుగుతున్నందున వివిధ జిల్లాల నుంచి రచయితలు, కళాకారులు నగరానికి విచ్చేసి, ఈ ప్రదర్శనలను తిలకించారు. ఆఖరి ప్రదర్శన వరకూ కూడా పెద్ద సంఖ్యలోనే ప్రేక్షకులు ఉండడం విశేషం. జాషువా సాంస్కృతిక వేదిక సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహించటంతో పాటు అతిథులకు, ఆహ్వానితులకు చక్కని ఆతిథ్యం అందించింది.

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

పది పదుల పార్వతీశం

సందర్భం

ఎన్నిసార్లు చదివినా మళ్లీ చదవాలనిపించే తెలుగు నవలల్లో మొక్కపాటి నరసింహశాస్త్రి గారి బారిస్టర్ పార్వతీశం ఒకటి. 1924లో దీనిని రచయితే ప్రచురించి, తెనాలి సాహితీ సమితి ప్రథమ సమావేశంలో ఆవిష్కరించారు. ఏనాడూ ఇల్లు వదిలి బయటకు వెళ్లని ఒక కుర్రవాడు, రైలు, కారు, ఓడ ఏవీ ఎక్కని వ్యక్తి ఏకంగా ఇంగ్లండు వెళ్లటం; దారి పొడుగునా తనకు తెలియని విషయాల్ని ఎదుర్కోవటం ఈ నవల ఇతివృత్తం. ఈ విషయాన్ని ఎంతో హాస్యస్ఫోరకంగా మలిచిన తీరు చూసిన అనేకమంది ఇది నరసింహశాస్త్రి గారి స్వీయచరిత్ర అన్నారు. ఇది నరసింహశాస్త్రి గారి ఆత్మకథ అనుకోవటానికి కారణం ఆయన ఇంగ్లాండు వెళ్లివచ్చిన వ్యక్తి కావటమే! ఈ విషయంలో కొంత సత్యముండి వుండవచ్చు. కాని హాస్యంతో మిళితమైన కాల్పనికత కూడా వుంది. కథ ప్రకారం పార్వతీశానిది నర్సాపురం సమీపంలోని మొగల్తుర్రు. మొక్కపాటి గారిది గొల్లల మామిడాల సమీపంలోని గంగ్రేడు గ్రామం. నవలలో కథా నాయకుడి విద్యాభ్యాసం నర్సాపురంలో జరిగితే, మొక్కపాటి గారు పిఠాపురంలో చదివారు.

ఒక స్నేహితుని దగ్గర అప్పు తీసుకొని ఇంగ్లండు బయలుదేరిన పార్వతీశం అంతకుముందు ఎప్పుడూ నర్సాపురం దాటి వెళ్లలేదు. అటువంటిది రైలులో చెన్నపట్నం వెళ్లి అక్కడి నుంచి సింహళం (శ్రీలంక)కి ఆ తర్వాత అక్కడి నుండి ఇంగ్లాండుకి ఓడలో వెళ్లటం, నాలుక గీసుకోటానికి కొన్ని తాటాకు బద్దలు, పళ్లు తోముకోటానికి కచ్చికల పొడి నింపిన డబ్బా, కొంచెం కొబ్బరినూనె, ఆరు యజ్ఞోపవీతాలు (జంధ్యాలు), మూడు మొలతాళ్లు లాంటి సామాను సంతరించుకొని ఒక రేకు పెట్టెలో ఇవన్నీ సర్దుకొని బయలుదేరిన ఈ అమాయకుడు రైలులోనూ ఓడలోనూ పడిన పాట్లు ఈ నవలని హాస్యరచనగా నిలిపాయి. నర్సాపురం నుంచి పార్వతీశాన్ని నిడదవోలు తీసుకెళ్లినప్పుడు, అక్కడినుండి మద్రాసు తీసుకెళ్లినప్పుడు వాణ్ణి మళ్లీ ఇల్లు చేరుద్దామనుకున్న రచయిత ఈ కుర్రవాణ్ణి దేశాంతరాలకు తీసుకెళ్తే తమాషాగా వుంటుందని భావించి పార్వతీశాన్ని ఇంగ్లాండు పంపించానని చెప్పుకున్నాడు. రైలు కదలగానే పక్క వాళ్లపై పడడం, అత్యవసర సమయాల్లో బండి ఆగటానికి ఉపయోగించే చైనుకు సామాను కట్టటం, దాంతో రైలు ఆగటం, బంట్రోతు పరిచిన పట్టుపరుపుపై పడుకోకూడని అనుకోవటం, ఆడవాళ్ల పెట్టెలో ఎక్కటం, చీకటిగా వుంది కదా అని లండన్‌లో రోడ్డు పక్కనే ఒకటికి పోవటం, ఆ విషయాన్ని గొప్పగా పార్టీలో పదిమందికీ చెప్పటం, కత్తులు చెంచాలు ఉపయోగించి తినటం చాతగాక తిప్పలు పడడం లాంటి అనేక సందర్భాలు హాస్యం పుట్టించినా పార్వతీశం అనుభవశాలిగా మారుతున్న క్రమంలో హాస్యం తగ్గటం సహజంగానే జరిగింది.

బారిష్టర్ పార్వతీశం తొలి భాగం 1924లోనే అచ్చుపడినా, రెండు, మూడు భాగాలు 1971 వరకు రాలేదు. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు మొక్కపాటి వారు మరణించారు. ఆధునిక కాలంలో హాస్యాన్ని తెలుగు వారికందించింది చింతా దీక్షితులు గారని విమర్శకుల మాట. ఆ తర్వాత పానుగంటి, చిలకమర్తి, గురజాడ ఆ కోవలో రచనలు చేశారు. వీరేశలింగం గారు కొన్ని ప్రహసనాలు రాసినా అవి గాని, గురజాడ గిరీశం పాత్ర హాస్య లక్షణాలున్నవిగా కొందరు విమర్శకులు అంగీకరించలేదు. ముట్నూరి సంగమేశ్వరరావు అనే పెద్దాయన ‘తెలుగు హాస్యం’ అనే తన పుస్తకంలో ‘గిరీశాన్ని సహించలేము పార్వతీశాన్ని విడిచి వుండలేము’ అన్నారు. ఇందులో కొంత అతిశయం వుందేమో కాని వర్తమానికి సంబంధంలేని వందేళ్ల నాటి పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుంటే పార్వతీశం నిస్సందేహంగా హాస్య నవలే. కొన్ని దశాబ్దాల తర్వాత మళ్లీ చదువుతుంటే అప్పుడు పుట్టిన హాస్యం లేదనిపించటానికి పరిస్థితులన్నీ పూర్తిగా మారటం, పాఠకుడిగా మన స్థాయి పెరగటం కూడా కారణాలై వుంటాయి.

పార్వతీశం హాస్యప్రవృత్తితోపాటు నవలలో చూపించిన ఆనాటి లండన్ నగరం, భూగర్భ రైలు, ఆనాటి సింహళం, మద్రాసు నగరం, ప్రయాణ సన్నాహాలు ఈ నవల ఒక యాత్రా దర్శిని అన్పించుకోగల యోగ్యత కూడా కలిగివుంది. ఎడింబరోలో చదువుతున్నప్పుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారి ప్రవేశమూ, ‘ఆయనెవరో గాంధీ అనే ఆయన యేర్పాటు చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటి’ అనటం ద్వారా ఆనాటికి ఉద్యమంలో గాంధీ గారికున్న స్థానాన్ని తెలియజేస్తుంది. కాలమాన పరిస్థితుల ప్రస్తావనల దృష్ట్యా ఇది ఆత్మకథ కుండే లక్షణాలు కూడా కలిగి వుంది.

మద్రాసు రేడియో స్టేషన్ ప్రారంభించినప్పుడు ఆచంట జానకిరాం గారు ... విదేశీ అనుభవాలు కొన్ని రాసిస్తే ప్రసారం చేద్దామనగా మొక్కపాటి కొన్ని రాసిచ్చారు. తర్వాత కొన్ని సంవత్సరాలకి విజయవాడ ఆకాశవాణి కేంద్రం నుండి కూడా బుచ్చిబాబు ప్రోత్సాహంతో కొన్ని ప్రసారం చేశారు. తర్వాత మిత్రుల ఒత్తిడితో అవి అచ్చువేద్దామని ప్రయత్నిస్తే మద్రాసు కేంద్రంలోని కేసట్లు ‘కూం’నది వరదల్లోనూ, విజయవాడ కేంద్రంలోని కేసట్లు కృష్ణానది వరదల్లోనూ కొట్టుకుపోయాయని చెప్పారట. చివరకు నార్ల వెంకటేశ్వరరావు గారు ఆంధ్రజ్యోతి వారపత్రికలో మొదటిభాగం సీరియల్ వేయటం ప్రారంభించి, సగం అయినాక పిలిచి ఇప్పటికైనా రెండవభాగం ప్రారంభించాల్సిందే అని చెప్పి, మీకు రాయటానికి ఇబ్బందిగా వుంటే ‘మా సబ్–ఎడిటర్ ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ గారు మీరు చెబుతుంటే రాస్తాడని’ చెప్పగా 2వ భాగం, 3వ భాగం పూర్తిచేసి మొత్తం అంతా కలిపి 544 పేజీల్లో ఒకే పుస్తకంగా తెచ్చారు. ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ గారి ఆత్మకథలో ఈ పుస్తకానికి సంబంధించిన ప్రస్తావనలు వున్నాయి. తెనాలి సాహితీ సమితి 1919లో తల్లావజ్ఝుల శివశంకర శాస్త్రి అధ్యక్షులుగా ఏర్పడిందని దానిలో కరుణశ్రీ జంధ్యాల పాపాయశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి, మొక్కపాటి, తల్లావజ్ఝుల లాంటి ప్రముఖులు సభ్యులుగా వున్నారని 1933లో నవ్య సాహిత్య పరిషత్తు ఏర్పడ్డాక దీని ప్రభ తగ్గిందని, శాస్త్రి గారు వ్యక్తిగత సంస్కారం, అధ్యయనం నిశితమైనవని, చక్కని సాంప్ర దాయపు పంచెకట్టు, లాల్చీ ధరించి వుండేవాడని శ్రీకాంతశర్మ పేర్కొన్నారు.

రజస్వల కాని పిల్లనే చేసుకోవాలనే చాదస్తాన్ని తిరస్కరించిన పార్వతీశం చివరకు రజస్వల కాని పిల్లనే చేసుకున్నా వారి మధ్య జరిగిన సంభాషణలు, శృంగార భావనలు అసహజంగా ఎబ్బెట్టుగా వున్నాయి. ప్రతి పేజీలో ఒకసారి పార్వతీశం ఫలహారం చేశాడని చెప్పటం కూడా అంత బాగాలేదు. బార్‌ఎట్‌లా అనేది ఆరోజుకి మన దేశంలో గొప్ప చదువుగా వుండేది. కాని నర్సాపురం స్కూలులో స్కూలు ఫైనల్ కూడా పూర్తిచేయని పార్వతీశం మూడేళ్లలో బారిస్టర్ చదువుతోపాటు యం.ఏ కూడా ఉత్తీర్ణుడై రావటం ప్రశ్నార్ధకంగా వుంది. బారిష్టర్ కోర్సుకి ప్రవేశ పరీక్ష వున్నా అది అంత సులభమా? ఈ ప్రశ్నకు సమాధానం తెల్సుకుందామంటే బార్‌ఎట్‌లా చదివిన వారెవ్వరూ ఇప్పుడు సజీవులుగా లేరు. ఎప్పుడో అర శతాబ్దం క్రితం విద్యార్థిగా ఉన్న రోజుల్లో చదివినప్పుడు కలిగిన స్పందన ఇప్పుడు కలగకపోవటానికి రచనస్థాయిలో కాకుండా పాఠకుని స్థాయిలో మార్పు రావటమే కారణం. ఈ నవల విషయంలోనే కాకుండా చాలా రచనల విషయంలో ఇలాగే జరుగుతుంది. అయితే ఇలాంటి రచనలు చదివేప్పుడు ఇవి శతాబ్దం క్రితం రాసినవనే స్పృహ కలిగి వుండాలి.

– చెరుకూరి సత్యనారాయణ

కన్న భూమికే కాందిశీకులైన వారి కథలు



“ఇప్పటికి కేంపు వదిలిపెట్టి చాలా కాలమైనా, చాలా పనులు, ఉద్యోగాలు, ఊర్లు మారినా ఎప్పుడైనా జీవితంలో కిందకు పడుతున్నాననే అనుమానం వస్తున్నప్పుడు ఒక రాత్రి కలలో బర్మా కేంపు కొండ మీదనుంచి ఒక పాసెంజర్ విమానం కిందకు జారిపోతుంటుంది. అందులో నేనుంటాను. స్పృహతో మేల్కొంటాను. బతకాలని పోరాటం చేస్తుంటాను. ఎంత పోరాటమంటే ఎలాగైనా బతికి తీరాలి అనేంత పోరాటం. ఈలోగా కల చెదిరిపోతుంది. వాస్తవం కళ్ళ ముందుంటుంది. కలతో కూడా నన్ను వెంటాడే కొండ మీద విమానం నాకు ఇష్టం. ములక్కాడ చెట్లతో, బాదం చెట్లతో చల్లగా వుండే పాత బర్మా కేంపు అంటే ఇంకా ఇష్టం.”

భౌతికంగా, మానసికంగా, సామాజిక వికాసంతో తనను ఎంతో ప్రభావితం చేసిన ‘బర్మా కేంపు’ గురించి, అంత గొప్ప భావోద్వేగ బంధం ఏర్పరచుకున్న రచయిత హరి వెంకట రమణ. అందుకే హృదయమున్న ప్రతి పాఠకుణ్ణి కదిలించేలా తన అనుభూతుల్ని అక్షరబద్ధం చేసారు తన ‘బర్మా కేంపు కథలు’ పుస్తకంలో. నిజానికి, విశాఖ పట్టణంగా వున్నప్పటి నుంచీ ఈనాటి మహా విశాఖ నగరంగా ఎదిగినప్పటికీ, బర్మా కేంపు విశిష్టత, నేటికీ ఈ విశాఖ మహానగరంలో, మరేప్రాంతానికీ లేదని చెప్పొచ్చు. అసలు ‘బర్మా కేంపు’ ఏర్పడిన నేపథ్యమే ఓ కన్నీటి సాగరం. తాము పుట్టి కొన్నాళ్ళు దూరమైన జన్మభూమికే కాందిశీకులైన భారతీయులు (తెలుగు వారు) విషాద గాథ. దాదాపు రెండు వందల సంవత్సరాల క్రితమే, భారతదేశం నుంచి, బర్మా, సింగపూర్, మలేషియా, మారిషస్, దక్షిణాఫ్రికా, ఇంకా అమెరికా ఖండంలోని కొన్ని ప్రాంతాలకు భారతీయులు బతుకుతెరువు కోసం వలస వెళ్ళారు. కానీ దురదృష్టకర పరిస్థితుల్లో ఒక్క బర్మా (నేటి మయన్మార్) దేశం నుంచి ఆరున్నర దశాబ్దాల క్రితం భారతదేశానికి కాందిశీకులుగా తిరిగి వచ్చారు.

అలా తిరిగి వచ్చిన వారిలో తెలుగువారు, ముఖ్యంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందినవారే ఎక్కువ. అయితే వారు కాందిశీకులుగా వచ్చినప్పటికీ, వేలాది ఎకరాలు విశాఖపట్టణంలో ప్రభుత్వ భూములు ఖాళీగా వుండేవి. కానీ, ఆనాటి అధికారుల నిర్లక్ష్యమో, ప్రజా ప్రతినిధుల బాధ్యతారాహిత్యమో కానీ, అప్పటికి అంగుళం అభివృద్ధి చెందని, విస్తృత కంచరపాలెం వాసులకు శ్మశానభూమి అయిన ప్రాంతానికి సమీపంలో ఈ ‘బర్మా కేంపు’ ఏర్పాటు చేశారు.

కనుచూపు మేరలో జనసంచారం లేని స్థితి. దైనందిన అవసరాలు తీరే మాట దేవుడెరుగు. తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా కల్పించని ఖాతరు వేని పాలన. అయితే, ఆ అనాథ బర్మా కేంపులో బర్మా ఏతర, బడుగు వర్గాలు, ఆవాసాలు ఏర్పరచుకొనే క్రమంలో, ఈ కథల రచయిత, బాల్యం బర్మా కేంపులో ప్రారంభమైంది. అందరూ సామాన్య, పేద, మధ్య తరగతి బాలలలాగే హరి వెంకట రమణ బాల్యం గడిచింది.

ఉన్నత వర్గానికి చెందిన తాత బర్మా వలస అనుభవాలు, చిన్నతనంలోనే, అనూచానంగా వంట బట్టించుకున్నాడు. శాస్త్రీయ దృక్పథంతో, సామ్యవాద భావజాలంతో సామాజిక, కార్మికరంగ నాయకుడైన తండ్రి ప్రభావం అతనిపై వుంది. తన భౌతిక ప్రస్థానం బర్మా కేంపుతో ప్రారంభిస్తూనే, అనేక, వాస్తవ సంఘటనలు, బర్మాకేంపును ప్రభావితం చేసిన వ్యక్తులు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, మధ్యతరగతి మనుషుల అనురాగ బంధాలు అన్నీ అక్షరబద్ధం చేశాడు. నిజానికి రచయిత కంటే ముందు తరానికి, ఒకనాటి, ‘చందమామ’, ‘బాలమిత్ర’ వంటి కథల పుస్తకాల పఠనానుభూతిని కొన్ని కథల్లో గుర్తుకు తెచ్చారు. ఈ కథల్లో మూడొంతులు, బర్మా కేంపు నేపథ్యంతో ప్రారంభమై, బర్మా కేంపు ప్రజల స్పందనతో ముగుస్తాయి.

ఓడలు బళ్ళు బళ్ళు ఓడలైనట్లు... పూలమ్మిన చోటే కట్టెలమ్మిన బర్మా కాందిశీకుల వెతలు కన్నీరు రప్పిస్తాయి. చివరికి కాందిశీకులలో రెండో తరం వారికి, ఎమర్జెన్సీ కాలంలో, ఉద్యోగావకాశాలు వచ్చినా, అమాయకత్వంతో, ఆ అవకాశాలను అతి చౌకగా అమ్మేసుకొని అనాథలుగా జీవించిన వారెందరో! ఆ అంశాన్నీ నిష్పక్షపాతంగా వ్యక్తం చేశారు హరి. అలాగే ‘బర్మా తుపాకులు’ కథలో, చరిత్రను స్పృశించి, తన చారిత్రక ఆసక్తిని తెలియజేశారు. ఎందరో ఏ కారణాల వలన బర్మా వెళ్ళారు? ఏ పరిస్థితులలో వెనక్కు వచ్చారు? దానికి జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు ‘బర్మా తుపాకులు’ కథలో చదివి తెలుసుకోవలసిందే! ముఖ్యంగా రెండో ప్రపంచయుద్ధ కాలంలో, భారతదేశంలో కొన్ని వందల కిలోమీటర్లు నడిచివచ్చి, కలకత్తా నుంచి ఓడల్లో, రైళ్ళలో స్వస్థలాలకు చేరుకున్నవారు, అనతికాలంలోనే తిరిగి బర్మా వలసవెళ్ళడం విధిలేని స్థితిని విపులంగా ఈ కథలో వివరించారు. (ఈ అంశాన్ని అనేక సభల్లో, బర్మా కాందిశీకులు, ప్రముఖ నాటక, సినీ రచయిత, పాత్రికేయులుబీశెట్టి లక్ష్మణరావు ప్రసంగాల్లో విన్నాను)

దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం జరిగిన యథార్థ సంఘటన చెన్నయ్యధార కొండపైన కూలిన, నేవీ విమానం సంఘటన, (కొండ మీద విమానం) 1985లో పంతులమ్మ పాకలు అగ్నిప్రమాద సంఘటన, ఈ ప్రాంతంలో పేరు మోసిన ఒక సంఘ వ్యతిరేక శక్తి అనుమానాస్పద మృతి, (కేంపు రౌడీలు కథ) తన నాయనమ్మ సెంటిమెంటుతో ముడివడిన ‘రంగూన్ పళ్ళెం’ కథలు కట్టి పడేస్తాయి. బాల్యాన్ని బాగా ఎంజాయ్ చేసినా, యవ్వన, కౌమార దశలలో, తన పరిశీలనాదృష్టిని, తన సృజనాత్మకతతో ముడిపెట్టి, ఈ తరం పాఠకులకు, మంచి కథలను అందించిన రచయిత, కార్టూనిస్టు కూడా. సామాజిక చైతన్యానికి, పేద బాలబాలికల సాంఘికాభివృద్ధికి చేయూతనిచ్చే కార్యక్రమాల నిర్వాహకులు హరి వెంకట రమణ. అనేక ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. అంతర్జాల పత్రిక ‘సారంగ’లో ధారావాహికంగా అచ్చయిన ఈ వినూత్న కథలను సంపుటిగా, ‘రేగి అచ్చులు–హైదరాబాదు’ సంస్థ ముద్రించి, పాఠకలోకానికి అందుబాటులోకి తీసుకువచ్చింది.

– బి.వి.అప్పారావు, 93470 39294

ఇమ్మిగ్రేషన్‌పై రాజుకుంటున్న వివాదం

- అంతుచిక్కని ట్రంప్ ఆంతర్యం
- హెచ్-1బి వీసాల జారీపై ఆంక్షలు ఉండొచ్చని అనుమానాలు
- పొంచివున్న 'మాగా' మూవ్‌మెంట్ ముప్పు

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టేందుకు సన్నాహాలు కొనసాగుతున్న తరుణంలో ఇమ్మిగ్రేషన్‌పై వివాదం రాజుకుంటోంది. హెచ్-1బి వీసాలపై వాడిగా, వేడిగా రాజకీయ చర్చ నడుస్తోంది. విదేశీ నిపుణులను తాత్కాలిక ప్రాతిపదికపై నియమించుకునేందుకు యాజమాన్యాలను అనుమతించేదే ఈ హెచ్-1బి వీసా కేటగిరీ. 'ది న్యూయార్క్ పోస్ట్' పత్రికకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ట్రంప్ హెచ్-1బి వీసా కార్యక్రమాన్ని సమర్థించారు. తాను ఎప్పుడూ వీసాలను ఇష్టపడతానని, వాటిపై తనకు నమ్మకం ఉన్నదని ఆయన చెప్పుకొచ్చారు. అయినప్పటికీ గందరగోళ సంకేతాలు వస్తూనే ఉన్నాయి.

భారతీయులే అధికం

గత నాలుగు సంవత్సరాల కాలంలో అమెరికాలో అత్యధిక వేతనాలు అందుకుంటున్న హెచ్-1బి దరఖాస్తుదారుల్లో 78 శాతానికి పైగా భారతీయులే. వారి ప్రతిపాదిత వార్షిక వేతనం పది లక్షల డాలర్లు దాటుతోంది. ఈ విధంగా అత్యధిక వేతనాలు పొందుతున్న భారతీయుల్లో 25 శాతం మంది మహిళలు ఉన్నారు. మన దేశానికి చెందిన హెచ్-1బి దరఖాస్తుదారుల్లో 65 శాతం మందిని అమెరికాలోని చిన్న కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. అమెరికా కంపెనీలు స్పాన్సర్ చేసే హెచ్-1బి వీసా దరఖాస్తుదారులకు మన దేశంలోని కంపెనీలు స్పాన్సర్ చేస్తున్న విదేశీయుల కంటే అధిక వేతనాలు వస్తున్నాయి. అందుకే అమెరికాలో ఉద్యోగాల కోసం యువత పరుగులు పెడుతోంది.

హెచ్-1బి వీసా అంటే ?

అసలు హెచ్-1బి వీసా అంటే ఏమిటి? వృత్తిపరమైన నైపుణ్యం కలిగిన విదేశీయులను ఆ నిపుణత అవసరమైన ఉద్యోగాల్లో తాత్కాలికంగా నియమించుకునేందుకు హెచ్-1బి నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాలు అనుమతిస్తాయి. నిర్దిష్ట విభాగంలో బ్యాచ్‌లర్ లేదా హయ్యర్ డిగ్రీ ఉన్న వారు ఈ వీసాలు పొందేందుకు అర్హులు. హెచ్-1బి కార్యక్రమాన్ని అమెరికా ప్రతినిధి సభ 1990లో ప్రారంభించింది. ప్రారంభంలో దీని కింద ఆర్థిక సంవత్సరంలో 65,000 మందికి అవకాశం లభించేది. 2004 నుండి దానిని 85,000కు పెంచారు. ఇందులో 20,000 వీసాలు అమెరికా యూనివర్సిటీల నుండి మాస్టర్ డిగ్రీలు చేసిన లేదా అధిక విద్యార్హతలు పొందిన వారికి రిజర్వ్ చేశారు. ఈ వీసాలను మూడు సంవత్సరాల కాలపరిమితికి మాత్రమే మంజూరు చేస్తున్నప్పటికీ ఆరు సంవత్సరాల వరకూ పొడిగించవచ్చు. హెచ్-1బి వీసా కోసం వ్యక్తిగతంగా దరఖాస్తు చేయాలంటే అమెరికాలోని కంపెనీ లేదా సంస్థ ఉద్యోగాన్ని స్పాన్సర్ చేయాల్సి ఉంటుంది. తమ దేశంలో అప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారికి అమెరికా ప్రభుత్వం వీసా పొడిగింపులు కూడా ఇస్తోంది.

లాటరీ ద్వారా ఎంపిక

అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం 2023లో (2022 అక్టోబర్ నుండి 2023 సెప్టెంబర్ వరకూ) 3,86,000 హెచ్-1బి దరఖాస్తులను ఆమోదించారు. వీటిలో 1,19,000 కొత్త వీసాలు కాగా సుమారు 2,67,000 వీసాలు పొడిగింపులకు సంబంధించినవి. 2022లో 4,74,000 వీసాలకు అనుమతి ఇవ్వగా 2023లో ఆ సంఖ్య తగ్గింది. తాజా సమాచారం ప్రకారం వీసాల్లో 72 శాతం భారతీయులకు మంజూరు చేసినవే. 12 శాతం వీసాలతో చైనా రెండో స్థానంలో ఉంది. హెచ్-1బి వీసాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటూనే ఉంటుంది. యూఎస్‌సీఐఎస్ ప్రచురించిన అర్హత పొందిన రిజిస్ట్రేషన్ల సంఖ్యను పరిశీలిస్తే...2023లో 4,74,421 దరఖాస్తులు రాగా 2024లో 7,58,994 దరఖాస్తులు వచ్చాయి. అందుబాటులో ఉన్న వీసాల కంటే ఈ సంఖ్య అధికంగా ఉండడంతో లాటరీ తీసి దరఖాస్తుదారులను ఎంపిక చేస్తున్నారు. అయితే దీనిపై పలువురు నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పనిచేస్తున్న రంగాలు ఇవే

అనుమతి లభించిన దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణిత రంగాల్లో పని చేస్తున్నారు. వీరిలోనూ కంప్యూటర్ ఆధారిత ఉద్యోగాల్లో పని చేస్తున్న వారు ఎక్కువ. 2023 ఆర్థిక సంవత్సరంలో వీసా అనుమతులు పొందిన వారిలో 65 శాతం మంది ఈ తరహా ఉద్యోగాలు చేస్తున్న వారే. పది శాతం మంది ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, సర్వేయింగ్ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇక యాజమాన్యాల విషయానికి వస్తే 2024లో హెచ్-1బి వీసా దరఖాస్తుదారుల్లో ఎక్కువ మందిని అమెజాన్ తీసుకుంది. ఈ కంపెనీ 13,000 మంది విదేశీయులను నియమించుకుంది.

అవరోధంగా మారిన 'మాగా'

ట్రంప్ 2.0 హయాంలో వీసా కార్యక్రమంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇమ్మిగ్రేషన్‌ను పరిమితం చేయడం ట్రంప్ ప్రభుత్వ అజెండాగా ఉంది. 2017లో ట్రంప్ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల కారణంగా తిరస్కరణకు గురైన హెచ్-1బి వీసాల రేటు నాలుగు రెట్లు పెరిగి 24 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో హెచ్-1బి వీసాల చుట్టూ సాగుతున్న చర్చలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ట్రంప్ 1.0 హయాంలో ఎన్ని హెచ్-1బి దరఖాస్తులకు అనుమతి లభించిందో బైడెన్ పాలనలోనూ అన్ని దరఖాస్తులనే ఆమోదించారు. అయినప్పటికీ మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) పేరిట మొదలైన ఉద్యమం దరఖాస్తుదారుల్లో ఆందోళనలను పెంచుతోంది. ట్రంప్‌కు సన్నిహితులుగా ఉండే వ్యాపారవేత్తలు ఎలన్ మస్క్, వివేక్ రామస్వామి విదేశీ ఉద్యోగుల వీసా కార్యక్రమాన్ని సమర్ధించడం ఊరట కలిగించే విషయం. వీరిద్దరూ ట్రంప్ ప్రభుత్వంలో కీలక భూమిక పోషించబోతున్నారు. కానీ 'మాగా' మద్దతుదారులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇమ్మిగ్రేషన్‌ను పరిమితం చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు.

ట్రంప్ మాజీ సలహాదారు స్టీవ్ బానన్ హెచ్-1బి వీసా కార్యక్రమాన్ని ఓ కుంభకోణంగా అభివర్ణించారు. ఆయన తాజాగా మస్క్‌కు హెచ్చరికలు జారీ చేస్తూ విదేశీ నిపుణులు అమెరికాలో అత్యధిక వేతనాలు లభించే ఉద్యోగాలను ఎలా చేపడతారని ప్రశ్నించారు. ప్రతినిధి సభ మాజీ సభ్యుడు, ట్రంప్ సహచరుడు మాట్ గెట్జ్ కూడా మాగాకు మద్దతుదారుడే. ట్రంప్ ప్రభుత్వ ఏఐ విధాన సలహాదారుగా సిలికాన్ వ్యాలీ వెంచర్ పెట్టుబడిదారుడు శ్రీరామ్ కృష్ణన్‌ను నియమించడంపై ట్రంప్ మద్దతుదారులు మండిపడుతున్నారు. అమెరికాలో గ్రీన్‌కార్డ్ పరిమితులపై ఉన్న ఆంక్షలన్నింటినీ తొలగించాలని కోరుతున్న వ్యక్తిని నియమిస్తే దేశంలో ఇమ్మిగ్రేషన్‌ను ఎలా నియంత్రించగలమని వారు నిలదీశారు. అమెరికాలో ఇలాంటి నిరసన గళాలు రాజకీయ నిర్ణయాలను మార్చగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మస్క్ కూడా హెచ్-1బి వీసాపై అంతర్జాతీయ విద్యార్థిగా అమెరికా వెళ్లి అక్కడే పని చేస్తున్నారు.

బస్తర్ జర్నలిస్ట్ హత్యపై ప్రెస్ కౌన్సిల్ ఆందోళన

న్యూఢిల్లీ : ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ జర్నలిస్ట్ (33) హత్యపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) ఆందోళన వ్యక్తం చేసింది. నివేదికను సమర్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. బస్తర్ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ మృతి కేసును పిసిఐ సుమోటోగా స్వీరించిందని, కేసుకు సంబంధించిన వాస్తవాలపై నివేదికను సమర్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు పిసిఐ చైర్‌పర్సన్ రంజనా ప్రకాశ్ దేశాయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రెస్ అసోసియేషన్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా కూడా జర్నలిస్ట్ హత్యను ఖండించాయి. ఈకేసుపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశాయి. రహదారి నిర్మాణంలో అక్రమాలను ఎత్తిచూపిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ ముఖేష్ చంద్రకర్ జనవరి ఒకటిన అదృశ్యమయ్యాడు. శుక్రవారం బీజాపూర్ పట్టణంలోని చత్తన్‌పరలో సురేష్ చంద్రకర్‌కి చెందిన స్థలంలోని సెప్టిక్ ట్యాంక్‌లో అతని మృతదేహం లభ్యమైన సంగతి తెలిసిందే. అతని సోదరుడు యుకేష్ చంద్రకర్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ముఖేష్ చంద్రకర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్‌గానే కాకుండా బస్తర్ జంక్షన్ అనే యూట్యూబ్ ఛానల్‌ను నడుపుతున్నారు. 2021 ఏప్రిల్‌లో మావోయిస్టుల చెర నుండి కోబ్రా కమాండో రాకేశ్వర్ సింగ్ మన్హాస్‌ను విడుదల చేయడంలో ముఖేష్ కీలక పాత్ర పోషించారు. భవన నిర్మాణ కాంట్రాక్టర్లు, ముఖేష్ బంధువులు రితేష్ చంద్రకర్, దినేష్ చంద్రకర్, సురేష్ చంద్రకర్, వారి దగ్గర పనిచేస్తున్న ఉద్యోగి మహేంద్ర రామ్‌టేక్‌లు హత్య చేశారని, ఇప్పటివరకు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సురేష్ చంద్రకర్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో బిజెపి నేతల పాత్ర కూడా ఉన్నట్లు ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపిస్తోంది. గతేడాది సురేష్ చంద్రకర్ బిజెపిలో చేరారని, అధికార పార్టీ నేతలతో దిగిన ఫొటోలు ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ కమ్యూనికేషన్ వింగ్ చీఫ్ సుశీల్ ఆనంద్ శుక్లా తెలిపారు. సురేశ్ చంద్రాకర్ 10 రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి నివాసాన్ని సందర్శించారని అన్నారు. గత 15 రోజుల సిఎం నివాసానికి సంబంధించిన సిసిటివి ఫుటేజీ, సందర్శకుల జాబితాను వెల్లడించాలని అన్నారు. సురేష్ చంద్రాకర్ అవినీతిని ముఖేష్ బయటపెట్టడం ఎందుకు చర్చకు రావడం లేదని ప్రశ్నించారు. రూ.120 కోట్ల రహదారి కాంట్రాక్ట్‌లో 90 శాతం అడ్వాన్స్‌గా ఎందుకు చెల్లించారని శుక్లా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు.

నిందితులతో పోలీసులు

16 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -హుకుంపేట

అల్లూరి జిల్లా హుకుంపేట మండలం తీగల వలస పంచాయతీ పామురాయ్ జంక్షన్ వద్ద హుకుంపేట ఎస్ఐ ఎల్ సురేష్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా 16 కిలోల గంజాయి పట్టుబడింది. ద్విచక్ర వాహనంపై గంజాయి రవాణా చేస్తుండగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఆరు కిలోలతో ఇద్దరు అరెస్ట్

చోడవరం మండలంలోని గౌరీపట్నం జంక్షన్ వద్ద పోలీసులు జరిపిన వాహన తనిఖీల్లో కారులో తరలిస్తున్న ఆరు కిలోల గంజాయిని పట్టుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఎస్ఐ సి.నాగకార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం.. ముందుస్తు సమాచారం మేరకు సిఐ ఆదేశాలతో పోలీసులు వాహన తనిఖీలు చేయగా, ఎపి 31బి 5783వాగనార్ కారులో ప్రయాణిస్తున్న చింతలపూడి లావణ్య, వెంకట సత్యకుమార్, చొప్పా. దిలీప్ వద్ద ఆరు కిలోల గంజాయి పట్టుబడింది.గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.నాగకార్తీక్ తెలిపారు.

బంగ్లాదేశ్ జడ్జీలకు శిక్షణా కార్యక్రమం రద్దు

ఢాకా : భారత్‌లో బంగ్లాదేశ్‌కు చెందిన జడ్జిలు, న్యాయాధికారులకు నిర్వహించతలపెట్టిన శిక్షణా కార్యక్రమం రద్దయింది. ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు బంగ్లాదేశ్ న్యాయశాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. అయితే, ఇందుకు గల కారణాలను మాత్రం పేర్కొనలేదు. బంగ్లాదేశ్ మీడియా కథనాల ప్రకారం ఆ దేశ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్‌కు చెందిన 50 మంది జడ్జిలు, న్యాయాధికారులకు మధ్యప్రదేశ్‌లోని జ్యుడీషియల్ అకాడమీల్లో ఫిబ్రవరి 10న శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందుకు జిల్లా, సెషన్స్, అదనపు, సహాయ న్యాయమూర్తి స్థాయి అధికారులు ఎంపిక చేశారు. ఇందుకయ్యే ఖర్చు మొత్తాన్ని భారత ప్రభుత్వమే భరిస్తుందని కూడా బంగ్లాదేశ్ అధికారులు చెప్పారు.

ట్రంప్‌తో ఇటలీ ప్రధాని భేటీ

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షునిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరికొన్ని రోజుల్లో అధికార బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఇటలీ ప్రధాని జార్జియా మెలోని తాజాగా ట్రంప్‌తో భేటీ అయ్యారు. శనివారం ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో ఎస్టేట్‌లో ఈ ఇరువురు నేతలు సమావేశమయ్యారు. 'ఇది సంతోషకరమైన సమయం. అద్భుతమైన మహిళ, ఇటలీ ప్రధానితో ఉన్నాను' అని ట్రంప్ అక్కడి వారితో పేర్కొన్నారు. అయితే ఈ సమావేశానికి సంబంధించిన వివరాలు వెల్లడించలేదు. అయితే, ఈ భేటీలో ఇజ్రాయిల్, ఉక్రెయిన్, రష్యా వంటి దేశాల గురించి, వాణిజ్య సమస్యలు, ఇరాన్‌లో నిర్బంధించిన ఇటాలియన్ జర్నలిస్టు విడుదల వంటి అంశాలను గురించి చర్చించినట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ట్రంప్‌తో అనేక మంది దేశాధినేతలు భేటీ అయ్యారు. ఇటీవల అర్జెంటీనా అధ్యక్షులు జేవియర్ మిలి, హంగేరీ ప్రధాని విక్టోర్ అర్బన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో వంటి నాయకులు ట్రంప్ సమావేశమయ్యి చర్చలు జరిపారు.

బంగ్లాదేశ్ నుంచి స్వదేశానికి భారత జాలర్లు

న్యూఢిల్లీ : భారత్-బంగ్లాదేశ్ మధ్య ఆదివారం కీలక పరిణామం చోటుచేసుకుంది. రెండు దేశాలూ పరస్పరం మత్స్యకారుల అప్పగింత ప్రక్రియ నిర్వహించాయి. దీంతో వివిధ ఘటనల్లో బంగ్లాదేశ్ అధికారులు అరెస్టు చేసిన 95 మంది భారతీయ మత్స్యకారులు స్వదేశానికి చేరుకున్నారు. అలాగే భారత్ సైతం 90 మంది బంగ్లాదేశీ జాలరులను ఆ దేశానికి అప్పగించింది. "ఇటీవలి నెలల్లో పలువురు భారతీయ మత్స్యకారులు అనుకోకుండా అంతర్జాతీయ సముద్ర సరిహద్దు దాటి బంగ్లా జలాల్లోకి ప్రవేశించగా.. వారిని అక్కడి అధికారులు అరెస్టు చేశారు. భారత్ సైతం ఇటువంటి పరిస్థితుల్లోనే కొంతమంది బంగ్లాదేశీయులను అరెస్టు చేసింది. అయితే, మానవతా కోణంతోపాటు మత్స్యకార వర్గాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని జాలరులు, వారి పడవలను విడిచిపెట్టేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి" అని భారత విదేశాంగశాఖ ఇటీవల ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇరుదేశాలూ ఈనెల 2న తమ తమ కోస్ట్‌గార్డ్‌లకు సంబంధిత మత్స్యకారులను అప్పగించాయి. ఇదే క్రమంలోనే ఆదివారం వారు స్వదేశాలకు చేరుకున్నారు. భారత్ తరఫున ఐసిజి వరద్, ఐసిజి అమృత్ కౌర్ నౌకలు 90 మంది బంగ్లాదేశీ మత్స్యకారులతో ఆ దేశానికి చేరుకుని వారిని అప్పగించాయి. ఈ 90 మందిలో ఓ పడవ ప్రమాదంలో భారత్ రక్షించిన 12 మంది కూడా ఉన్నారు. అనంతరం అక్కడినుంచి 95 మంది భారతీయులు, ఆరు చేపల బోట్లతో ఐసీజీ నౌకలు పశ్చిమ బెంగాల్‌లోని సాగర్ ద్వీపానికి చేరుకున్నాయి.

ఆరోపణలు కాదు ఆధారాలు చూపించండి

- కేంద్రమంత్రికి సిద్ధరామయ్య సవాల్

బెంగళూరు : కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంలోని మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి అసత్య ప్రచారం చేస్తున్నారని.. ఆ ఆరోపణలు నిజమైతే తగిన ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. తగిన రుజువులు లేకుండా తమపై అసంబద్ధమైన ఆరోపణలు చేస్తుంటే చూస్తూ ఊరుకోమని తెలిపారు. "మా మంత్రులు 60 శాతం కమీషన్ తీసుకొని..అవినీతికి పాల్పడుతున్నారని కుమారస్వామి ఆరోపిస్తున్నారు. కేవలం ఆరోపణలు చేయడమే ప్రతిపక్షాల పని కాదు. వాటిని ఆయన నిరూపించే వరకు వదిలిపెట్టము" అని ముఖ్యమంత్రి అన్నారు. బస్సు ఛార్జీల పెంపుపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలు, డీజిల్ ధరల పెరుగుదల, కొత్త బస్సుల కొనుగోలు వ్యయం, ద్రవ్యోల్బణం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఒడిశాలో దళితులపై దారుణం

- మేక దొంగతనం ఆరోపణలతో ఇద్దరికి గుండు కొట్టించిన స్థానికులు
- భౌతిక దాడి చేసి.. కులం పేరుతో దూషించి..చెప్పులతో ఊరేగించి
- సోషల్ మీడియా ద్వారా ఆలస్యంగా వెలుగులోకి
- నిందితులను కఠినంగా శిక్షించాలని సర్వత్రా డిమాండ్

భువనేశ్వర్ : బిజెపి ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ దళితులకు, మైనారిటీలకు రక్షణ ఉండదని మరొకసారి రుజువైంది. మేకలను దొంగిలించారన్న నెపంతో ఒడిశాలో ఇద్దరు దళితులపై అమానుష ఘటన చోటు చేసుకున్నది. కొందరు స్థానికులు ఆ ఇద్దరికి గుండు కొట్టించారు. దాడి చేశారు. కులం పేరుతో దూషించి, చెప్పులతో ఊరేగించారు. ఈ ఘటన జగత్‌సింఘ్‌పూర్‌లో నమోదైంది. గతేడాది డిసెంబర్ 27న చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్‌కు చెందిన ఒక నాయకుడు ఎక్స్ ద్వారా ఈ ఘటనకు సంబంధించిన వీడియోను బయటపెట్టాడు. అయితే, దళితులపై జరిగిన ఈ అమానుష చర్య దళిత సంఘాల నుంచే కాకుండా సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని దళిత సంఘాలు, సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు, బాధితులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులిద్దరు ఒక ఆటో రిక్షా ద్వారా రెండు మేకలను తరలిస్తున్నారు. అది చూసిన స్థానికులు.. ఆ ఇద్దరు మేకలను దొంగతనం చేసి తీసుకెళున్నారని భావించారు. బాధితులు ఇద్దరినీ వెంబడించారు. వారితో అమానుషంగా ప్రవర్తించారు. ఇష్టం వచ్చినట్టుగా దాడికి దిగారు. అంతటితో ఆగకుండా వారిని కులం పేరుతో దూషించారు. వారిద్దరికీ గుండు కొట్టించి, చెప్పుల దండ వేసి ఊరేగించారు. ఈ అమానవీయ ఘటన గత డిసెంబర్ 27న బిరిడి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు అమియా పాండవ్ ఎక్స్‌లో పోస్ట్ చేయటం ద్వారా ఇది బహిర్గతమైంది.

ఇద్దరు దళితులపై దాడికి పాల్పడిన ఏడుగురిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్) కింద కేసులు నమోదు చేశారు. బాధితుల్లో ఒకరి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసుల ఈ చర్యకు ఉపక్రమించారు. ఆటోరిక్షాలో స్నేహితుడితో కలిసి వస్తున్న తన కొడుకును కొందరు స్థానికులు అడ్డగించి పేరు, స్థానికత గురించి అడిగారని ఈనెల 1న ఇచ్చిన ఫిర్యాదులో బాధితుడి తండ్రి పేర్కొన్నాడు. దాడి సమయంలో స్థానికుల తన కొడుకు వెండి నెక్లెస్‌ను దొంగిలించారని వివరించాడు.

ఈ ఘటనలో పాల్గొన్నవారందరినీ గుర్తించటానికి అధికారులు దర్యాప్తు జరుపుతున్నారనీ, వారిపై న్యాయపరమైన చర్యలను తప్పకుండా తీసుకుంటామని పోలీసు అధికారి భవాని శంకర్ ఉద్గత తెలిపారు. "బిజెపి పాలిత ఒడిశాలో అన్యాయమే ప్రధాన లక్షణం. జగత్‌సింగ్‌పూర్‌లో దళితుల పట్ల ఎలా ప్రవర్తిస్తున్నారో చూడండి. మానవ గౌరవం ప్రమాదంలో ఉన్నది. డబుల్ ఇంజిన్ సర్కారుకు ఇది అవమానకరం" అని ఘటనను ఖండిస్తూ కాంగ్రెస్ నేత పాండవ్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

జ్వరాలతో వణుకుతున్న ఓటేరుపాళ్యం

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లి మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలో ఉన్న ఓటేరు పాళ్యంలో విష జ్వరాలతో ప్రజలు వణుకుతున్నారు. నిత్యం రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండంతో దోమలు విపరీతంగా పెరిగి గ్రామంలోని చిన్నారులతోపాటు వృద్ధులు జ్వరాల భారినపడుతున్నారు. గత నెలలో డెంగీతో ఓ విద్యార్థిని కూడా మృతి చెందిన విషయం విధితమే. అప్పటి నుంచి కూడా ఈ గ్రామంపై అధికారులు దృష్టి పెట్టలేదు. ప్రస్తుతం గ్రామంలో అధికశాతం ప్రజలు విష జ్వరాల భారినపడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు గ్రామంలో పర్యటించడం గానీ, అపరిశుభ్రంగా ఉన్న మురుగునీటి కాలువలను శుభ్రం చేయించడం, దోమల నివారణకు చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి గ్రామస్తులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రషీద్ ఖాన్ విశ్వరూపం

- కష్టాల్లో జింబాబ్వే

బులవాయో : జింబాబ్వేతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆఫ్ఘనిస్తాన్ విజయం దిశగా సాగుతోంది. ఆఫ్ఘన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ విశ్వరూపం ప్రదర్శించాడు. ఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ 10 వికెట్ల ఘనత నమోదు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు తీసిన రషీద్ రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు పడగొట్టాడు. మొత్తంగా రషీద్ ఖాన్‌కు టెస్ట్‌ల్లో ఇది మూడో 10 వికెట్ల ప్రదర్శన. రషీద్ తన ఆరు మ్యాచ్‌ల టెస్ట్ కెరీర్‌లో ఐదు 5 వికెట్ల ప్రదర్శనలు, మూడు 10 వికెట్ల ప్రదర్శనల సాయంతో 44 వికెట్లు పడగొట్టాడు.

రషీద్ విజృంభించడంతో రెండో టెస్ట్‌లో జింబాబ్వే ఓటమి అంచుల్లో ఉంది. ఛేదనలో తడబడిన జింబాబ్వే ఆదివారం, నాలుగో రోజు ఆట ముగిసి సమాయానికి విజయానికి ఇంకా 73 పరుగుల దూరంలో ఉంది. చేతిలో రెండు వికెట్లు మాత్రమే ఉన్నాయి. జింబాబ్వే సెకెండ్ ఇన్నింగ్స్‌లో ప్రస్తుతానికి 8 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. క్రెయిగ్ ఎర్విన్ (44), రిచర్డ్ నగరవ (3) క్రీజ్‌లో ఉన్నారు. జింబాబ్వే సెకెండ్ ఇన్నింగ్స్‌లో బెన్ కర్రన్ (38), సికందర్ రజా (38) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ ఆరు వికెట్లు పడగొట్టగా.. జియా ఉర్ రెహ్మాన్ రెండు వికెట్లు తీశాడు.

అంతకుముందు ఆఫ్ఘనిస్తాన్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో అద్భుతమైన పోరాటపటిమ కనబర్చింది. తొలుత రహ్మత్ షా (139) సెంచరీతో కదం తొక్కగా.. ఎనిమిదో నంబర్ ఆటగాడు ఇస్మత్ ఆలం (101) ఆఖర్లో బాధ్యతాయుతమైన సెంచరీ చేశాడు. ఫలితంగా ఆఫ్ఘనిస్తాన్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 363 పరుగులు చేసింది. జింబాబ్వే బౌలర్లలో రిచర్డ్ నగరవ ఆరు వికెట్లు పడగొట్టగా.. నగరవ 3, సికందర్ రజా ఓ వికెట్ దక్కించుకున్నారు. దీంతో జింబాబ్వే ముందు 278 పరుగుల లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్థాన్ ఉంచింది.

దీనికి ముందు జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 243 పరుగులకు ఆలౌటైంది. సికందర్ రజా (61), క్రెయిగ్ ఎర్విన్ (75) అర్ధ సెంచరీలతో రాణించారు. ఆఖర్లో సీన్ విలియమ్స్ (49) విలువైన పరుగులు జోడించాడు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో రషీద్ ఖాన్ 4, అహ్మద్‌జాయ్ 3, ఫరీద్ అహ్మద్ 2, జియా ఉర్ రెహ్మాన్ ఓ వికెట్ దక్కించుకున్నారు.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ 157 పరుగులకే ఆలౌటైంది. సికందర్ రజా, న్యామ్హూరి తలో మూడు వికెట్లు, ముజరబానీ రెండు, నగరవ ఓ వికెట్ పడగొట్టి ఆఫ్ఘన్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చారు. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో రషీద్ ఖాన్ (25) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా, జింబాబ్వే-ఆఫ్ఘనిస్తాన్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తొలి టెస్ట్ డ్రాగా ముగిసింది.

పారిశుధ్య కార్మికుల వెతలు

- పెరగని వేతనాలు... పర్మినెంట్ కాని ఉద్యోగాలు
- కనీస సౌకర్యాలకూ కటకటే

ప్రధాని మోడియే కాళ్లు కడిగినా.. మారని బతుకులు



ప్రయాగ్‌రాజ్ : అది 2019వ సంవత్సరం ఫిబ్రవరి నెల. అంటే సుమారు ఐదు సంవత్సరాల నాటి మాట. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగి ఆ నీటిని నెత్తిన చల్లుకున్నారు. ఆ దృశ్యాన్ని చూసి అందరూ తన్మయత్వంతో పులకించిపోయారు. ఇప్పుడు మరోసారి కుంభమేళా వస్తోంది. నాటి కుంభమేళాలో మోడీ చేత కాళ్లు కడిగించుకొని పట్టరాని ఆనందంతో ఉబ్బితబ్బిబైన పారిశుధ్య కార్మికుల జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. అదే కుల వివక్ష...చాలీచాలని జీతాలు...తుమ్మితే ఊడే ఉద్యోగాలు. వేతనాలు పెంచాలని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని అరచి గీపెడుతున్నా వారి మొర ఆలకించే నాథుడే కరువయ్యాడు.

శక్తివంతుడైన నేత కాళ్లు కడిగినా...

2019 కుంభమేళాలో మోడీ ఐదుగురు పారిశుధ్య కార్మికుల పాదాలు కడిగారు. ఆ నీటిని నెత్తిన చల్లుకున్నారు. ఇప్పుడు వారిలో ముగ్గురు మళ్లీ కుంభమేళా విధులకు హాజరవుతున్నారు. ఆ నాటి నుండి తమ జీవితాల్లో వచ్చిన గొప్ప మార్పులేవీ లేవని కర్బాకు చెందిన జ్యోతి మెహ్‌తార్ వాపోయారు. 'దేశంలో అత్యంత శక్తివంతుడైన నాయకుడు మా కాళ్లు కడిగారు. అయినా మా పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతి అభిప్రాయంతో మరో ముగ్గురు కార్మికులు కూడా ఏకీభవించారు. కుంభమేళా సమయంలో ఒకే గదిలో తలదాచుకున్న వీరందరి పాదాలనూ నాడు మోడీ కడిగారు. వీరంతా దళితులే. మోడీతో కాళ్లు కడిగించుకున్న కార్మికుల్లో ఉత్తరప్రదేశ్‌లోని బందాకు చెందిన ప్యారేలాల్, నరేష్ కుమార్, చౌబీ, సంభాల్‌కు చెందిన హోరీ లాల్, ఛత్తీస్‌గఢ్‌లోని కర్బాకు చెందిన జ్యోతి మెహ్‌తార్ ఉన్నారు.

ఇప్పటికీ అంటరానివారమే

వీరిలో ముగ్గురు ఇప్పుడు కుంభమేళా విధులకు హాజరవుతున్నారు. హోరీ లాల్ తిరిగి తన స్వగ్రామానికి వెళ్లిపోగా చౌబీ చనిపోయారు. ఆమె ఉద్యోగం భర్తకు లభించింది. కుంభమేళా ఫిబ్రవరిలో ముగుస్తుందని, ఆ తర్వాత తమ భవిష్యత్తు ఏమిటని కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న ప్యారేలాల్, నరేష్ కుమార్, జ్యోతి మెహ్‌తార్ ఆందోళన వ్యక్తం చేశారు. తాము నివసిస్తున్న శిబిరాల్లో ఎలాంటి మార్పులు లేవని 56 ఏండ్ల ప్యారేలాల్ చెప్పారు. కరెంట్, తాగునీటి సౌకర్యాలు సరిగా లేవని, భారీ వర్షం పడితే ఇక్కడ నివసించడం కూడా కష్టమేనని, తమను నేటికీ అంటరానివారిగానే చూస్తున్నారని వాపోయారు. తాను వాల్మీకి తెగకు చెందిన వాడినని, తన కంటే ఎక్కువ కులానికి చెందిన వారు తనతో కలిసి భోజనం కూడా చేయరని నరేష్ కుమార్ తెలిపారు. తమను అఖారాల లోపలికి వెళ్లనివ్వడం లేదని, కుంభ్‌కు సంబంధించిన ఏ మత కార్యక్రమానికీ తమకు ప్రవేశం లేదని చెప్పారు.

నెరవేరని సొంతింటి కల

మంచి జీవన స్థితిగతుల కోసం 2019లో ప్రయాగ్‌రాజ్ వచ్చామని, పీఎంఏవై కింద ఇంటి కోసం దరఖాస్తు చేశామని, అయితే ఇప్పటి వరకూ అధికారుల నుండి ఎలాంటి సమాచారం లేదని జ్యోతి తెలిపారు. ప్రస్తుతం ఓ మురికివాడలో నివసిస్తున్నామని, పారిశుధ్య కార్మికులం కావడంతో వేరే చోట ఇల్లు దొరకదని చెప్పారు. ప్యారేలాల్ కూడా పీఎం ఆవాస్ యోజన కింద ఇంటి కోసం దరఖాస్తు చేశారు. అయితే ఇప్పటికీ అది పరిశీలనలోనే ఉంది. 1990వ దశకం చివరి నుండీ కుంభమేళాలో పనిచేస్తున్నానని అంటూ కనీసం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి అయినా వేతనం పెంచాలని అధికారులకు మొర పెట్టుకున్నారు. ఆయనకు ఎనిమిది మంది పిల్లలు. ఐదుగురు కుమార్తెలకు వివాహం అయింది. ముగ్గురు కొడుకులు దినసరి వేతన కార్మికులుగా పనిచేస్తున్నారు. నరేష్ కూడా ఇంటి కోసం దరఖాస్తు చేశారు. కానీ ఆ కల నేటికీ నెరవేరలేదు. 2019లో ఆయనకు నెలకు ఎనిమిది వేల రూపాయల వేతనం లభించింది. ఇప్పుడు సుమారు పది వేల రూపాయలు వస్తున్నాయి. ఈ స్వల్ప మొత్తంతో కుటుంబాన్ని ఎలా నెట్టుకురావాలని ఆయన ప్రశ్నించారు.

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - ఆరిలోవ (విశాఖపట్నం)

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోల శ్రీబాల వీరాంజనేయస్వామి సూచించారు. విశాఖ కేంద్రకారాగారం వద్ద గల శ్రీకృష్ణాపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం మంత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, మరుగుదొడ్లు, విద్యార్థులు నిద్రించే గదులను, పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య లేమి పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్ పట్ల చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్య, క్రమశిక్షణ, ఆరోగ్యం, పరిశుభ్రత ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు తమ ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందన్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భనలో గురుకుల పాఠశాలల కో-ఆర్డినేటర్ రూపావతి, ప్రిన్సిపల్ రత్నవల్లి, అధికారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ పోటీలకు

- జెఎన్‌టియుజివి మహిళా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ వాలీబాల్ పోటీలకు జెఎన్‌టియు - జివి మహిళా జట్టు ఎంపికైంది. జెఎన్‌టియులో శనివారం నిర్వహించిన ఎంపిక పోటీల్లో అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థినులు పాల్గొన్నారు. పి.శ్రావణి, జి.హర్షిత, వి.ధాత్రి, బి.సాయిసుచిత్ర (జిఎంఆర్‌ఐటి), జి.గుణశ్రీ, బి.కావ్య (విజ్ఞాన్ ఉమెన్స్ కాలేజ్), పి.గాయత్రి (అవంతి ఇంజనీరింగ్ కళాశాల, భోగాపురం), పి.శృతి (ఇమ్మానుయేల్ ఇంజనీరింగ్ కాలేజ్), బి.మోహనలత, ఎం.సువర్ణ (జెఎన్‌టియు-జివి) కె.కీర్తి, (అవంతి కళాశాల, గరివిడి), ఎ.తన్సీరాణి (డైట్ కాలేజ్) ఎంపికయ్యారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జైపూర్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారు. వీరికి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు.. క్రీడా యూనిఫాం, టిఎ, డిఎలను అందించారు., యూనివర్సిటీకి, కళాశాలలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

మాధవీలతకు క్షమాపణ

- మిగిలిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా....
- తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'నటి మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా... ఆవేశంలో నోరుజారా.. ఆమెకు బేషరతుగా క్షమాపణ చెబుతున్నా.' అని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే బిజెపి నాయకులపై చేసిన మిగిలిన వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నా అని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఒక మహిళ పట్ల ఆ రకంగా మాట్లాడి ఉండకూడదని భావిస్తున్నానని అన్నారు. అయితే ఫ్లెక్సీగాళ్లు, బ్యానర్‌గాళ్లు తనపై మాట్లాడాన్ని అంగీకరించనన్నారు. తాను ఏ పార్టీలో చేరాలన్నది చెప్పడానికి సత్యకుమార్ ఎవరని అన్నారు. చంద్రబాబునాయుడి విజన్ నచ్చి తాను టిడిపిలో ఉన్నానని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తాడిపత్రి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. తాడిపత్రి ప్రజల అండ తనకు పుష్కలంగా ఉందన్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు కూడా తన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వారికి పదవులు పోతే ఇక్కడ మాట్లాడే వారు ఉండరని అన్నారు. తాను మాత్రం తాడిపత్రి ప్రజలకు మేలు చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

చలి పులి పంజా!

- మంచు దుప్పటిలో మన్యం
- గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు
- గజగజలాడిపోతున్న గిరిజనం

ప్రజాశక్తి -సీలేరు/ రాజవొమ్మంగి: మన్యంలో చలితీవ్రత బాగాపెరిగింది.గడచిన నాలుగైదు రోజులుగా వాతావరణంలో మార్పులతో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గడంతో చలి తీవ్రతకు గిరిజనం గజగజలాడిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలు కాకుండానే మంచుకురుస్తుండడంతో, చీకటి ముసురుకునే పరిస్థితులు కనిపించడంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోతున్నారు.

సీలేరు నది పరివాహక ప్రాంతం సమీపంలో నివసిస్తున్న చింతపల్లి క్యాంపు జిడిసి క్యాంపు గిరిజనులు పొద్దుపోకముందే చలిమంటలు కాగుతూ, చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఇక రాత్రివేళల్లో ఇళ్లల్లో చలి కుంపట్లు పెడితేగానీ కంటికి కునుకురాని పరిస్థితి ఉందని అంటున్నారు. ప్రతిరోజు తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు దట్టంగా పొగమంచు కురుస్తూ, వాతావరణంఅతి శీతలంగా మారుతుంది. చలితోపాటు చల్లని చిరుగాలులు వీస్తుండడంతో చలికి తాళలేక గిరిజనం వణికిపోతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగులు చలి, మంచు తీవ్రతకు ఊపిరి సలపని పరిస్థితి ఉంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను బట్టి రానున్న మరో రెండు వారాల పాటు చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఇప్పటికి సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు, మున్ముందు మరింత తగ్గిగే కష్టమేనని ఈ ప్రాంతీయులు అంటున్నారు. ఇదిలా సాయంత్రం పొద్దుగూక ముందునుంచే ప్రారంభమైన మంచు, ఉదయం 9గంటల వరకు వీడకుండా ఉండడంతో ప్రధానమార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇక హెడ్‌లైట్లు లేకుండా ఉదయం పూట వాహనాలు ముందుకు కదలని పరిస్థితి ఉంది. చలి తీవ్రతను తట్టుకోవడానికి చలిమంటలతోపాటు, ఉన్ని దుస్తులను, రగ్గులను కప్పుకుంటూ ఏజెన్సీవాసులు ఉపశమనం పొందుతున్నారు.

ఇక రాజవొమ్మంగి మండలం కాకరపాడు నుంచి, అలాగే రంపచోడవరం వైపు నుంచి పోలవరం వెళ్లే జాతీయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

ఈ పనుల వల్ల కొన్నిచోట్ల రహదారిపై కల్వర్టుల నిర్మాణానికి గోతులు తవ్వడం, ఆయాప్రాంతాల్లో కానరానట్లుగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో మంచు ముసుగులో అటుగా వెళ్లేవారు సకాలంలో గుర్తించలేని పరిస్థితుల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాబోవు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరికలు నేపథ్యంలో ప్రజలుభీతిల్లుతున్నారు. దగ్గు, జలుబు, ఆయాసం, జ్వరం, శ్వాససంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. రుగ్మతలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు తెలుపుతున్నారు.మన్య వాసులు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో అయితే తప్ప మంచులో బయటకు వెళ్లొద్దని, ఒకవేళ వెళాల్సివస్తే ఒంటినిండా చలి దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

అరకులోయ మండలంలో గత వారం రోజులుగా మంచు వర్షం కురుస్తుంది. చలి తీవ్రత కూడా గత వారం రోజులుగా పెరిగింది. ఇంటి నుండి బయటకు రావడానికి ఆయా ప్రాంతాల వాసులు భయపడిపోతున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలి తీవ్రత మొదలవుతుంది. ఉదయం వేళలో వర్షం మాదిరిగా పొగ మంచు కమ్ముకుని ఉండడంతో వాహన రాకపోకలు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. పర్యాటకులు మాత్రం ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయకుండా అరకు లోయ ప్రకృతి అందరాలను వీక్షించి తిరుగు ప్రయాణం కడుతున్నారు.

టమాటా ధర పతనం

- ఆందోళనలో అన్నదాతులు

ప్రజాశక్తి-గొలుగొండ (అనకాపల్లి జిల్లా)

టమాటా ధర పతనంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలో రూ.50 నుంచి రూ.100 వరకు పలికిన ధర, ఇప్పుడు తాము పండించిన పంట చేతికి వచ్చేసరికి కిలో రూ.10కి పడిపోతుందని సాగుదారులు వాపోతున్నారు. కృష్ణదేవిపేట మార్కెట్‌లో సుమారు 30కిలోలు ఉన్న క్రేట్ టమాటాలు రూ.250కి మించి ధర పలకేదు. గొలుగొండ, కొయ్యూరు మండలాలకు సరిహద్దులో ఉన్న కృష్ణదేవిపేట (ఏఎల్.పురం) ప్రధాన వ్యాపారం కేంద్రంగా ఉంది. ఈ రెండు మండలాల్లోని ఏఎల్.పురం, చోద్యం, లింగంపేట, పాడి, రత్నంపేట, కినపర్తి, వల్సంపేట, భీమవరం, పి.మాకవరం, కేడిపేట, నాగాపురం తదితర గ్రామాల్లోని మెట్ట భూముల్లో రబీ పంటగా రైతులు టమాటా, వంగ వంటి కూరగాయ పంటలను సాగు చేస్తుంటారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో టమాటా మొక్కలు నాటిన పొలాల్లో ప్రస్తుతం పంట దిగుబడి వస్తుంది. రైతులు టమాటాలను కేడిపేట తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. నర్సీపట్నం తుని ప్రాంతాల నుంచి దళారులు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ధరలు పతనం కావడంతో టమాటా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు రాయగడ రైల్వే డివిజన్ భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం జమ్మూ వేదికగా దేశ వ్యాప్తంగా పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రాయగడ రైల్వే డివిజన్ భవనం ఉందని, దానికి ప్రధాని శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సమీప ప్రాంతాలలో కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు ఈ డివిజన్ తోడ్పడుతుందని తెలిపారు. తెలంగాణలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని చర్లపల్లి కొత్త టెర్మినల్ స్టేషన్‌ను సుమారు రూ.413 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయగా దానిని ప్రధాని ప్రారంభించనున్నారన్నారు. వీటితో పాటు 742.1 కిలోమీటర్ల పరిధిగల జమ్మూ రైల్వే డివిజన్‌ను కూడా పిఎం ప్రారంభిస్తారన్నారు.

పరిష్కారం చూపని రెవెన్యూ సదస్సులు!

భూ సమస్యలపై కోకొల్లలుగా దరఖాస్తులు

ప్రజాశక్తి - పార్వతీపురం

భూమి విలువ పెరుగుతున్న కొద్దీ సమస్యలు పెరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సమస్యలు పెరుగుతున్న కొద్దీ రెవెన్యూ అధికారుల ప్రాధాన్యత పెరుగుతోంది. దీంతో, భూ సమస్యలున్న రైతులు పరిష్కారం కోసం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వాలెన్ని మారినా భూ సమస్యలు పెరుగుతున్నాయిగానీ తగ్గడం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు, గ్రామ సదస్సులు గత ప్రభుత్వంలో నిర్వహించారు. ప్రస్తుత ప్రభుత్వమూ నిర్వహిస్తోంది. సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ నెలలు, ఏళ్ల తరబడి తిరుగుతున్నా అధికారులు పరిష్కరించనప్పుడు సదస్సుల్లో దరఖాస్తు అందజేస్తే ఏ మేరకు పరిష్కారం లభిస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం హయాంలోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. అప్పటి నుంచి పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలెన్నో ఇప్పటికీ సజీవంగా వున్నాయి. జిల్లాలో భూ సమస్యలున్న రైతులు వేల సంఖ్యలో ఉన్నారు. ఇటీవల టిడిపి కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల ప్రారంభానికి ముందు గ్రామసభలు నిర్వహించింది. ఈ గ్రామసభల్లో కూడా ఎక్కువగా భూమికి సంబంధించిన సమస్యలే అందాయి. ఆ తర్వాత మొదలైన రెవెన్యూ సదస్సుల్లో వేలాది సమస్యలు దరఖాస్తుల రూపంలో చేరాయి. గత ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి మన్యం జిల్లాలో నిర్వహించిన 713 రెవెన్యూ సదస్సుల్లో 4,660 దరఖాస్తులు అందినట్లు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ చెప్పారు. ఈ నెల 8 వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. భూసమస్యలను ఆదాయ వనరుగా మలచుకునే యత్నంలో కొందరు రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దశాబ్ద కాలంగా కుడుమూరు భూవివాదం

పాచిపెంట మండలం కుడుమూరులో భూవివాదం దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. సర్వే నెంబర్ 48లో ఉన్న 782 ఎకరాల భూమిని సుమారు 200 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. జమిందారీ వ్యవస్థలు, మొఖాసాలు అనేక దశాబ్దాల క్రితమే రద్దయ్యాయి. కుడుమూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 48లో ఉన్న భూములన్నీ ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో ఉన్నాయి. అయినా, ఆ భూములు మొఖాసాదారులకు చెందినవని కొంతమంది నాయకులు, రెవెన్యూ అధికారులు వారికి వత్తాసు పలుకుతూ సమస్యను పరిష్కరించడానికి ఇష్టపడడం లేదు. కొంతమంది రెవెన్యూ అధికారులు, గత పాలకపక్ష నాయకుల అవినీతి వల్లనే ఈ వివాదం ఇప్పటికీ అపరిష్కృతంగా మిగిలింది. ఏళ్ల తరబడి సాగులో ఉన్న గిరిజనులను పట్టాలివ్వకుండా రెవెన్యూ అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారు.

ఫలితంగా గిరిజనులు ప్రభుత్వ పరంగా ఎలాంటి రాయితీలూ పొందలేకపోతున్నారు. తమ సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని కోరుతూ 2016 నుంచి సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు పోరాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ భూములపై సర్వే నిర్వహించారు. ఏ రైతు సాగులో ఎంత భూమి ఉందనేది సర్వే చేశారు. కానీ, దాన్ని ఇంతవరకూ బయటపెట్టలేదు. గతంలో ఐటిడిఎ పిఒ కూర్మనాథ్ కుడుమూరు భూములు ప్రభుత్వ భూములని ప్రకటించారు. రెండు, మూడేళ్లసాగులో ఉన్న గిరిజన రైతులకు పట్టాలిస్తున్నారు. కానీ, దశాబ్దాల తరబడి సాగులో ఉన్న కుడుమూరు భూములకు పట్టాలివ్వడం లేదు. దీనికి ప్రధాన కారణం కొంతమంది బడాబాబులు ఈ భూములపై కన్నేయడమే. వారికి అండగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులు ఈ వివాదాన్ని పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. కుడుమూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో గిరిజన రైతులు సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోని భూ వివాదాన్ని అధికారులు ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

భూ సమస్యను విన్నవిస్తే..కోర్టుకెళ్లాలన్న విఆర్ఒ

బలిజిపేట రూరల్ : ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తన భూ సమస్యను పరిష్కరించాలని కోరిన రైతుకు ఆ గ్రామ రెవెన్యూ అధికారి కోర్టుకు వెళ్లి తేలుకోమని ఉచిత సలహా ఇచ్చారు. మండలంలోని వంతరాంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఇదే గ్రామానికి చెందిన రైతు నాగల లక్ష్మ సమస్య పరిష్కారం కోసం సదస్సుకు వెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వేలో భాగంగా సర్వే నెంబర్ 71/6, 016 సెంట్లు తన తల్లి నాగళ్ల సూరమ్మ పేరున ఉన్న జిరాయితీ భూమిని వేరే వ్యక్తి పేరు మీద ఆ గ్రామ విఆర్ఒ ఆబోతులు గోపాలకృష్ణ మార్చేశారు. దీన్ని సరిచేసి తన పేరు నమోదు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా విఆర్ఒ పట్టించుకోలేదు. ఆఖరుకు శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయగా, కోర్టుకెళ్లి తేల్చుకోవాలని దురుసుగా విఆర్ఒ సమాధానమిచ్చారని, తనకు దిక్కున్న దగ్గర చెప్పుకోమని దుర్భషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తన సమస్య పరిష్కరించాలని ఆయన కోరుతున్నాడు.

తాతముత్తాల నుంచి సాగులో ఉన్నాం

కుడుమూరు రెవెన్యూ పరిధిలోగల ప్రభుత్వ భూమిని తాతముత్తాల నుంచి సాగు చేస్తున్నాం. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఎ పట్టాలివ్వకపోవడంతో ప్రభుత్వపరంగా ఎలాంటి రాయితీలూ అందడం లేదు. భూమిపై రుణాలు మంజూరు కావడం లేదు..రైతు భరోసా రావడం లేదు. పంట నష్టపరిహారం కూడా అందని పరిస్థితి. పట్టాలు ఇవ్వాలని అనేకసార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేదు. ఇప్పుడైనా సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నాను.

సూకురు ఎర్రయ్య, గిరిజన రైతు,
తోకమెట్ట గ్రామం,పాచి పెంట మండలం

మెడికల్ మాఫియా

- మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ముందుకు
- కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వని పరిస్థితి
- మందుల నాణ్యతపై అనేక అనుమానాలు
- డాక్టర్ చీటీలేకుండానే పెద్ద ఎత్తున విక్రయాలు
- నిత్యం రూ.కోట్లలో వ్యాపారం సాగే చోట పర్యవేక్షణ కరువు
- అధికారుల, ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మనుషుల ప్రాణాలకు విలువలేకుండా పోయింది. ప్రజలకు అత్యంత ముఖ్యమైన మందులు (ఔషధాలు) విక్రయించే షాపులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. దీంతో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అత్యధిక మందుల షాపులు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు వేల మెడికల్ స్టోర్‌లు ఉన్నాయి. వీటిలో ప్రతిరోజూ రూ.కోట్లలో మందుల వ్యాపారం జరుగుతోంది. ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. జంక్‌ఫుడ్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. తాగునీరు కలుషితంగా మారింది. దీంతో జనాలను రోగాలు పట్టిపీడిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలతోపాటు, షుగర్, బిపి, కిడ్నీ, కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాలు సైతం రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 2024 నవంబర్ నుంచి రెండు జిల్లాల్లో ఆరోగ్యశాఖ చేస్తున్న స్క్రీనింగ్ పరీక్షల ఫలితాలను చూస్తే రోగాల తీవ్ర ఏవిధంగా ఉందో ఇట్టే అర్ధమవుతుంది. ప్రతి వంద మందిలో ఒకరు కేన్సర్ అనుమానితులుగా తేలుతున్నారు. రెండు లక్షల 24 వేల మందిని స్క్రీనింగ్ చేస్తే దాదాపు 50 వేల బిపి, షుగర్ కేసులు బయటపడుతున్నాయి. పసిపిల్లలు సైతం అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. 40 ఏళ్లు దాటిన వారు ప్రతి రోజూ టాబ్లెట్లు మింగకపోతే ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. మందులు కొనుగోలు చేసే మెడికల్ స్టోర్స్‌లో సరైన నిబంధనలు పాటించకపోయినా అడిగే నాథుడే లేకుండా పోయాడు. పట్టణాలు, పల్లెలు అనితేడా లేకుండా అత్యధిక మెడికల్ స్టోర్లలో కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు.

ఒకవేళ ఎవరైనా అడిగితే చిన్న కాగితపు ముక్కపై కేవలం ఎంతయ్యిందో రాసి మాత్రం ఇస్తున్నారు. గట్టిగా మాట్లాడితే బిల్లు ఇస్తే ఎక్కువ ఖర్చు అవుతుందని చెబుతున్న మెడికల్ స్టోర్‌ల యాజమానులు ఉన్నారు. జిల్లా కేంద్రం ఏలూరులో డ్రంగ్ కంట్రోల్ కార్యాలయం ఉంది. ఏలూరు పట్టణంలో అతిపెద్ద మెడికల్ షాపుల్లో కూడా ఎక్కడా కొనుగోలు చేసిన మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపన పోవడం లేదు. చాలా దుకాణాల్లో ఫార్మాసిస్టులు లేకుండా నడుస్తున్నాయంటూ చర్చ కొనసాగుతోంది.

డాక్టర్ చీటీ లేకుండానే మందుల విక్రయాలు..

నిబంధనల ప్రకారం డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వకూడదు. చాలా మెడికల్ స్టోర్స్‌లో డాక్టర్ చీటీతో సంబంధం లేకుండా మందుల విక్రయం ఎక్కువగా సాగుతోంది. జ్వరాలకు, కీళ్ల నొప్పుల సంబంధించిన మందులు, యాంటీ బయోటిక్స్ సైతం డాక్టర్ చీటీలేకుండా ఇచ్చేస్తున్నారు. రూపాయి ఖరీదు చేసే మందు బిళ్లకు రూ. ఐదు అంతకంటే ఎక్కువగానే వసూలు చేస్తున్నారు. పది టాబెట్ల మందుల షీట్ మొత్తం తీసుకుంటే ధర కొంతమేర తెలిసే అవకాశం ఉంటుంది. రెండు, మూడు టాబెట్లు ఇచ్చినప్పుడు ధర గురించే తెలిసే అవకాశమే లేకుండా పోతుంది. దీంతో మెడికల్ స్టోర్స్‌లో దోపిడీకి అంతులేకుండా పోతోంది. చాలా ఆసుపత్రుల్లో అనుబంధంగా మెడికల్ స్టోర్‌లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆ డాక్టర్ రాసిన మందులు అక్కడే కొనుగోలు చేయాలి. ఎక్కడా కొనుగోలు చేయకూడదు. వారు ఎంత ధర నిర్ణయిస్తే ఆ ధరకే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. దీనిపై మాట్లాడిన వారే లేకుండా పోయారు. ఆసుపత్రులకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న మందుల దుకాణాలకు అసలు అనుమతులు ఉంటున్నాయో లేవో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. చాలా దుకాణాలు వేరే ఫార్మాసిస్టుల సర్టిఫికెట్లతో నడిచిపోతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు ఫార్మా కంపెనీలతో కుమ్మక్కై నాణ్యతలేని మందులు సైతం విక్రయిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు చేస్తున్నారా, చేస్తే ఎటువంటి కేసులు నమోదు చేశారు, చర్యలు ఏమైనా తీసుకున్నారా అనేది ఏఒక్కరికీ తెలియని పరిస్థితి నెలకొంది. డ్రగ్స్ అధికారులు సైతం పజలకు అవగాహన కల్పించే విధంగా ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు సైతం డ్రగ్స్ కంట్రోల్ శాఖకు సంబంధించి సమీక్షా సమావేశాలు జరిపిన దాఖలాలు కనిపించడం లేదు. సిబ్బంది తక్కువగా ఉన్నారన్న నెపంతో పూర్తిగా గాలికొదిలేసిన పరిస్థితి నెలకొంది. మనుషుల ప్రాణాలకు సంబంధించి మందులు విక్రయించే మెడికల్ షాపులపై నిఘా పెంచాలని, నిరంతరం దాడులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

మన్యంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-అరకులోయ

పర్యాటక కేంద్రమైన అరకు లోయలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. మునుపెన్నడు లేని విధంగా గత నెల రోజులుగా పర్యాటకులు వేల సంఖ్యలో తరలి వస్తున్నారు. జనవరి మొదటి వారం నుంచి పర్యాటకుల సంఖ్య క్రమంగా తగ్గుతుందని అందరు భావించినప్పటికీ, ఇప్పటికి పర్యటకుల సంఖ్య ఏమాత్రం కూడా తగ్గుముఖం పట్టలేదు. ఆదివారం కూడా పర్యాటకులు తరలివచ్చారు.దీంతో అరకు ప్రాంతంలోని పర్యాటక సందర్శిత ప్రాంతాలు కిటకిటలడాయి. మరమ్మత్తుల దృష్ట్యా పద్మావతి ఉద్యాన కేంద్రం ఈనెల మూడు నుంచి 11 వరకు మూసి వేస్తున్నట్లు పాడేరు ఐటీడీఏ పీవో ప్రకటించినప్పటికీ, వందల సంఖ్యలో ప్రతిరోజు తరలివచ్చి నిరాశతో వెను తిరుగుతున్నారు. దీంతో అరకులో గిరిజన సంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియం చాక్లెట్ ఫ్యాక్టరీ కిటకిటలాడుతున్నాయి. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి రావడంతో గత నెల రోజుల నుంచి అరకు విశాఖ ఘాట్రోడ్లో నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. పెరుగుతున్న పర్యాటకులతో ఏర్పడుతున్న ట్రాఫిక్ జామ్ దృష్ట్యా స్థానిక పోలీసులకు సవాలుగా మారింది. సిఐ, ఎస్సైల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పర్యాటకులు, ప్రయాణికులు కొంత ఊపిరి పీల్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరగడం, ట్రాఫిక్ జాం ఘాట్రోడ్లో ఏర్పడుతున్న దృష్ట్యా ఇప్పటికే కాఫీ తోటలోని ఉడెన్ బ్రిడ్జి మూసివేసిన విషయం తెలిసిందే. సంక్రాంతి సెలవులు సమీపిస్తుండటంతో ఇంకా పర్యటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.

కరువును చూసేందుకు ఇప్పుడా..!

- 8న కేంద్ర కరువు బృందం పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'దొంగలు పడ్డ ఆరు మాసాలకు...' అన్న నానుడికి కేంద్రకరువు బృంద పర్యటన సరిగ్గా సరిపోతోంది. రబీ సీజన్ కూడా ముగుస్తున్న సమయంలో కేంద్ర కరువు బృందం జిల్లా పర్యటనకు రానుంది. ఈనెల ఎనిమిదవ తేదీన అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైనట్టు సమాచారం. 2024 ఖరీఫ్‌లో నెలకొన్న కరువును ఈ బృందం పరిశీలించనుంది. అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలోని పొలాల్లో పర్యటించి పంట పరిశీలన చేయనుంది.

అనంతపురం జిల్లాలో కరువు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం 2024 అక్టోబరులో ప్రకటించింది. ఇందులో రెండు మండలాల్లో తీవ్రమైన కరువు నెలకొందని ప్రకటించింది. నార్పల, అనంతపురం రెండు మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రకటించింది. బుక్కరాయ సముద్రం, గార్లదిన్నె, రాప్తాడు, విడపనకల్లు, యాడికి ఈ ఐదు మండలాల్లో మధ్యస్థంగా కరువు ఉన్నట్టు నిర్ధారించింది. ఇందులో మొత్తం 12856 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. దీనికి రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని ప్రతిపాదించారు. ఇందులో అత్యధిక నష్టం వేరుశనగ పంటనే ఉంది. వేరుశనగ పంట నష్టానికి సంబంధించి 7796 హెక్టార్లకుగానూ రూ.13.25 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. పత్తి పంట 2849 హెక్టార్లకు రూ.4.84 కోట్లు, ఆముదం 1500 హెక్టార్లకు రూ.1.27 కోట్లు, 361 హెక్టార్లలో జొన్న నష్టానికి రూ.30 లక్షలు, 20 ఎకరాల్లో పెసరకు రూ. 2 లక్షలు, 327 ఎకరాల్లో కొర్ర పంటకు రూ.27 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు.

కరువు మండలాల
పున: సమీక్ష నిర్ణయం ఏమైందో ?

కరువు మండలాల ప్రకటనలో హేతుబద్ధలేదని, పున:సమీక్షించాలని నవంబరులో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించారు. అధికారపార్టీకి చెందిన నేతలే దీన్ని ముందుకు తీసుకొచ్చారు. అయితే తరువాత దీనిపై అధికారులు ఏ రకమైన చర్యలు తీసుకున్నారన్నది తెలియలేదు. కీలకమైన ఆగస్టులో వర్షాభావంతో పంటలు బాగా దెబ్బతిన్నాయని, అన్ని మండలాలను కరువు మండలాలు ప్రకటించాలని విపక్షాలు కూడా డిమాండ్ చేశాయి.

పర్యటన సాగునుంది ఇలా...

కేంద్ర కరువు బృందం ఈనెల ఎనిమిదవ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పర్యటన ముగించుకుని అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామానికి వస్తుంది. అక్కడ ఆముదం పంటను అధికారులు పరిశీలిస్తారు. అనంతరం 2.30 గంటల నుంచి బయలుదేరి రాప్తాడు మండలంలోని రాప్తాడు గ్రామం చేరుకుంటారు. అక్కడ నుంచి ఐదు గంటలకు పంట పరిశీలన అనంతరం బెంగళూరుకు వెళతారు.

రంకెలేసిన కోడి గిత్తలు

- ఉత్సాహంతో ఉరకలేసిన యువకులు
- పాత వేపకుప్పంలో వైభవంగా పరుష పందేలు

ప్రజాశక్తి -రామచంద్రపురం

చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం పాత వేపకుప్పంలో కోడి గిత్తలు రంకెలేశాయి..యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. రామచంద్రపురం మండలం, పాత వేప కుప్పం గ్రామంలో సంక్రాంతికి ఎనిమిది రోజులు ముందే పరుష పందేలు ప్రారంభమయ్యాయి. కోడెగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, నగదును పారితోషికంగా కట్టి 'నా కోడి గిత్తల పౌరషం చూడండి...' అంటూ వాటి యజమానులు బరిలోకి దించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు కట్టిన నగదును చేజికిచ్చేందుకు పోటీపడ్డారు. పశువులను పట్టుకునే క్రమంలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందేలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో కొత్త శానంబట్ల గ్రామం జనసంద్రమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జట్లుగా ఏర్పడి కోడె గిత్తలకు కట్టిన పలకలను చేజిక్కించుకున్న ఆనందంతో ఎగిరి గంతులు వేశారు. ఈ పందేల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంటికి ఈ తాళం

- ఎల్‌హెచ్ఎంఎస్‌తో దొంగతనాలకు చెక్
- పట్టణ ప్రజలకు రక్షణ కవచంలా మొబైల్ యాప్

ప్రజాశక్తి- విజయనగరం కోట

పండగ వేళల్లో చాలామంది సొంతూళ్లకు, ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఇదే అదునుగా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. వీటిని అరికట్టేందుకు ఎల్‌హెచ్ఎంఎస్ (లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్) యాప్‌ను పోలీసులు అందుబాటులోకి తెచ్చారు. దీనిద్వారా ఇళ్లకు రక్షణ కల్పించుకోవచ్చు. ప్రస్తుతం సంక్రాంతి నేపథ్యంలో విజయనగరం నగరంతోపాటు బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల నగర పంచాయతీ ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవచ్చు.

పనిచేసేది ఎలా అంటే..

ఈ సౌకర్యాన్ని పొందాలంటే ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. పోలీసులు ఓ ఐడి కేటాయిస్తారు. సంబంధిత వివరాలతో ఇతర ప్రాంతానికి వెళ్తున్నట్లు పోలీసులకు పూర్తి స్థాయిలో సమాచారం ఇవ్వాలి. ఏయే రోజుల్లో రక్షణ కావాలో తెలియజేయాలి. తద్వారా వారు స్పందించి వైర్‌లెస్ కెమెరా (సిసి కెమెరా) వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఓ యుపిఎస్‌తోపాటు డేటా కార్డును దానికి అనుసంధానిస్తారు. ఈ క్రమంలో ఇంట్లోకి ఎవరైనా వస్తే ఆ కదలికల ఆధారంగా వెంటనే ఇంటి యజమానితోపాటు స్టేషన్‌కు సమాచారం వెళ్తుంది. దీంతో ఆ ఇంటికి భద్రత లభిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎల్‌హెచ్ఎంఎస్ సేవలను ఉచితంగా పొందవచ్చు. అయితే, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇంట్లో వెలుతురు ఉండేటట్లు ఏదో ఒక చోట బల్బు వేసి ఉంచాలి. యుపిఎస్ విద్యుత్తు లేకుండా కొన్ని గంటల వరకు మాత్రమే పనిచేస్తుంది. ఎక్కువ రోజులు ఇళ్లకు తాళం వేసి వెళ్లేవారు ఈ విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో హెచ్చరిక వస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

పట్టణ ప్రజలు వినియోగించుకోవాలి

జిల్లాలోని విజయనగరం 1వ పట్టణ, 2వ పట్టణ, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్తే, వారి ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఎల్‌హెచ్ఎంఎస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పట్టణ ప్రజల ఆస్తులకు ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ రక్షణ కవచంలా నిలుస్తుంది. దీనిపై ప్రజల్లో అవగాహన పెరగాలి.

- వకుల్ జిందాల్, ఎస్‌పి

గుజరాత్‌లో కూలిన కోస్ట్ గార్డ్ హెలికాప్టర్

- ముగ్గురు మృతి

పోరుబందర్ : కోస్ట్‌గార్డ్‌కు చెందిన హెలికాప్టర్ ఒకటి గుజరాత్‌లో ఆదివారం కుప్పకూలింది. ఈ ఘటలో ముగ్గురు సిబ్బంది మరణించారు. ధృవ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ ఎంకె -3 ఆదివారం మధ్యాహ్నం 12:15 గంటలకు పోర్‌బందర్ విమానాశ్రయం రన్‌వే వద్ద ప్రమాదానికి గురైందని కోస్ట్‌గార్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు, ఒక ఎయిర్ క్రూ డ్రైవర్ మరణించినట్లు తెలిపింది. దీనిపై కోస్టు గార్డు ఇప్పటికే దర్యాప్తు చేపట్టింది. మృతుల్ని కమాండెంట్ (జూనియర్ గ్రేడ్) సౌరభ్, డిప్యూటీ కమాండెంట్ ఎస్‌కె యాదవ్, మనోజ్ ప్రధాన్ నవిక్‌గా గుర్తించారు.

అణుబాంబు దాడి ఆనాటి మృత్యుంజయుడి కన్నుమూత

నాగసాకి : రెండో ప్రపంచయుద్ధ సమయం 1945లో జపాన్ నగరమైన నాగసాకిపై జరిగిన అణు బాంబు దాడి నుండి బతికి బయటపడిన షిగెమె ఫకహోరి 93ఏళ్ళ వయస్సులో కన్ను మూశారు. తన జీవితాంతం అణ్వాయుధాలకు వ్యతిరేకంగా శాంతి కోసం ఆయన కృషి చేశారు. వాయవ్య జపాన్‌లోని నాగసాకిలో ఆస్పత్రిలో ఈ నెల 3న ఆయన మరణించారు. వృద్ధాప్య కారణంగానే ఆయన చనిపోయారని ఉరకెమి కేథలిక్ చర్చి వర్గాలు ఆదివారం తెలిపాయి. సోమవారం ఆయన అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయనకు ఒక కుమార్తె వున్నారు. ఈ చర్చిలో గతేడాదివరకు దాదాపు ప్రతి రోజూ ఆయన ప్రార్ధనలు చేసేవారు. నాగసాకి శాంతి పార్క్‌కు సమీపంలోని ఈ చర్చిని శాంతి, ఆశలకు చిహ్నంగా చూసేవారు. ఈ చర్చి బెల్ టవర్, కొన్ని విగ్రహాలు ఆనాటి బాంబు దాడి నుండి బయటపడ్డాయి. 1945 ఆగస్టు 9న అణు దాడి జరిగినపుడు ఫకహోరి వయస్సు కేవలం 14ఏళ్ళు. ఈ దాడిలో ఆయన కుటుంబం మొత్తం చనిపోయింది. అణు బాంబు పడిన ప్రాంతానికి కేవలం 3కిలోమీటర్ల దూరంలోని షిప్‌యార్డ్‌లో పనిచేసిన ఆయన ఏళ్ళ తరబడి మౌనాన్ని ఆశ్రయించారు. తన బాధాకరమైన జ్ఞాపకాలను కూడా పంచుకోవడానికి ఇష్టపడేవారు కాదు. 15ఏళ్ళ క్రితం నుండే ఆయన బాహాటంగా మాట్లాడడం ఆరంభించారు. స్పెయిన్ అంతర్యుద్ధంలో బాంబు దాడి నుండి14ఏళ్ళ వయస్సులో బయటపడిన గుర్నికా అనే వ్యక్తి తను అనుభవాలను పంచుకుంటూ మాట్లాడుతుండడంతో ఫకహోరి కూడా మాట్లాడడం మొదలుపెట్టారు. తన భయంకరమైన జ్ఞాపకాలను ఆవేదనతో పంచుకునేవారు. ఆయన ఎక్కువగా విద్యార్ధులతో మాట్లాడేందుకు ఇష్టపడేవారు. రేపటి శాంతి దూతలు వారేనని ఆయన అభిప్రాయపడేవారు.

ఇజ్రాయిల్‌కు 800 కోట్ల డాలర్ల విలువైన ఆయుధాలు

వాషింగ్టన్ : గాజా, లెబనాన్, సిరియా, యెమెన్ ఇలా పలుదేశాలపై వరుస దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు 800కోట్ల డాలర్ల విలువ చేసే ఆయుధాలను విక్రయించాలని అమెరికా భావిస్తోంది. ఈమేరకు బైడెన్ ప్రభుత్వం అమెరికన్ కాంగ్రెస్‌కు లాంఛనంగా తెలియచేసింది. యుద్ధ విమానాలు, దాడి చేసే హెలికాప్టర్లను ఎదుర్కొనే ఆయుధాలు, శతఘ్నులు, గాల్లో నుండి గాల్లోకి ప్రయోగించే క్షిపణులు, డ్రోన్‌లు సహా ఇందులో పలు రకాల ఆయుధాలు వున్నాయి. ఈ ఆయుధ ఒప్పందానికి ప్రతినిధుల సభ, సెనెట్ కమిటీ నుండి ఆమోద ముద్ర పొందాల్సిన అవసరం వుంది. తన ప్రజలను రక్షించుకునేందుకు దాడులు చేసే హక్కు ఇజ్రాయిల్‌కు వుందంటూ ఇప్పటికే బైడెన్ ప్రభుత్వం ప్రకటించింది.

గాజాలో 56మంది మృతి

గత 48గంటల్లో గాజాలో 56మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో పిల్లలు కూడా వున్నారని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. మరోవైపు కాల్పుల విరమణ చర్చలు తిరిగి ప్రారంభం కానున్నాయి. సెంట్రల్ గాజాలోని నుస్రత్, మఘజి, డేర్ అల్ సాలాహ్, జైవాదా ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో డజను మందికి పైగా మహిళలు, పిల్లలు మరణించారని అల్ అక్సా ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. తాజా దాడుల గురించి ఇజ్రాయిల్ ఆర్మీ వ్యాఖ్యానించలేదు. హమాస్ సమావేశ కేంద్రాలుఉ, కమాండ్, కంట్రోల్ కేంద్రాలు సహా పలు లక్ష్యాలపై వరుస దాడులకు దిగినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఆక్రమణలో వక్ఫ్ ఆస్తులు

- ప్రభుత్వ సమాచారంపై మీడియా వక్రభాష్యం
- హక్కుదారులనే ఆక్రమణదారులుగా చిత్రించే ప్రయత్నం

ఉత్తరప్రదేశ్‌లోని వక్ఫ్ కేంద్రం దుస్థితి

న్యూఢిల్లీ : దేశంలోని 994 వక్ఫ్ ఆస్తులు ఇతరుల అధీనంలో ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. గత నెల 9న రాజ్యసభలో సీపీఐ (ఎం) సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిరిజు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ సమాచారం బయటకు రాగానే అన్ని హిందీ మీడియా ఛానల్స్, వెబ్‌సైట్లు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వార్తలు అందించాయి. అవేమి చెప్పాయంటే 'దేశంలోని 994 ఆస్తులను వక్ఫ్ చట్టవిరుద్ధంగా ఆక్రమించుకుంది'. అంతేకాదు...ల్యాండ్ జిహాద్‌లో వక్ఫ్ బోర్డ్ భాగస్వామి అయిందని కూడా కథనాలను వండి వార్చాయి. 'ఇతరుల అధీనంలోని వక్ఫ్ ఆస్తులు' అంటే వక్ఫ్ భూమి లేదా ఆస్తి చట్టవిరుద్ధంగా ఇతరులకు బదిలీ చేయడం. లేదా ఇతరులు దానిని ఆక్రమించుకోవడం.

దీని అర్ధం ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రధాన స్రవంతి మీడియా దానికి పెడార్థాలు తీసింది. ఆ భూములు లేదా ఆస్తుల హక్కుదారులను ఆక్రమణదారులుగా చిత్రీకరించింది. లోక్‌సభలో బీజేపీ సభ్యుడు బసవరాజ్ బొమ్మై అడిగిన ప్రశ్నకు నవంబర్ 27న రిరిజు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ దేశంలోని 58,929 వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలో ఉన్నాయని తెలిపారు. వక్ఫ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఆఫ్ ఇండియా (వంశీ) పోర్టల్ నుండి తీసుకున్న సమాచారం ఆధారంగా మంత్రి ఈ గణాంకాలను అందించారు. వక్ఫ్ చట్టం కింద దేశంలోని 3,56,072 వక్ఫ్ ఎస్టేట్స్‌లో 8,72,379 స్థిర, 16,713 చర ఆస్తులు రిజిస్టరయ్యాయని వంశీ పోర్టల్ వివరించింది. దీనిని బట్టి ఈ 8,72,379 ఆస్తుల్లో 4,35,793 ఆస్తులకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేదని తేటతెల్లమవుతోంది. ప్రభుత్వం చెబుతున్న దాని కంటే ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయని అర్థమవుతోంది. వంశీ వెబ్‌సైట్ చెబుతున్న దాని ప్రకారం కేవలం 95,277 స్థిరాస్థులను మాత్రమే వక్ఫ్ బోర్డ్ నిర్వహిస్తోంది. 4,13,766 వక్ఫ్ ఆస్తుల నిర్వహణ ఎవరి అధీనంలో ఉన్నదో తెలియడం లేదు. కాగా వక్ఫ్ రికార్డుల డిజిటలీకరణ ప్రక్రియ 2025-26 వరకూ కొనసాగే అవకాశం ఉంది. అయితే ఈ విషయంలో ప్రభుత్వం ఎన్నడూ పారదర్శకంగా వ్యవహరించలేదు.

ప్రజల కోసం పని చేయడమే మాకు తెలిసిన రాజకీయం

- ప్రధాని మోడీకి అరవింద్ కేజ్రీవాల్ కౌంటర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల కోసం పని చేయడమే తమకు తెలిసిన రాజకీయమని ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆర్‌ఆర్‌టిఎస్ కారిడార్ ప్రారంభం సందర్భంగా ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలకు అరవింద్ కేజ్రీవాల్ కౌంటర్ ఇచ్చారు. ప్రధాని మోడీకి ఎప్పుడూ ఆప్ సర్కార్‌ను తిట్టడమే పని అని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని తిడుతున్నారంటే, ఢిల్లీ ప్రజలను తిట్టడమేనని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, తామెప్పుడూ ఆర్‌ఆర్‌టిఎస్ కారిడార్‌ను వ్యతిరేకించలేదని అన్నారు. ఢిల్లీ ప్రజల కోసం ఏ మంచి పని అయినా స్వాగతిస్తామని, ప్రధాని మోడీ ప్రారంభించిన ఆర్‌ఆర్‌టిఎస్ కారిడార్ ప్రాజెక్టులో తమ సహకారం కూడా ఉందని తెలిపారు. అటు కేంద్రం, ఇటు తమ ప్రభుత్వం సహకారం వల్లనే ఆ ప్రాజెక్టును ప్రారంభించగలిగారని స్పష్టం చేశారు. తాము ప్రజలకు కోసం పని చేస్తున్నామనేది ఆ ప్రాజెక్టే ఉదాహరణ అని అన్నారు. కానీ మీరు తమ నాయకులను వేధింపులకు గురి చేస్తున్నా మీరు చేపట్టే ఏ ప్రాజెక్టుకు అడ్డు చెప్పలేదని అన్నారు. తాము దేన్నీ సమస్యగా మార్చలేదని, ప్రజల కోసం పని చేయడమే తమకు తెలిసిన రాజకీయమని కేజ్రీవాల్ అన్నారు. ప్రధాని మోడీ చేసిన 38 నిమిషాల ప్రసంగంలో 29 నిమిషాలు ఢిల్లీ ప్రజలు ఎన్నుకున్న తమ ప్రభుత్వాన్ని తిట్టారని అన్నారు.

అంగన్‌వాడీలకు అందని వేతనాలు

- కొత్త పీడీకి డిజిటల్ సిగ్నేచర్ ఆథరైజ్డ్ ఇవ్వని అధికారులు

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోని 26 జిల్లాలకుగాను 25 జిల్లాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు అందినప్పటికీ ఒక్క విజయనగరంలో మాత్రం అందలేదు. ఉన్నతాధికారుల నిర్వాకం, మంత్రుల ఉదాసీనత ఇందుకు కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయనగరం జిల్లా గజపతినగరం మండలం రామన్నపేటలోని అంగన్‌వాడీ హెల్పర్ మానాపురం సౌజన్యను ఇటీవల రాజకీయ కారణాలతో తొలగించడంపై ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్‌వాడీలు పది రోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు చేపట్టిన న్యాయపోరాటంలోనూ బాధితురాలికి అనుగుణంగా స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో పీడీ అసమర్థత వల్లే అంగన్‌వాడీలు రోడ్లపైకి వచ్చారని భావించిన ఐసిడిఎస్ అధికారులు ఆమెను సరెండర్ చేశారు. దీంతో, పీడీ శాంతకుమారి గత నెల 20వ తేదీ నుంచి సెలవుపై వెళ్లారు. ఈ స్థానంలో ఎస్‌సి కార్పొరేషన్ ఇడి శారదాదేవికి పూర్తి అదనపు బాధ్యత (ఎఫ్‌ఎసి) అప్పగించారు. అయినా, అమెకు చెక్ పవర్ ఇవ్వలేదు. ప్రతి నెలా 25 నుంచి 26వ తేదీలోగా అంగన్‌వాడీల వేతన బిల్లులను అధికారులు పెడుతున్నారు. 2 లేదా 3వ తేదీలోపు వేతనాలు అందుతున్నాయి. విజయనగరం జిల్లాలోని అంగన్‌వాడీలకు, మినీ అంగన్‌వాడీలకు, ఆయాలకు 5వ తేదీ వరకు వేతనాలు అందలేదు. దీంతో, సుమారు ఐదు వేల మంది ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లారు. మరో వారం రోజుల్లో సంక్రాంతి పండగ ఉంది. ఈలోపే పండగకు అవసరమయ్యే సరుకులు, దుస్తులు కొనుక్కోవాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వేతనాలు అందకపోవడం ఎంతవరకు సమంజసమని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించేలా జిల్లాకు చెందిన మంత్రి, పొరుగు జిల్లాలోనే ఉంటున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరుతున్నారు.

యూన్ అరెస్టు కోసం దక్షిణ కొరియాలో భారీ ర్యాలీ

- గడ్డ కట్టించే చలిగాలులు, మంచును లెక్క చేయక హాజరైన జనం

యూన్‌ను అరెస్టు చేయాలని కోరుతూ సియోల్‌లో ప్రధాన రహదారిపై ఆందోళన చేస్తున్న ప్రజలు

సియోల్ : దేశంలో మార్షల్ లా విధించడంపై అభిశంసనకు గురైన దక్షిణకొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌ను పదవీచ్యుతుడిని చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వందలాదిమంది ఆందోళనకారులు యోల్ నివాసానికి సమీపంలో ప్రదర్శన నిర్వహించారు. గట్ట కట్టించే చలిగాలులు, మంచును కూడా లెక్కచేయకుండా వారు రాత్రంతా ర్యాలీలో పాల్గొన్నారు. యూన్‌ను నిర్బంధంలోకి తీసుకునే వారంటును అమలు చేసేందుకు అవినీతి నిరోధక శాఖ అధికారులుల, పోలీసులు ప్రయత్నించారు కాన అధ్యక్ష భవన భద్రతా సిబ్బంది తీవ్రంగా అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఐదు గంటలకు పైగా ఈ ఉద్రిక్త పరిస్థితులు సాగాయి. వారం రోజుల పాటు అమల్లో వుంటే వారంటు ఉత్వర్వులు సోమవారం వరకే చెల్లుబాటు అవుతాయి. అయితే తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆదివారం కూడా మళ్ళీ అధ్యక్ష నివాసం వద్దకు అవినీతి నిరోధక శాఖ అధికారులు వెళతారా లేదా అనేది తెలియరాలేదు. ఈలోగానే అధ్యక్ష భవనం గేటుకు సమీపంలో ముళ్ళ కంచెను అధ్యక్ష భవన భద్రతా సిబ్బంది ఏర్పాటు చేశారు. మరోసారి అరెస్టు చేసేందుకు వచ్చే వారిని అడ్డుకోవడమే వారి లక్ష్యంగా కనిపిస్తోంది.

యూన్‌ను అదుపులోకి తీసుకోవాలంటూ గత మంగళవారం సియోల్ కోర్టు వారంట్లు జారీ చేసింది. ఆయన నివాసాన్ని సోదా చేసేందుకు విడిగా మరో వారంటు కూడా జారీ చేశారు. తనను ప్రశ్నించడానికి, తన నివాసం, కార్యాలయాన్ని సోదా చేయడానికి నిరాకరించడం ద్వారా అధికారుల ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. యూన్ తన అధికార నివాసంలో వున్నంతవరకు ఈ ఆదేశాలను అమలు చేయడం చాలా సంక్లిష్టమే.

గత నెల 3న దేశంలో సైనిక పాలన విధించి, పార్లమెంట్ సమీపంలో బలగాలను మోహరించడంతో ఆయన తిరుగుబాటుకు పాల్పడ్డారనే అభియోగాలు మోపేందుకు అవినీతి నిరోధక శాఖ అధికారులు యోచిస్తున్నారు. కాగా గంటల వ్యవధిలోనే ఏకగ్రీవ ఓటుతో పార్లమెంట్ ఆ సైనిక పాలన ఆదేశాలను రద్దు చేసింది. యూన్‌ను నిర్బంధించడానికి అవినీతి నిరోధక శాఖ చేసిన ప్రయత్నాలు ఫలిస్తే, లాంఛనంగా అరెస్టు చేసేందుకు కోర్టును అనుమతి కోరే అవకాశం వుంది. లేని పక్షంలో 48గంటల తర్వాత యోన్ విడుదలవుతారు. అయితే యూన్‌కు అధ్యక్ష భవన భద్రతా సిబ్బంది రక్షణ కల్పించినంత కాలమూ ఆయనను నిర్బంధంలోకి తీసుకోవడం అసాధ్యమని అవినీతి నిరోధక శాఖ కార్యాలయ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. తమ అరెస్టు వారంట్లు అమలుకు సహకరించాల్సిందిగా భద్రతా సిబ్బందిని ఆదేశించాలని డిప్యూటీ ప్రధాని చోయి సంగ్ మాక్‌ను అవినీతి నిరోధక శాఖ కోరింది. దీనిపై చోయి బహిరంగంగా స్పందించాల్సి వుంది..

సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా పి.షణ్ముగం ఎన్నిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా పి.షణ్ముగం ఎన్నికయ్యారు. 80 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. అందులో 15 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికయింది. విల్లుపురంలో మూడు రోజుల పాటు జరిగిన సిపిఎం తమిళనాడు 24 రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాష్ కరత్, పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎంఎ బేబి, కె.రామకృష్ణన్ హాజరయ్యారు. సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణన్ రాజకీయ, నిర్మాణ నివేదికను మహాసభ ముందు ఉంచారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం రాష్ట్ర నూతన కమిటీని మహాసభ ఎన్నుకుంది. 80 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక అయింది. నూతన కార్యదర్శిగా పి.షణ్ముగం ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా యు.వాసుకీ, ఎన్.గుణశేఖరన్, కనగరాజన్, ఎ.రామలింగం, ఎస్.వెంకటేశన్, బాలభారతి, జి.సుకుమారన్, శామ్యంగల్ రాజు, ఎస్.కన్నన్, ఎన్.పాండీ, బి.రవీంద్రన్, ముత్తు కన్నన్ ఎన్నికయ్యారు. జాతీయ నేతలు మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. దేశంలోని వనరులను పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని విమర్శించారు. నిరుద్యోగ యువతను, సంక్షోభంలోని రైతులను, సమస్యలో ఉన్న కార్మికులను మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ఎంతసేపు అదానీ, అంబానీల చుట్టే ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. మోడీ హయంలో అవినీతి దేశ సరిహద్దులను దాటిపోయిందని పేర్కొన్నారు. అందుకు అదానీ ముడుపుల వ్యవహారాన్ని ఉదాహరించారు. సిపిఎస్ రద్దు తదితర అంశాలపై తీర్మానాలు చేశారు.

మంచు తుపానులో చిక్కుకున్న వాహనాలు

అమెరికాకు మంచు తుపాను ముప్పు

- అప్రమత్తమైన రాష్ట్రాలు
- ఈ దశాబ్దంలోనే అత్యంత తీవ్ర స్థాయిలో శీతల గాలులు, హిమపాతం

వాషింగ్టన్ : మంచు తుపాను ముప్పు ముంగిట అమెరికా వుంది. గత దశాబ్ద కాలంలోనే ఎన్నడూ లేని రీతిలో అత్యంత శీతల పవనాలతో, భారీగా హిమపాతం కురుస్తుందని వాతావరణ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అంతటా అప్రమత్తమైంది. పోలార్ వెర్టిక్స్ (ఆర్కిటిక్ చుట్టూ అతి శీతల గాలులు చుట్టుముట్టడం) కారణంగానే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. కనాస్ నుండి మేరీల్యాండ్, డెల్వార్, వర్జీనియా, మిస్సోరి వరకు మొత్తంగా 10 రాష్ట్రాలు ఈ మంచు తుపాను బారిట పడనున్నాయి. గడ్డ కట్టించే ఉష్ణోగ్రతలు, భారీ హిమపాతం వంటి పరిస్థితులకు సన్నద్ధం కావాల్సిందిగా ప్రజలను హెచ్చరించారు. మధ్య అమెరికాలో ఇప్పటికే మంచు తుపాను ఆరంభమైంది. కెంటకీ, మిస్సోరి, వర్జీనియా గవర్నర్లు అత్యవసర పరిస్థితులను ప్రకటించారు. రాబోయే కొద్ది రోజుల్లో ఈ మంచు తుపాను తూర్పు దిశగా కదలనుందని నేషనల్ వెదర్ సర్వీస్ (ఎన్‌డబ్ల్యుఎస్) తెలిపింది. దాదాపు 6కోట్ల మంది ప్రజలు ఈ ముప్పు ముంగిట వున్నారు. ఈ వాతావరణ విపరీత పరిస్థితుల కారణంగా 2011 తర్వాత అత్యంత శీతలమైన జనవరి మాసాన్ని ఈ ఏడాది ప్రజలు అనుభవించనున్నారు. చారిత్రక రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, ఈ పరిస్థితులు ఒక వారం రోజుల పాటు కొనసాగవచ్చని అక్యూవెదర్ వాతావరణ నిపుణులు డాన్ డెపాడ్విన్ పేర్కొన్నారు. ప్రయాణాల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఇప్పటికే కనాస్ సిటీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలను శనివారం నిలిపివేశారు. విపరీతంగా మంచు పేరుకుపోతుండడమే కారణమని అధికారులు తెలిపారు. ఆ తర్వాత కొద్ది గంటలకు మళ్లీ పునరుద్ధరించారు. న్యూయార్క్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో సరస్సులు మంచుతో గడ్డకట్టేశాయి. దాదాపు నాలుగు అడుగుల మేరా మంచు కురిసే అవకాశం వుందని హెచ్చరించారు. రాజధాని వాషింగ్టన్ కూడా మంచు దుప్పటి కప్పుకోనున్నది. 5 నుండి 10 అంగుళాల మేరా మంచు కురిసే అవకాశాలు వున్నాయి. ఈ పరిస్థితుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోయే ప్రమాదముందని, ఫలితంగా అంధకారంలో వుండాల్సిన పరిస్థితులు కూడా తలెత్తుతాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

హైందవ శంఖారావ సభకు హాజరైన పురంధేశ్వరి, అనగాని సత్యప్రసాద్ తదితరులు

గుడులు, భూములు అప్పగించండి

(మొదటిపేజీ తరువాయి)

చల్లా కొండయ్య ఇచ్చిన నివేదిక వల్లనే ఆలయాలపై ప్రభుత్వ జోక్యం వచ్చిందన్నారు. మాజీ సిఎస్ ఎల్‌వి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేవాలయాలు సంస్కార కేంద్రాలని అన్నారు. దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. ఈ సభలో చిన జీయర్‌స్వామి, గణపతి సచ్చిదానంద, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంఎల్‌ఏ ఆదినారాయణ రెడ్డి, మాజీ ఎంపి జివిఎల్ నరసింహ, మాజీ ఎంఎల్‌ఏ రామకృష్ణారెడ్డి , మాజీ ఎంఎల్‌సి పివిఎన్ మాధవ్ తదితకరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రియాంక గాంధీపై బిధూరి నోటి దురుసు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవర్తనపై లోక్‌సభా హక్కుల కమిటీకి కూడా నివేదించారు.

కాంగ్రెస్ నేత సుప్రియా శ్రినెట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రమేష్ బిధూరి వ్యాఖ్యలు సిగ్గుచేటని విమర్శించారు. మహిళా వ్యతిరేక మనస్తత్వాన్ని, ఆలోచనా ధోరణిని బిజెపి కలిగి వుందన్నారు. మహిళల పట్ల ఆయన ధోరణి ఎలా వుంటుందో ఈ మాటలతో తెలుస్తోందన్నారు. సభలో తన సహచర ఎంపి పట్లనే ఇంత అసభ్యకరమైన భాష ఉపయోగించే వ్యక్తి నుండి ఇంకా ఏం ఆశించగలమని ప్రశ్నించారు. బిజెపి నిజమైన వైఖరి ఇదేనని ఆమె విమర్శించారు. ఆప్ ఎంపి సంజయ్ సింంగ్ కూడా బిధూరి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇటువంటి బిజెపి నాయకత్వంలో ఢిల్లీ మహిళలు సురక్షితంగా వుండగలరా అని ప్రశ్నించారు. 'ఆయన బిజెపి అభ్యర్థి, ఆయన భాష ఎలా వుందో వినండి,, మహిళలకు ఆ పార్టీ ఇచ్చే గౌరవం ఇలానే వుంటుంది. ఇటువంటి నేతల చేతుల్లో ఢిల్లీ మహిళల గౌరవం భద్రంగా వుంటుంని విశ్వసించగలమా? అని సింగ్ ప్రశ్నించారు.

నిస్సిగ్గుగా సమర్ధన

ఇంతలా విమర్శలు, ఖండనలు వెల్లువెత్తుతున్నా బిధూరి తన వ్యాఖ్యలను సమర్ధించుకున్నారు. హిపోక్రసీతో వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్షంపై దాడి చేశారు. గతంలో నటి, రాజకీయవేత్త హేమమాలినిపై బీహార్ మాజీ సిఎం లాలూ ప్రసాద్ యాదవ్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తు చేస్తూ తన వ్యాఖ్యలను సమర్ధించుకున్నారు. ఆ తర్వాత ఈ వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నట్లు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణకు పోరు

(మొదటిపేజీ తరువాయి)

హయాంలో పాఠశాల విద్య వ్యవస్థ నాశమైందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి విద్యారంగంలో సమగ్ర మార్పులు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన సాగట్లేదన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఎంఎల్‌సి గోపిమూర్తి మాట్లాడుతూ హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. పోరాటాల ద్వారా ఇప్పటికే పలు సమస్యలను పరిష్కరించుకోగలిగామని వివరించారు. రాజోలు ఎంఎల్‌ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే చాలా బలమైన సంఘంగా యుటిఎఫ్ ఉందన్నారు. స్వర్ణోత్సవాలను జరుపుకుంటున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఆహ్వాన సంఘం చైర్మన్, ఎన్‌టిఆర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐవి.రావు మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి తరగతి గదిలోనే మేధోమథనం జరగాలన్నారు. ఆ గురుతర బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. మాజీ ఎంఎల్‌సి వి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ వ్యతిరేక విధానాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తోన్న, విద్యా రంగాన్ని కాపాడుతున్న ప్రజాస్వామ్య యుత సంఘం యుటిఎఫ్ అని కొనియాడారు. బదిలీల్లో కౌన్సిలింగ్ యుటిఎఫ్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. ఎస్‌టిఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సిఎన్.భారతి మాట్లాడుతూ ఎన్ఇపికి, సిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకట్, ఎపిటిఎఫ్ (1938) రాష్ట్ర అధ్యక్షులు జి.హృదయరాజు, ఎపి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మహాసభకు హాజరైన అతిథులు, ప్రజాప్రతినిధులు, యుటిఎఫ్ నాయకులు

పలు పుస్తకాల ఆవిష్కరణ

ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు రాసిన 'భారత రాజ్యాంగం సంక్షిప్తంగా' పుస్తకాన్ని ఎపిటిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిఎన్.భారతి, రాజ్యాంగ పీఠికను ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు, రాజ్యాంగం ముఖ్యాంశాల పుస్తకాన్ని తెలంగాణ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, 'ఫొటోల్లో అంబేద్కర్ జీవితం' పుస్తకాన్ని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. యుటిఎఫ్ కార్యకర్తలు విప్లవ గీతాలను ఆలపించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఎల్‌సి ఐవి పాడిన విప్లవ గీతాలు ఉత్తేజ పరిచాయి.

మీకోసం

బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే అందులో నాలుగు ఎండు మిరపకాయలు వేసి ఉంచాలి.

జీవన సౌరభం

మన లోపాలను మనం గ్రహించడం అన్నింటికన్నా గొప్ప చదువు.

JEEVANA జీవన the family

సమయ పాలన

'రోహిత్ త్వరగా లే.. బడికి వెళ్లే టైం అయింది' అని వంటింట్లో నుంచి అమ్మ పిలిచింది. 'అమ్మా.. అప్పుడే ఎందుకు నిద్ర లేపుతున్నావ్? బస్సు ఇంకా రాలేదు కదా!' అని బెడ్రూంలో నుండి రోహిత్ ప్రశ్నించాడు. 'ఈరోజు మీరు పిక్నిక్ వెళున్నారు కదా? బస్సు త్వరగా వస్తుంది లే' అని అమ్మ అంటుంటే, 'అబ్బబ్బ 'ఇంకా టైం ఉంది కదమ్మా. తర్వాత నిద్ర లేస్తాను' అన్నాడు రోహిత్. 'సమయపాలన ఎప్పుడూ పాటించాలి రోహిత్. అది ఎంత ముఖ్యమైనదో నీకు ఒక కథ చెబుతాను. త్వరగా లే' అని అమ్మ అనగానే రోహిత్, చకచకా లేచి తయారయ్యాడు.

'అనగనగా ఒక పాఠశాలలో మీలాగే.. అక్కడి విద్యార్థులు వాళ్ళ స్నేహితులతో కలిసి పిక్నిక్ వెళ్లారు. అర్జున్ అనే ఒక విద్యార్థి చాలా బద్ధకస్తుడు. ఏ పనైనా వెంటనే పూర్తి చేసేవాడు కాదు. పాఠశాలకు ఆలస్యంగా వెళ్లేవాడు. ఉపాధ్యాయులు చెప్పిన పనిని కూడా ఆలస్యంగానే చేసేవాడు. పిక్నిక్ రోజు వాళ్లంతా ఓ కొండ ఎక్కుదామనుకున్నారు. 'అది ఎక్కితే సూర్యాస్తమయం చాలా దగ్గరగా చూసిన అనుభూతి కలుగుతుంద'ని టీచర్లు చెప్పారు. పిల్లలంతా పర్వతం పైకి ఎక్కాలనుకున్నారు. ఆలస్యం అయితే ఆ దృశ్యాన్ని చూసే అవకాశం ఉండదని ఎవరికి వారే త్వరగా ఎక్కారు. అర్జున్ మాత్రం ఎప్పటిలానే నిదానంగా ఎక్కాడు. కొద్దిసేపటికి పైకి చేరుకున్నాడు. అయితే అప్పటికే సూర్యుడు ఆకాశం మధ్యలోకి వచ్చేశాడు. అర్జున్‌ను చూసిన మిగతా విద్యార్థులు 'అరేయ్.. నీవు ఒక అందమైన దృశ్యాన్ని చూడలేకపోయావు. ఎంత బాగా ఉన్నాడో సూర్యుడు. చాలా దగ్గరగా చూసాము' అని సంతోషంగా చెప్పారు. 'అందరితోపాటు నేను కూడా త్వరగా ఎక్కితే సూర్యున్ని చూసేవాడిని' అని అర్జున్ మనసులోనే బాధపడ్డాడు. ఆరోజు నుంచి తను ఎప్పుడూ వెనుక పడలేదు. ఎప్పటి పనిని అప్పుడే పూర్తి చేసేవాడు' అని రోహిత్‌కి అమ్మ కథ చెప్పింది.

కథ పూర్తయ్యేసరికి బస్సు వచ్చింది. అమ్మకి బాయ్ చెప్పి రోహిత్ బయల్దేరాడు. వెళ్తూ వెళ్తూ 'అమ్మా, రేపటి నుంచి నేను కూడా త్వరగా నిద్ర లేస్తాను. నా పనులన్నీ సకాలంలో పూర్తిచేసుకుంటాను' అని చెబుతూ ఇంట్లో నుంచి బయటకు పరిగెత్తాడు రోహిత్.

– ఎం.డి.అఫీఫా,
10వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, కోదాడ,
సూర్యాపేట, తెలంగాణ.



తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ

ఎస్.దివ్య,
6వ తరగతి,
జెడ్‌పిహెచ్‌ఎస్, దూలిమిట్ట,
సిద్దిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

రూ.15 వేల కోసం మూడేళ్ల చాకిరీ!

రూ.15 వేల అప్పు తీర్చడం కోసం ఈ బడుగు జీవులు మూడేళ్ల వెట్టిచాకిరీ చేశారు. కళ్లముందే కన్నబిడ్డలు చనిపోతే, పనిచేసే చోటికి కాస్తంత దూరాన, మట్టిలో పాతేయమన్నాడు యజమాని. తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూలు జిల్లా గుంపనపల్లిలో దాసరి వీరయ్య, జ్యోతికి జరిగిందీ విషాదం. మొన్న నవంబరుతో వీరి వెట్టికి కాలం తీరి, ఈ విషయం వెలుగుచూసింది. ఇంతటి దారుణమైన పరిస్థితులు అనుభవించిన ఈ జంట ఇప్పుడు రోజు కూలికి వెళుతున్నారు. తమ పెద్ద బిడ్డ నాలుగేళ్ల చిన్నారిని భుజాన వేసుకుని పనికెళ్తున్న వీళ్లుతాము పడ్డ కష్టాలను ఆవేదనతో వివరిస్తున్నారు.

చెంచు తెగకు చెందిన వీరయ్య, జ్యోతి ... చంద్య నాయక్ ముదావత్ పొలంలో మూడేళ్ల క్రితం పనికి వచ్చారు. పొలం యజమాని దగ్గర తీసుకున్న రూ.15 వేలు అప్పు తీర్చడం కోసం ఈ పనికి కుదిరారు. రెండు నెలలు, రెండేళ్ళ, నాలుగేళ్ల వయసున్న బిడ్డలతో పనికి వచ్చిన ఈ కుటుంబం పట్ల యజమాని ఎప్పుడూ దయ చూపలేదు. తను పడ్డ కష్టాల గురించి వీరయ్య ఇలా చెబుతున్నాడు. 'చిన్న బిడ్డలిద్దరికీ జ్వరం వచ్చింది, కామెర్లు సోకాయి. ఆస్పత్రికి వెళ్దామంటే మా చేతిలో చిల్లిగవ్వ లేదు. యజమానిని ఎన్నిసార్లు అడిగినా డబ్బు ఇవ్వలేదు. 'రేపు, మాపు' అంటూ కాలయాపన చేశాడు. చూస్తుండగానే బిడ్డలిద్దరూ మా కళ్లెదుటే చనిపోయారు. మేం పని చేస్తున్న పొలానికి కాస్తంత దూరంలోనే ఇద్దరినీ మట్టిలో కలిపేశాం' అని వీరయ్య ఏడుస్తూ చెబుతుంటే జ్యోతి అచేతనంగా శూన్యంలోకి చూస్తూ ఉంది.

చెప్పులతో కొట్టేవారు

రేషన్ బియ్యం కొనుక్కునేందుకు యజమాని అనుమతి ఇచ్చేవాడు. కానీ కూరగాయలకు డబ్బులు ఇవ్వకుండా వేధించేవాడు. పాడైపోయిన, ఎండిపోయిన కూరగాయలు తీసుకొచ్చి వాటితోనే వంట చేసుకోమనేవారు. ఈ మూడేళ్లపాటు ఒక్క జత బట్టలతోనే కాలం గడిపాను. ఎప్పుడైనా డబ్బులు కావాలని అడిగితే చెప్పులతో కొట్టేవారు. ముఖం మీద, వీపు మీద, ఎక్కడ పడితే అక్కడ అదేపనిగా బాదేవారు. ఈ అవమానాలన్నీ రూ.15 వేలు అప్పు తీర్చేందుకే పడ్డాం' అని వీరయ్య తను పడ్డ వేదనను వివరించాడు.

జ్యోతి, వీరయ్య ఈ పనికి రాకముందే, జ్యోతి తల్లిదండ్రులు ఈ పొలంలో వెట్టి చేస్తున్నారు. జ్యోతి తండ్రి చనిపోయేంతవరకు అక్కడే పనిచేశాడు. తల్లి ఇంకా అక్కడే పనిచేస్తోంది. పొలంలో మనుషులు తక్కువైన ముదావత్, వీరయ్య పనిచేస్తున్న పొలం యజమానితో ఒప్పందం చేసుకున్నాడు. అతని దగ్గర వీరయ్య చేసిన అప్పు తీర్చేసి, అక్కడ నుండి తన పొలానికి వీళ్లని తీసుకొచ్చాడు. ఈ మొత్తం వ్యవహారం వీరయ్య, జ్యోతికి చివరివరకు తెలియదు.

ముదావత్ పొలానికి వచ్చాక వీరయ్య పిచికారీ చేసే పని, జ్యోతి పత్తి తీయడం, కలుపు తీయడం చేశారు. కరెంటు సౌకర్యం లేని, ఒక్క మనిషికి సరిపోయే గదిలో ముగ్గురు పిల్లలతో ఈ జంట మూడేళ్లు గడిపింది.

విశ్రాంతి లేకుండా పనిచేశాం

ఎక్కువ పనిగంటలు చేసినా యజమానికి అసలు కనికరం ఉండేది కాదు. ఒళ్లు నొప్పులు, తీవ్ర అలసటతో నిద్ర లేవడం ఆలస్యమైనా తన్ని లేపేవారు. 'ఇప్పటిదాకా పడుకుంటారా' అని నోటికొచ్చినట్లు తిట్టేవారు. కొట్టేవారు, చేతిలో ఏది ఉంటే దాంతో బాదేవారు. చాలా దయనీయ పరిస్థితులు అనుభవించాం. పండక్కి ఊరు వెళ్లాలన్నా తక్కువ రోజుల సమయమే ఇచ్చేవారు' అని ఆ బాధను గుర్తు చేసుకున్నాడు వీరయ్య.

వెట్టి నుండి బయటికి వచ్చిన ఈ జంటని స్థానిక స్వచ్ఛంద సంస్థ కలిసింది. దాని చొరవతో ఈ విషయం మరో సంస్థ ఫౌండేషన్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (ఎఫ్‌ఎస్‌డి) దృష్టికి చేరింది. 'ఇంత తక్కువ మొత్తానికి ఇంత కాలం పనిచేయడం, ఇన్ని కష్టాలు పడడం తెలిసి చాలా ఆశ్చర్యపోయాం. వ్యవసాయ కూలీలకు ఇచ్చే వేతనం ఇచ్చినా ఈ అప్పు నెలరోజుల్లోపు తీరిపోతుంది' అని ఎఫ్‌ఎస్‌డి సభ్యులు మహేష్ చెబుతున్నారు. వీళ్ల చొరవతో ఈ విషయం జిల్లా మెజిస్ట్రేట్ వద్దకు వెళ్లింది. వీరయ్య దంపతులకు పరిహారం అందేలా చూస్తామని సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు.

రంగవల్లి

13 చుక్కలు 7 వరుసలకు (మధ్య చుక్క)

- గోలి పార్వతి,
ఉయ్యూరు,
కృష్ణాజిల్లా.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

పొగ మంచు వేళ.. ప్రయాణం జాగ్రత్త!

చలి విపరీతంగా పెరుగుతున్న వేళ ఎటుచూసినా పొగమంచే కనిపిస్తోంది. ముఖ్యంగా వాహనదారులకు ఈ పొగమంచు అనేక ఇబ్బందులను కలిగిస్తుంది. అలసత్వంగా ఉంటే ప్రమాదాల బారిన పడతారు. పొగమంచు నుంచి మనల్ని మనం ఎలా రక్షించుకోవాలో తెలుసుకుందాం..

- సొంత కార్లు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు సాధ్యమైనంత వరకు అర్ధరాత్రి, తెల్లవారుజాము ప్రయాణాలు మానేయడం మంచిది.
- మంచు పడుతున్నప్పుడు ఫాగ్‌లైట్స్ తప్పనిసరిగా ఉపయోగించాలి.
- కొన్ని సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించవు. అలాంటప్పుడు అతివేగంతో వాహనం అసలు నడపకూడదు.
- ఒక్కోసారి రోడ్డుపై పడిన మంచుతో వాహనం జారిపడే ప్రమాదం ఉంటుంది. కాబట్టి పరిమిత వేగంలో వాహనం నడపాలి.
- సాధారణంగా బ్రేక్ వేస్తే కనీసం 50 అడుగుల దూరంలో వాహనం ఆగుతుంది. అతి వేగంగా ఉన్నప్పుడు 90 అడుగుల దూరంలో నిలుస్తాయి. అంటే సడన్‌గా బ్రేకులు వేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదు. కాబట్టి సాధారణ వేగంలో వాహనాలు నడిపితేనే నియంత్రణ సాధ్యమవుతుంది.
- ఈ కాలంలో వాహన సామర్థ్యం సరిగా ఉండేలా చూసుకోవాలి. 'వైపర్లు సరిగ్గా పనిచేస్తున్నాయా? బ్రేకులు సమస్యల్లేకుండా ఉన్నాయా లేదా' అని చెక్ చేసుకోవాలి?
- కారులో వెళ్లేటప్పుడు హీటర్ ఉపయోగించాలి. దీనివల్ల ముందు అద్దాలు ఆవిరిపట్టకుండా ఎదుటి వాహనాలను సరిగ్గా గమనించేందుకు వీలు ఉంటుంది.
- పొగమంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఓవర్‌టేక్ చేయవద్దు. పొగమంచులో దూరాన్ని నిర్ధారించడం కష్టం. కాబట్టి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరం. ముందున్న ఇతర వాహనాల డ్రైవర్లు పరధ్యానంలో ఉంటే ఢీకొనే అవకాశాలు పెరుగుతాయి.
- మంచు కురుస్తున్న సమయంలో 'లో బీమ్ హెడ్‌లైట్స్'ను ఉపయోగించాలి. హై బీమ్ హెడ్‌లైట్స్ ఆన్ చేస్తే మంచు తుంపర్లు రిఫ్లెక్ట్ అవుతాయి. ఈ కారణంగా ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందిగా మారుతుంది. కాబట్టి మంచు కురిసే సమయంలో టేల్ లైట్, బ్లింకర్స్‌ను ఉపయోగించడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగదు.
- వాహనాలను డ్రైవింగ్ చేసే సమయంలో స్మార్ట్ ఫోన్ వినియోగం, ఎక్కువ సౌండ్‌తో మ్యూజిక్ వినడం లాంటివి చేయకూడదు. వీటివల్ల బయటి శబ్దాలు వినిపించవు. కాబట్టి విండోను కాస్తయినా డౌన్ చేయాలి దీనివల్ల బయట వాహనాల శబ్దాలు వినిస్తాయి.
- డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఎదురుగా ఉండే వాహనాల మధ్య దూరం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ అవతలి వ్యక్తులు సడెన్ బ్రేక్‌లు వేస్తే, వాహనం కంట్రోల్ కావాలంటే కచ్చితంగా గ్యాప్ ఉండాలి. వాహనాల మధ్య గ్యాప్ ఉండకపోతే.. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- వాహనాలకు లైట్ ఇండికేటర్స్ సరిగ్గా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి. రోడ్డు లైన్ మారుతున్న సమయంలో లేదా మలుపులు ఉన్న చోట ఇండికేటర్స్ వేయడం ద్వారా ఇతర వాహనదారులను అలర్ట్ చేయొచ్చు. దీనివల్ల అనుకోకుండా జరిగే ప్రమాదాలను తగ్గించవచ్చు.
- మంచు కురుస్తున్న సమయంలో మీ వాహనాలను రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకూడదు. ఒకవేళ రోడ్డు పక్కన పార్కింగ్ చేయాల్సి వస్తే ఇండికేటర్స్‌ను ఆన్ చేయాలి.

ఈ ఏడాది వెండితెర వెలిగేనా!

గతేడాదిలో నాలుగైదు నెలలు మినహా మిగతా కాలమంతా థియేటర్లు వెలవెలబోయాయి. దేశంలో మొత్తం మొత్తం 6,877 థియేటర్లు ఉండగా ఆంధ్రాలో అత్యధికంగా 1097, తమిళనాడులో 943, కర్నాటకలో 719, మహారాష్ట్రలో 703, తెలంగాణాలో 485 థియేటర్లు ఉన్నాయి. టాలీవుడ్, దక్షిణాది, బాలీవుడ్, హాలీవుడ్ ఇలా పరిశ్రమలు నడుస్తున్నాయి. ఆయా ప్లాట్‌ఫారాల్లో వచ్చిన సినిమాలు ఎక్కడైనా థియేటర్లలో విడుదల చేసుకునే అవకాశాలు ఉన్నాయి. అందుకే అనేక భాషా సినిమాలను డబ్బింగ్ చేసి ప్రాంతీయ భాషల్లో విడుదల చేస్తున్నారు. ఇలా చూస్తే గతేడాది చాలావరకూ డబ్బింగ్ సినిమాలులో తెలుగులో విరివిగా వచ్చాయి.

హనుమాన్, కల్కి, దేవర, పుష్ప 2లదే హవా

గతేడాది సంక్రాంతికి విడుదలైన గుంటూరు కారం, సైంధవ్, నా సామిరంగా, హనుమాన్ సినిమాల్లో హనుమాన్ బిగ్గెస్ట్ హిట్‌గా నిలవగా ఆ తర్వాత స్థానంలో గుంటూరు కారం ఉంది. సైంధవ్, నా సామిరంగ మిశ్రమ ఫలితాలను అందుకున్నాయి. అప్పటి నుంచి మే నెల వరకూ పెద్ద సినిమాలేమీ రాకపోవటం, ప్రేక్షకులు సినిమా థియేటర్లకు రావటం తగ్గించేశారు. ఆక్యుపెన్సీ లేకపోవటం, నిర్వాహణా ఖర్చులు తడిచిమోపెడు కావటంతో యజమానులు థియేటర్లను ఏప్రిల్‌లో మూసేశారు. మేలో విడుదలైన కల్కి, సెప్టెంబర్‌లో విడుదలైన దేవర పాజిటివ్ టాక్‌ను అందుకోవటంతో అప్పటినుంచి థియేటళ్లు కళకళలాడుతూ కనిపించాయి. డిసెంబర్‌లో విడుదలైన పుష్ప 2 బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. టాలీవుడ్‌లో బాహుబలి సినిమా అత్యధిక వసూళ్లు కొల్లగొట్టి అగ్రస్థానంలో ఉంది. దీనికి ముందు దీపావళి కానుకగా విడుదలైన సినిమాల్లో అమరన్, లక్కీ భాస్కర్ సినిమాలు మంచి కథలతో బాగా ఆకట్టుకున్నాయి. విజయ్‌సేతుపతి మహారాజ, విడుదల 2 కూడా హిట్‌గా నిలిచాయి. నాని 'హాయ్ నాన్న', చియాన్ విక్రమ్ నటించిన తంగలాన్ ప్రేక్షకులను బాగానే ఆకట్టుకున్నాయి. హీరో వెంకటేష్ సైంధవ్, రవితేజ 'ఈగల్' ఫిబ్రవరిలో విడుదలై తీవ్రంగా నిరాశపర్చాయి. రామ్ పోతినేని– పూరీ జగన్నాథ్‌తో కలిసి చేసిన 'డబుల్ ఇస్మార్ట్' డబుల్ షాక్ ఇచ్చింది. మెగా హీరో వరుణ్‌తేజ్ ఆపరేషన్ వాలెంటైన్, మట్కా రెండు సినిమాలతో పలకరించినప్పటికీ సక్సెస్‌ను మాత్రం అందుకోలేకపోయారు. విజయ్ దేవరకొండ నటించిన 'ఫ్యామిలీ స్టార్' మంచి టాక్‌ను అందుకున్నా పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. శర్వానంద్ 'మనమే' కూడా డిజాస్టర్‌గా మిగిలింది. అశ్విన్‌బాబు శివంభజే, అల్లు శిరీష్ బడ్డీ, రాజ్ తరుణ్ తిరగబడరా సామీతోపాటుగా కొన్ని చిన్న సినిమాలు విడుదలైనా థియేటర్లలో మాత్రం సందడి చేయలేకపోయాయి.

'కంగువా', 'మట్కా' రెండూ పీరియాడికల్ యాక్షన్ సినిమాలే. సూర్య, వరుణ్‌తేజ్ ఇప్పటివరకూ కనిపించని లుక్‌లో కనిపించినా, ఈ సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయాయి. సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించిన కంగువా సినిమా టాలీవుడ్‌లో బాహుబలిని పోల్చిచెప్పారు. అయినా డిజాస్టర్‌గానే మిగిలింది. బాలీవుడ్‌లో ఆడియన్స్‌ను విశేషంగా అలరించిన చిత్రాల్లో 'భూల్ భూలయా 3', 'సింగం అగైన్' ఉన్నాయి. అశోక్ గల్లా నటించిన 'దేవకీ నందన వాసుదేవ', నవీన్‌చంద్ర ప్రధాన పాత్రలో నటించి క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్ 'లెమెన్' కూడా ఆడలేదు. 'గ్లాడియేటర్ 2'. హిందీ సినిమా 'ది సబర్మతీ రిపోర్ట్' కూడా పెద్దగా ఆదరణకు నోచుకోలేదు. విశ్వక్‌సేన్ హీరోగా నటించిన 'మెకానిక్ రాకీ', సత్యదేవ్, డాలీ ధనుంజయ హీరోలుగా నటించిన చిత్రం 'జీబ్రా' కూడా ప్రభావాన్ని చూపలేకపోయాయి.

సినిమాల్లో సరి'కొత్త' ఆశలు

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో 'అఖండ 2'కు ప్రాజెక్టును చేపట్టారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 25న దసరా కానుకగా ఈ సినిమా విడుదల కానుంది. అల్లు అర్జున్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో కొత్త ప్రాజెక్టుకు కథ, ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దర్శకుడు సుకుమార్–రామ్‌చరణ్‌తో మరో సినిమా తీయబోతున్నారు. ఆర్‌సి 17వ సినిమాగా మైత్రీమూవీ మేకర్స్ తెరకెక్కించనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 10న రామ్‌చరణ్–దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ బడ్జెట్ సినిమా 'గేమ్ ఛేంజర్'. వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' పెద్ద సినిమాలు. చిరంజీవి 'విశ్వంభర', నితిన్ 'రాబిన్‌హుడ్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వేసవిలో వినోదాన్ని అందించటానికి ఇవి రెడీగా ఉన్నాయి. ప్రభాస్ సలార్ 2, రాజాసాబ్ షూటింగ్‌లో ఉన్నాయి. గతేడాది ఆఖరులో విడుదలైన పుష్ప 2 ఊపు ఇంకా తగ్గలేదు. కొత్త ఏడాది, అందునా సంక్రాంతికి 'గేమ్‌ఛేంజర్' రామ్‌చరణ్– శంకర్ కాంబినేషన్‌లో వస్తుండటంతో అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. బాలకృష్ణ, వెంకటేష్ నటించిన చిత్రాలు కూడా విడుదల కానుండటంతో సంక్రాంతికి వెండితెర సందడి దండిగానే ఉంటుంది.

సిరీస్ చేజారె..!

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆసీస్ సొంతం
ఆరు వికెట్ల తేడాతో సిడ్నీలో ఘన విజయం
3-1తో భారత్‌పై కంగారూల సూపర్ విక్టరీ

సిరీస్‌తో ఆసీస్ టీమ్

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ టీమ్ ఇండియా చేజారింది. దశాబ్ద కాలంగా ఆసీస్‌పై తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన భారత్.. కొత్త ఏడాదిని ఓటమితో మొదలెట్టింది. బుమ్రా లేని బౌలింగ్‌కు పస లేకపోవటంతో సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఆసీస్ అలవోకగా ఛేదించింది. ఆరు వికెట్ల తేడాతో సిడ్నీ టెస్టులో ఘన విజయం సాధించింది. 3-1తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని సొంతం చేసుకుంది.

సిడ్నీ : ఆస్ట్రేలియా ఎట్టకేలకు సాధించింది. ఐసీసీ వన్డే, టెస్టు చాంపియన్‌గా కొనసాగుతున్న కంగారూలను సుమారు దశాబ్ద కాలంగా ఊరిస్తోన్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని అందుకుంది. సిడ్నీ టెస్టులో భారత్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించిన ఆస్ట్రేలియా.. 3-1తో టెస్టు సిరీస్‌ను కైవసం చేసుకుంది. 162 పరుగుల ఛేదనలో ఉస్మాన్ ఖవాజా (41, 45 బంతుల్లో 4 ఫోర్లు), ట్రావిశ్ హెడ్ (34 నాటౌట్, 38 బంతుల్లో 4 ఫోర్లు), బ్యూ వెబ్‌స్టర్ (39 నాటౌట్, 34 బంతుల్లో 6 ఫోర్లు) రాణించారు. 27 ఓవర్లలోనే ఆసీస్ లాంఛనం ముగించింది. మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ఐదు టెస్టుల్లో 32 వికెట్లు పడగొట్టిన పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు.

అలవోకగా ఛేదన : 162 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా అలవోకగా ఛేదించింది. ఓపెనర్లు ఉస్మాన్ ఖవాజా (41), శామ్ కాన్‌స్టాస్ (22, 17 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడారు. కాన్‌స్టాస్ కొత్త బంతిపై విరుచుకుపడ్డాడు. దీంతో ఆరుకు పైగా రన్‌రేట్‌తో ఆసీస్ పరుగులు పిండుకుంది. కాన్‌స్టాస్, మార్నస్ లబుషేన్ (6), స్టీవ్ స్మిత్ (4) వికెట్లతో యువ పేసర్ ప్రసిద్ కృష్ణ భారత శిబిరంలో కాస్త ఉత్సాహం రేపాడు. కానీ ట్రావిశ్ హెడ్ (34 నాటౌట్), బ్యూ వెబ్‌స్టర్ (39 నాటౌట్) భాగస్వామ్యం ఆసీస్‌ను ముందంజలో నిలిపింది. వెన్ను నొప్పితో రెండో రౌండ్ మధ్యాహ్నం నుంచి మైదానంలో అడుగుపెట్టని కెప్టెన్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఆసీస్ ఛేదనలో బంతి అందుకోలేదు. దీంతో నాయకుడిగా పేస్ దళం ఆసీస్‌ను ఆశించిన స్థాయిలో ఇరకాటంలో పెట్టలేదు. హెడ్, వెబ్‌స్టర్ 53 బంతుల్లోనే 58 పరుగులు జోడించి లాంఛనం ముగించింది.

బొలాండ్ సిక్సర్ : ఆసీస్ పేసర్ స్కాట్ బొలాండ్ (6/45) ఆరు వికెట్లు పడగొట్టాడు. దీంతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 157 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 141/6తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ చివరి నాలుగు వికెట్లను 16 పరుగులకే కోల్పోయింది. రవీంద్ర జడేజా (13, 45 బంతుల్లో 2 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్ (12, 43 బంతుల్లో 1 ఫోర్) ప్రతిఘటించలేదు. వేగంగా పరుగులు చేయటంలోనూ విఫలం అయ్యారు. సిరాజ్ (4), బుమ్రా (0), ప్రసిద్ కృష్ణ (1 నాటౌట్) నుంచీ మెరుపులు లేవు. దీంతో 39.5 ఓవర్లలో భారత్ 157 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్ నాలుగు పరుగుల ఆధిక్యంతో కలిపి.. ఆసీస్‌కు 162 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. విరాట్ కోహ్లి (6), జైస్వాల్ (22), రాహుల్ (13), జడేజా, నితీశ్ (4), సుందర్ నిరాశపరచగా.. రిషబ్ పంత్ (61) అర్ధ సెంచరీతో భారత్‌ను మెరుగైన స్థితిలో నిలిపిన సంగతి తెలిసిందే.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 185/10
ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 181/10
భారత్ రెండో ఇన్నింగ్స్ : 157/10
ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : శామ్ కాన్‌స్టాస్ (సి) వాషింగ్టన్ (బి) ప్రసిద్ కృష్ణ 22, ఉస్మాన్ ఖవాజా (సి) పంత్ (బి) మహ్మద్ సిరాజ్ 41, మార్నస్ లబుషేన్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ కృష్ణ 6, స్టీవ్ స్మిత్ (సి) జైస్వాల్ (బి) ప్రసిద్ కృష్ణ 4, ట్రావిశ్ హెడ్ నాటౌట్ 34, బ్యూ వెబ్‌స్టర్ నాటౌట్ 39, ఎక్స్‌ట్రాలు : 16, మొత్తం : (27 ఓవర్లలో 4 వికెట్లకు) 162.

వికెట్ల పతనం : 1-39, 2-52, 3-58, 4-104.

బౌలింగ్ : మహ్మద్ సిరాజ్ 12-1-69-1, ప్రసిద్ కృష్ణ 12-0-65-3, నితీశ్ కుమార్ రెడ్డి 2-0-10-0, వాషింగ్టన్ సుందర్ 1-0-11-0.

హైదరాబాద్‌కు ఊరట

- **అరుణాచల్‌పై 8 వికెట్లతో గెలుపు**

అహ్మదాబాద్ : విజయ్ హజారే ట్రోఫీ (50 ఓవర్లు) నుంచి హైదరాబాద్ నిష్క్రమించింది. గ్రూప్–సిలో అగ్ర జట్లతో పోటీపడిన హైదరాబాద్ ఏడు మ్యాచుల్లో నాలుగు విజయాలు సాధించింది. గ్రూప్‌లో నాల్గో స్థానంలో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించలేదు. గ్రూప్ దశలో ఆదివారం జరిగిన చివరి మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్‌పై హైదరాబాద్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. స్పిన్నర్లు తనయ్ త్యాగరాజన్ (5/32), అనికెత్ రెడ్డి (4/14) మాయజాలంతో తొలుత అరుణాచల్ 28.3 ఓవర్లలో 96 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప లక్ష్యాన్ని హైదరాబాద్ 12 ఓవర్లలోనే ఊదేసింది. తన్మయ్ (22), నితేశ్ (29 నాటౌట్), హిమతేజ (21 నాటౌట్) రాణించారు. ఇక గ్రూప్–బిలో నాలుగు విజయాలు సాధించిన ఆంధ్ర సైతం నాకౌట్‌కు అర్హత సాధించలేదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68